వాసుల్ గిరి సంగీతేశ్వరిత్వ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 175 పేజీలు: 10+4 వెల: 6.50

డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగం విజయవంతం

5లో

రెండు దేశాల మధ్య రాజుకుంటున్న శివాలయాల వివాదం

# నేను సైతం దత్తత



శుక్రవారం సచివాలయంలో పీ4 లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం నారా చంద్రబాబునాయుడు

## సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

### పీ4లోగోను ఆవిష్కరించిన సీఎం

### పేదరిక నిర్మూలనకు అందరూ కలిసి రావాలి

### ఇప్పటివరకు 5,74,811 కుటుంబాల గుర్తింపు

**విజయవాడ, జూలై 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సంకల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను కూడా కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు శుక్రవారం సచివాలయంలో జీరో పావర్టీ పీ4పై జరిగిన సమీక్షలో అధికారులకు స్పష్టం చేశారు. పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములు అవుతారని చెప్పారు. అందరిలో చైతన్యం నింపేలా మరింత మంది సంపన్నులు మార్గ దర్శులుగా ముందుకు వచ్చేలా తన నిర్ణయం దోహద పడుతుందని అన్నారు. పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోందని, పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. దీనిని విజయవంతం చేసేందుకు అత్యుత్తమ విధానాలను అన్ని చోట్లా అమలు చేసి చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారందరినీ ఈ కార్యక్రమంలో మమేకం చేయాలని నిర్దేశించారు. ప్రవాసాంధ్రులను కూడా భాగస్వామం చేసేందుకు ఏపీ ఎన్నార్టీ సొసైటీ సాయం తీసుకోవాలని చెప్పారు. అలాగే కార్పొరేట్ సంస్థలు దీనికి కలిసి వచ్చేలా చూడటంతో పాటు వారితో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లాల కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికే చెందిన ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని సూచించారు. ఒకవేళ స్థానికంగా మార్గ దర్శులు లేకపోతే అప్పుడు స్థానికేతరులను అనుసంధానం చేయా లని నిర్దేశించారు. పీ4 కార్యక్రమంలో భాగస్వామి అయ్యేందుకు రాష్ట్ర స్థాయిలో దాతలు ముందుకు వస్తే వారిచ్చే నిధుల కోసం కామన్ ఫండ్ ఏర్పాటు చేయాలని, దాని ద్వారా బంగారు కుటుంబాలకు సాయం అందించవచ్చని సీఎం స్పష్టం చేశారు. సమావేశంలో సీఎం చంద్రబాబు పీ4లోగోను ఆవిష్కరించారు.పీ4 లోగో ముద్రించిన బ్యాడ్జీని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పియూష్‌కుమార్ సీఎం చొక్కాకు పిన్‌చేసారు.

**ఆగస్టు10లోగా పీ4 ప్రాధాన్యతల సర్వే:** బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను ఆగస్ట్10లోగా పూర్తి చేయాలి. మార్గదర్శులు అందించే ఆర్థిక, ఆర్థికేతర సాయం

>>2





# మాల్దీవులకు రూ.4850 కోట్ల సాయం

### రెండుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి కృషి

### కీలకరంగాల్లో పరస్పర సహకారానికి ఇరుదేశాల అంగీకారం

### మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జుతో భేటీ తర్వాత ప్రధాని మోడీ

**మాలె(మాల్దీవులు) జూలై 25:** ఇరుగుపొరుగుదేశాలకే తొలిప్రాధాన్యం కింద మాల్దీవుల దేశానికి ప్రముఖ స్థానం ఉందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. బ్రిటన్ పర్యటనను ముగించుకుని శుక్రవారం మాల్దీవులు చేరుకున్న ప్రధాని దేశ అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్‌కు మాల్దీవులు అత్యంత విశ్వసనీయదేశమని అన్నారు. ఈ ద్వీపకల్ప దేశానికి లైన్ ఆఫ్ క్రెడిట్‌కింద రూ.4850 కోట్ల ఆర్థికసాయం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. వాణిజ్య, రక్షణ, మౌలిక వసతులు తదితర రంగాల్లో పరస్పర సహకారానికి ఇరుదేశాలు అంగీకరించినట్లు ప్రధాని అన్నారు. భారత్‌మాల్దీవులమధ్య స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబందించిన చర్చలు ప్రారంభం అయ్యాయన్నారు. ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం ఖరారుకు ఇరుదేశాలుకృషిచేస్తున్నాయనిచెప్పారు. భారత్ అనుసరించే పొరుగుకే ప్రాధాన్యం మహాసాగర్ విధానాల్లో మాల్దీవులకే ఎక్కువ ప్రాధాన్యం ఉందన్నారు. రక్షణ సామర్థ్యాలనున బలోపేతంచేసుకోడానికి ద్వీపదేశానికి భారత్ నిరంతరం మద్దతిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాల్దీవులకు వెళ్లారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆ దేశంలో అడుగుపెట్టారు. ఆయనకు ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు, విదేశాంగ, రక్షణ, ఆర్థిక, హోంశాఖ మంత్రులు విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలికారు.

>>2

# ముందస్తు చర్యలు చేపట్టాలి



### హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** భారీ వర్షాలకు వరద ముంపు ప్రమా దాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత ఆదేశించారు. ప్రమాద హాట్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత వాతావరణ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, సిబ్బందితో ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. వాయుగుండం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాలను తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, జార్ఖండ్ వైపుగా ఇది కదలే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. కోస్తాంధ్రలో ఆదివారం వరకు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవచ్చని చెబుతున్నా

>>2

## వాయుగుండంగా అల్పపీడనం

### శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, మన్యం, విశాఖ, కృష్ణా జిల్లాలకు ఎల్లో అలెర్ట్

### ఉత్తర కోస్తా పోర్టులకు మూడో నెంబర్, దక్షిణ కోస్తా పోర్టులకు ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వర్షాల జోరు తగ్గడం లేదు. కృష్ణా,గోదావరి నదులకు భారీగా ఎగువ నుంచి వరద నీరు చేరుతుంది. విజయవాడలో ప్రకాశం బ్యారేజీ కొనసాగుతున్న వరద 25 గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేసిన అధికారులు. ఇన్ ఫ్లో 20,748 క్యూసెక్కులు అవుట్ ఫ్లో 18,125 క్యూసెక్కులు ఇబ్రహీంపట్నం రాయపూడి మధ్య లాంచీల ప్రయాణం తాత్కాలికంగా నిలిపివేసారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరికి అంతకంతకు వరద నీరు వచ్చిచేరుతుంది.

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారినట్లు భారత వాతావరణ విభాగం పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో 4 రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, మన్యం, విశాఖ,

>>2



శుక్రవారం అమరావతి నిర్మాణ పనులపై అధికారులనుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

### మూడేళ్లలో అమరావతి నిర్మాణం

### గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న సింగపూర్ సంబంధాలు: మంత్రి నారాయణ

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని నిర్మాణంపై కొంతమంది పనిగట్టుకుని చేసే దుష్ప్రచారాలు నమ్మవద్దని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.ప్రజలకు,అమరావతి రైతులకు ఇచ్చిన మాటప్రకారం మూడేళ్లలో ఖచ్చితంగా నూటికి నూరు శాతం రాజధాని పనులు పూర్తిచేసి తీరుతామన్నారు.అమరావతిలో జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు మంత్రి. సీఆర్డీఏ ఇంజినీర్లతో కలిసి నేలపాడులోని నాన్ గెజిటెడ్ అధికారులు,గెజిటెడ్ అధికారులు టైప్ 1,టైప్ 2,గ్రూప్ డి ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు.అక్కడ పనులు జరుగుతున్న

>>2

# హాస్టళ్ల నిర్వహణకు సహకారమందించాలి

### బిసి సంక్షేమ మంత్రి ఎస్.సవిత



**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 మోడల్ లో వెనుకబడిన తరగతుల హాస్టళ్లను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు.దీనిలో భాగంగా దాతలు, ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం కింద లబ్ధి పొంది ఉన్నత స్థితిలో ఉన్న విద్యార్థుల సాయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబునాయుడు పీ4 మోడల్‌కు శ్రీకారం చుట్టారన్నారు. సామాజిక బాధ్యత కింద ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న10 శాతం మంది ధనికులు, 20 శాతం మంది పేదలను ఆదుకునేలా పీ

>>2

# పలువురు ఐపిఎస్‌ల బదలీ

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పలువురు ఐపిఎస్ అధికారుల బదిలీ, నియామకాలు జరిగాయి.ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేసారు.ఈ ఉత్తర్వులను అనుసరించి విపత్తునిర్వహణ, అగ్నిమాపకశాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ బదిలీ అయ్యారు. ఆయనను రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌గా నియమించారు.అగ్నిమాపకశాఖ డైరెక్టర్ వెంకటరమణకు డీజీగా అదనపు బాధ్యతలు చెపట్టారు. వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ శ్రీధర్‌రావును సీఐడీ ఎస్పీగా నియమించారు.ఒక్కటి రెండు రోజుల్లో మరికొంత మంది ఐపిఎస్ అధికారులను బదిలీ చేసే అవకాశం ఉందంటున్నారు.ఎస్పీ క్యాడర్‌లో లూప్‌లైన్లో ఉన్న వారిని జిల్లాలకు మార్చే అవకాశం ఉందంటున్నారు.

## ఆల్కహాల్ దుర్వినియోగంపై ఉక్కుపాదం

### ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా

### పకడ్బందీగా ఎథనాల్ రవాణా పర్యవేక్షణ



**విజయవాడ,జూలై 25,ప్రభాత వార్తప్రతినిధి:** పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఎక్స్ట్రా న్యూట్రల్ఆల్కహాల్ (ఇ ఎన్ఏ), రెక్టిఫైడ్ స్పిరిట్ (ఆర్ఎస్),

>>2

# గోవిందుని ఆలయంలో 'మహాద్వారం' రగడ

### తరచూ ఉద్యోగులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం , నిబంధనల మేరకు గేట్ తెరవలేని సిబ్బంది





**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వేంకటేశ్వర స్వామిని ఎంతో భక్తితో విశ్వాసంతో సామాన్య భక్తులు నుండి ప్రముఖుల వరకు దర్శనం చేసుకుని ఆలయం వెలుపలకు ప్రశాంతమనస్సుతో రావడం పరిపాటి. మనస్సంతా గోవిందనామంతోనే పరితపిస్తుంటుంది. అలాంటిది కొందరు ప్రజాప్రతినిధులు మొక్కుబడిగా దేవదేవుడిని దర్శనం చేసుకున్నామా, తమ పలుకుబడి ఉపయోగించి ఆర్భాటంగా ఆలయ ఉద్యోగులపై పెత్తనం చలాయించామా? అనే రీతిలో వ్యవహరిస్తుండటం భక్తిభావాన్ని దెబ్బ తీసేలా మారింది. ఇలాంటి ఘటనలు వరుసగా తరచూ చోటుచేసుకొంటుండటంతో క్యూలైన్లో ఉన్న భక్తులేగాక ఎంతో భక్తిభావంతో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు కూడా ఒకింత ఆవేదన వ్యక్తం చేస్తుండటం ఇప్పుడు రచ్చచర్చగా మారింది. సాధారణంగా ప్రముఖులు తమతోబాటు వచ్చే విఐపిలను వెంకన్న దర్శనానికి వెంటబెట్టుకుని వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నుండి ఆలయంలోనికి వస్తుంటారు. ఉదయం వేళ విఐపి బ్రేక్ దర్శనంలో ప్రజాప్రతినిదులు,వారి సిఫార్సు లేఖలపై వచ్చేభక్తులు, రాజ్యాంగ పరిధిలోని ప్రముఖులు వస్తుంటారు. వీరంతా ఆలయంలో మహద్వారం నుండి ధ్వజస్తంభం దాటుకుని బంగారువాకిలిమీదుగా ఆనంద నిలయంలోనికి చేరుకుంటారు. మొదటిగడప కులశేఖరపడి వరకు వెళ్ళి మరీ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దగ్గరగా నిలబడి దర్శనం చేసుకుని ఆశీస్సులందుకుంటారు. వీరంతా తిరిగి ఆలయంలోపల నుండి వెలుపలకు రావడానికి మార్గం ఉంది. ఈ మార్గంలోనే వెలుపలకు రావాలి. అయితే కొందరు ప్రజాప్రతినిధులు తమ పలుకుబడి ఏంటో చూపాలనే తపనతో వెలుపల గడప నుండి మహద్వారం గేట్ మీదుగా బయటకు రావడానికి సుముఖత చూపుతుంటారు. అయితే తిరుమల ఆలయంలో మహద్వారం గేట్ అత్యంత భద్రతతో కూడుకున్నది. ఈ గేట్‌నుండి వెలుపలకు ఆలయంలోపల విధులు నిర్వహించే అర్చకులు,టిటిడి పాలకమండలి ఛైర్మన్, ఇఒ,అదనపు ఇఒ,జెఇఒ, సివిఎస్‌ఒ, ఆలయ ఏవిఎస్‌ఒ ,ప్రధాన అర్చకలు ,అర్చకులకు మాత్రమే వెసలుబాటు ఉంది. ఇంకా ఆలయంలోపల భక్తుల రద్దీ ఎక్కువైన సమయంలో భక్తులు సులభంగా వెలుపలకు రావడానికి మహద్వారం గేట్‌లను తెరచి పంపుతుంటారు. ఆ సమయంలో కూడా భక్తులు ఎవరూ ఈ గేట్‌లో లోపలకు వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత అక్కడి సిబ్బందిపై ఉంటుంది. అలాంటిది ఇటీవల కాలంలో తరచూ కొందరు ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులు తమ ప్రాపకం కోసం మహద్వారం గేట్‌నుండి వెలుపలకు రావడానికి అక్కడి సిబ్బందితో గొడవకు దిగుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గేట్‌తెరవలేమని, వెలుపలకెళ్ళే మార్గం నుండి వెళ్ళాలని మర్యాదపూర్వకంగా సూచించినా అందుకు తిరస్కరించి దూషణల పర్వం, బెదిరింపు చేయడం జరుగుతోంది. బుధవారం ఉదయం అధికారపార్టీకి చెందిన వెంకటగిరి ఎమ్మెల్యే కె.రామకృష్ణ తన అనుచరులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయం నుండి వెలుపలకు వచ్చేందుకు మహద్వారం ముందు గేట్‌తీయాలని కోరాడు. అందుకు అక్కడి సిబ్బంది నిరాకరించడంతో ఆగ్రహం వెలిబుచ్చారు. ఇటీవలే జిడినెల్లూరు ఎమ్మెల్యే థామస్, గతంలో కర్నాటకకు చెందిన ఓ టిటిడి బోర్డు సభ్యుడు కూడా ఇదే రీతిలో టిటిడి ఉద్యోగులపై విరుచుకుపడ్డారు. తరచూ ఆలయం మహద్వారం ముందు గేట్ టిటిడి ఉద్యోగులకు అభద్రతను చేకూరుస్తోంది. టిటిడి ఉన్నతాధికారులు, విజిలెన్స్ ఉన్నతాధికారులు ఈ సున్నితమైన విషయంపై స్పష్టమైన ఆదేశాలిస్తే అటు ప్రజాప్రతినిధులు ఇటు ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవనేది టిటిడి వర్గాల వాదన.

## విమానం గాల్లో ఉండగానే మహిళ ప్రసవం

**ముంబయి,జూలై 25:** విమానం ఏకంగా 35 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోంది. సరిగ్గా అప్పుడే ఓ గర్భిణికి పురిటినొప్పులు మొదలయ్యాయి. ఫ్లైట్ సిబ్బంది అవసరమైన చర్యలు చేపడుతుండగానే ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం మస్కట్ నుంచి ముంబై కి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన ఓ 29ఏళ్ల మహిళ మస్కట్ నుంచి ముంబైకి బయదేరిన విమానం ఎక్కింది. విమానం ఏకంగా 35 వేల అడుగుల ఎత్తులో వెళ్తుండగా గర్భిణి అయిన ఆ థాయ్ మహిళకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దాంతో విమాన సిబ్బంది అప్రమత్తమయ్యారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న ఓ నర్సు సాయంతో ప్రసవం చేయించారు. తల్లీబిడ్డ గోప్యతను కాపాడేందుకు ప్రయాణికులను సీట్లు మారుస్తుండగానే ప్రసవం జరిగింది.



# ధన్‌ఖడ్‌కు ప్రతిపక్షాల వీడ్కోలు విందు..

### స్పందించని కేంద్రం!

**న్యూఢిల్లీ, జులై25:** ఉపరాష్ట్రపతిగా ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ రాజీనామా చేసి జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశ రాజకీయాల్లో సంచలనం రేపింది. ఆయనకు అధికారికంగా వీడ్కోలు పలుకుదామని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది. దాంతో విపక్షాలే ఆయనకు వీడ్కోలు విందు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ కార్యక్రమానికి ఆయన్ను ఆహ్వానించినట్లు సమాచారం. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేసినట్లు ధన్‌ఖడ్ పేర్కొన్నప్పటికీ విపక్షాలు మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. కేంద్ర హోంశాఖ కూడా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం అటు ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఆయనకు వీడ్కోలు పలకాలని ఇప్పటికే కాంగ్రెస్ కోరిందని, కానీ కేంద్రం మాత్రం మౌనం వహించిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ధన్‌ఖడ్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. అయితే కేంద్రం దీనిపై స్పందించలేదు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జెపి నడ్డా కూడా ఈ విషయంపై ఏం మాట్లాడలేదని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్రం అనురిస్తోన్న ఈ తీరు కూడా విపక్షాల అనుమానాలకు మరింత ఆజ్యంపోస్తోంది. ఇక విపక్షాల ఆహ్వానాన్ని ధన్‌ఖడ్ అంగీకరించకపోవచ్చని తెలుస్తోంది.




శుక్రవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో బీహార్ ఓటర్ల సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఎంపీల నిరసనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

>> వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.ఆ తర్వాత నేలపాడులో మీడియాతో మాటాడుతూ గత ప్రభుత్వం అమరావతిపై కక్షతో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసింది.ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసింది.అమరావతి విషయంలో తీసుకున్న నిర్ణయాలతో వాటిని సరిదిద్దేందుకు ఏడాది పట్టింది...పాత టెండర్లు రద్దు చేయలేదు.కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేదు. న్యాయపరమైన సమస్యలు రాకుండా ఉండేందుకు కమిటీలు వేసి అన్నీ పరిష్కరించాల్సి వచ్చింది. ఆ తర్వాత గతంలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాల పటిష్టత విషయంలో ఐఐటీ చెన్నై,ఐఐటీ హైదరాబాద్ నిపుణులతో కమిటీలు వేసాం. ఎట్టకేలకు అన్ని నివేదికల ఆధారంగా తిరిగి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించామన్నారు. .ప్రస్తుతం అమరావతిలో సుమారు పదివేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అవసరమైన యంత్రాలు కూడా ఇప్పటికే పనుల్లో ఉన్నాయి.నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కోసం మొత్తం 21 టవర్లలో 1995 ఫ్లాట్లు నిర్మిస్తున్నాం.వీటిలో 9 టవర్ల నిర్మాణం పూర్తయింది. మిగతా టవర్ల నిర్మాణం డిసెంబర్ నెలాఖరుకు పూర్తవుతుంది.ఇక గెజిటెడ్ ఆఫీసర్ల కోసం మొత్తం 14 టవర్లలో 1140 ఫ్లాట్లు నిర్మిస్తున్నాం.వీటిలో 11 టవర్ల నిర్మాణం పూర్తయింది. మరో 5 టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతుంది. భవనాల నిర్మాణాలతో పాటు రోడ్లు,తాగునీరు,డ్రైనేజి నిర్మాణాలు కూడా సమాంతరంగా జరుగుతున్నాయి..మొత్తం 4000 ఫ్లాట్ల నిర్మాణంతో ఒక టౌన్ షిప్ తయారుకానుంది..

కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా ఇక్కడ నివాసం ఉండే వారికోసం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఎస్ ఆర్ ఎం,విట్ యూనివర్శిటీలు అమరావతిలో మెడికల్ కాలేజీలు నెలకొల్పుతున్నాయి.ముందుగా ఈ రెండు యూనివర్శిటీలు 50 చొప్పున పడకలతో రెండు హాస్పిటల్స్ వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి తీసుకురానున్నాయి.ఈ రెండు యూనివర్శిటీలు రెండు సీబీఎస్ఈ స్కూల్స్ వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఏర్పాటుచేయనున్నాయి.

**రైతుల ప్లాట్లలో త్వరలో అభివృద్ధి పనులు:** రాజధానికి భూములిచ్చిన రైతులకు తిరిగిచ్చిన ప్లాట్లలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. వర్షాల వల్ల కొంచెం ఇబ్బంది ఉందని....ఆయా పనులకు ఇప్పటికే టెండర్లు కూడా పూర్తి చేసామని అన్నారు. 360 కిమీ మేర ట్రంక్ రోడ్లు,1500 కిలోమీటర్ల మేర లేఅవుట్ రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి...కొండవీటి వాగు, పాలవాగు,గ్రావిటీ కెనాల్ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ అన్నారు. 2014-19 మధ్య సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం..ఆ దేశ ప్రధాని,ఇతర అధికారులతో చర్చించి కమిటీలు వేసి అమరావతి అభివృద్ధి కోసం ముందుకెళ్లాం...రాజధానిలో 1450 ఎకరాలు భూమిని స్విస్ ఛాలెంజ్ విధానంలో 42:58 నిష్పత్తిలో కేటాయించాం..దీనివల్ల అమరావతికి పెద్ద కంపెనీలు,బ్యాంకులు వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చేవి.అయితే గత వైసీపీ ప్రభుత్వం సింగపూర్ అధికారులపై కేసులు పెట్టారు. అక్కడికి వెళ్లి మరీ వారిని వేధించారు...దీంతో సింగపూర్ ప్రభుత్వానికి ఏపీ సర్కార్‌కు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. సింగపూర్ పర్యటనలో ఏపీ ప్రభుత్వంపై ఉన్న ముద్ర పోగొట్టుకునేలా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయన్నారు.

# హాస్టళ్ల నిర్వహణకు సహకారమందించాలి

>> 4 కార్యక్రమం రూపొందించారన్నారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాల పేరుతో ఎంతో సదుద్దేశంతో రూపొందించిన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి సహకారమందించాలని ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం విద్యార్థులకు మంత్రి సవిత పిలుపునిచ్చారు. 2016-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం కింద లబ్ధి పొందిన ఎందరో విద్యార్థులు నేడు అత్యున్నత స్థానాల్లో ఉండడం ఎంతో ఆనందకరమన్నారు. ఇలా ప్రభుత్వ సహకారంతో ఆర్థికంగా ఉన్నత స్థానాలల్లో ఉన్న వారు తమకు తోచిన రీతిలో వెనుకబడిన తరగతుల హాస్టళ్లలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సాయమందించడానికి ముందుకు రావాలని కోరారు.

ప్రభుత్వపరంగా బీసీ హాస్టళ్ల మెరుగుకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి సవిత తెలిపారు. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోందన్నారు. విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశామన్నారు. తల్లికి వందనం పథకం ఇంట్లో ఎందరు విద్యార్థులు ఉంటే అందరికీ రూ.13 వేల చొప్పున్న అందజేశామన్నారు. బీసీ హాస్టళ్లలో సీసీ కెమెరాలు, ఇన్వర్టర్లు, ఆర్వో ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలా బీసీ బిడ్డలకు నాణ్యమైన భోజనం పాటు భద్రతతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. అదే సమయంలో సామాజిక సేవపై ఆసక్తి కలిగే దాతల సాయంతో పేద విద్యార్థులకు స్వల్ప కాలంలో మెరుగైన సౌకర్యాలు అందించగలుగుతామన్నారు. పీ4 విధానంలో ప్రజల భాగస్వామ్యంతో హాస్టళ్ల నిర్వహణ మరింత సులభంగా మారుతుందని మంత్రి తెలిపారు.

**ఈ మెయిళ్లతో సంప్రదింపులు:** కార్పొరేట్ కు ధీటుగా బీసీ హాస్టళ్లలో విద్య అందించడంతో పాటు సౌకర్యాలు కల్పించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం ద్వారా విద్యార్థులను తోడ్పాటునిచ్చే బీసీ హాస్టళ్లను అండగా ఉండాలని కోరుతున్నామన్నారు. ఈ మేరకు వారందరికీ ఈ మెయిల్ల ద్వారా సంప్రదించినట్లు మంత్రి వెల్లడించారు. ఏదైనా హాస్టల్‌ను దత్తత తీసుకోవచ్చునన్నారు. ఒకరిద్దరు విద్యార్థులను దత్తత తీసుకుని, వారి ఉన్నత విద్యకు తోడ్పాటు అందించాలని సూచించారు. తమ స్థాయికి తగిన రీతిలో మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మించడం, మరమ్మతులు చేయడం, తాగునీటి కల్పనకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడం వంటి పనులకు ఆర్థిక సాయమందించవచ్చన్నారు. విద్యుత్ సదుపాయం కోసం సోలార్ విద్యుత్ ప్యానెళ్లు కూడా ఏర్పాటు చేయొచ్చునన్నారు. సామాజిక సేవ పట్ల ఆసక్తి కలిగి, పేద బీసీ విద్యార్థులకు అండగా నిలవాలనుకున్నవారు మెయిల్ కు గాని, 6300876401, 7989344521 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం విద్యార్థులకు మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# ఆల్కహాల్ దుర్వినియోగంపై ఉక్కుపాదం

>> ఎథనాల్ దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా నేతృత్వంలో కఠిన చర్యలు ప్రారంభించింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిస్టిలరీల అధికారులతో ప్రత్యేక హైబ్రిడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ కమిషనరేట్ నుండి నేతృత్వం వహించారు. పరిశ్రమలు, ఇతర అవసరాల కోసం ఉత్పత్తి అవుతున్న ఆల్కహాల్ పక్క దారి పట్టకుండా అన్ని డిస్టిలరీల వద్ద కఠిన నిఘా పర్యవేక్షణను అమలు చేయాలని జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. డిస్టిలరీల ప్రాంగణాల్లో పూర్తిస్థాయి భద్రత, నిఘా చర్యలు ఉండాలని, సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. ఎటువంటి 'షాడో' ఏరియాలు ఉండకూడదని,బయటకు వెళ్లే ఉద్యోగులను భద్రతా సిబ్బంది పూర్తిగా తనిఖీలు చేయాలని సూచించారు. ఈఎన్ఏ నాణ్యత నిర్ధారణ కోసం నియమిత నమూనా సేకరణ చేయాలని, పరిశ్రమల కోసం పంపే ఎథనాల్ డిస్పాచ్ ప్రక్రియను అధికారులు స్వయంగా పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. అలాగే ఆల్కహాల్ తీసుకునే పరిశ్రమల యూనిట్లను ప్రత్యక్షంగా సందర్శించి, వినియోగానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. శాఖ మధ్య సమన్వయం, మొబైల్ నడిపాయాల్లో మెరుగుదల, వ్యవస్థలో ఉన్న లోపాలను తొలగించే చర్యలను ప్రభుత్వ పరంగా వేగవంతమైన ఏపీ చర్యలకు దేశవ్యాప్తంగా స్పందన లభిస్తుంది. ఇటీవల జరిగిన పాలకొల్లు నకిలీ మద్యం కేసు నేపథ్యంలో ఈ చర్యలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇందులో 36 మంది అరెస్టు కాగా, 2,200 లీటర్లకు పైగా మళ్లించిన స్పిరిట్, నకిలీ మద్యం బాటిళ్లు, లేబుల్లు, ప్యాకేజింగ్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పరిశ్రమల వినియోగం పేరుతో పొందిన స్పిరిట్‌ను కల్తీ మద్యం తయారీకి దారి మళ్లించిన ఘటనలు బయటపడ్డాయి. ముఖ్యంగా తెలంగాణ లోని ఒక ఫార్మా సంస్థ కోవిడ్ సమయంలో పొందిన అనుమతులను దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ముంబయిలోని సరఫరాదారుల నుంచి ఖాళీ బాటిళ్లు, బ్రాండెడ్ లేబుల్స్, క్యాప్స్ లాంటి వస్తువులు తెప్పించుకోవడం ద్వారా ఈ నెట్‌వర్క్ అంతర్రాష్ట్ర స్థాయిలో విస్తరించి ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఇతర రాష్ట్రాలు సైతం ఏపీని ఆదర్శంగా తీసుకుంటూ సలహాల కోసం సంప్రదిస్తున్నాయి. పరిశ్రమల ఆల్కహాల్ వినియోగంపై సామర్థ్యవంతమైన నియంత్రణకు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ఏర్పాట్లు ఒక మోడల్‌గా నిలిచాయి. ఫలితంగా ముకేష్ కుమార్ మీనా నేతృత్వంలో పరిశ్రమల ఆల్కహాల్ నియంత్రణ పరంగా ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలవనుంది. పరిశ్రమల ఆల్కహాల్‌పై రాష్ట్రాలకు హక్కులు న్నాయని సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చింది. ఈ విషయంపై గతంలో పరిశ్రమల ఆల్కహాల్ పై రాష్ట్రాలకు పరిమిత హక్కులు, శిక్ష విధించే హక్కులు తమకే ఉన్నాయని కేంద్రం భావించింది. అయితే 2024లో ఉత్తరప్రదేశ్ వర్సెస్ లలిత ప్రసాద్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయంలో అందుకు భిన్నమైన స్పష్టత నిచ్చింది. తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పులో పరిశ్రమల ఇతర అవసరాల వినియోగానికి అవసరమైన ఆల్కహాల్ సరఫరా, నియంత్రణపై రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉంటుందని స్పష్టం చేసింది.

# నేను సైతం దత్తత

>> పై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. ప్రతీ మార్గదర్శికి అధికారులు నమ్మకాన్ని కలి గించాలి. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బంగారు కుటుం బాలు, మార్గదర్శుల వివరాలు సరిగ్గా నమోదు చేసినప్పుడే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. పీ4 నిర్వాహకులు, బంగారు కుటుంబాలకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించాలి, అని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు.

ఆగస్ట్ 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని మరోసారి అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే ఇప్పటి వరకు 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా, 57,503 మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని మొత్తం లక్ష్యం నెరవేరాలంటే మరో 2 లక్షల మంది మార్గదర్శుల అవసరం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగిందని..విశాఖపట్నం జిల్లా ఈ విషయంలో చివరిన ఉందని వెల్లడించారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆటోమేటెడ్ మెసేజ్ రూపంలో సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియా, ఇతర ప్లాట్ ఫామ్‌ల ద్వారా పీ4 కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తలపెట్టిన డిజిటల్ ప్రమోషన్ కార్యకలాపాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**మూడు విధానాల్లో జీరో పావర్టీ పీ4 అమలు :** మూడు విధానాల్లో జీరో పావర్టీ పీ4ను అమలు జరుగుతోంది. బంగారు కుటుంబాన్ని మార్గదర్శి దత్తత తీసుకోవడం, వారికి ఆర్థికేతర సాయాన్ని అందించటం మొదటి విధానం. దీనికి కాలపరిమితి అంటూ ఏమీ ఉండదు. రెండో విధానంలో ఫండ్ ఏ నీడ్, దీని కింద ఎవరికైతే ఆర్థిక అవసరాలు ఉంటాయో వారికి నగదు సాయం అందించేలా కార్యాచరణ రూపొందించారు. అయితే దీనికి కాలపరిమితి ఉంటుంది. మూడో విధానంలో గ్రామాలను, మండలాలను దత్తత తీసుకోవడం...ఒక ప్రాంతంలో, ఒక ఊరిలో కమ్యూనిటీ అవసరాలు తీర్చడం, అక్కడ వివిధ అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేలా తీర్చిదిద్దారు. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకించి ఈ మూడో విధానం అమలు చేయాలని నిర్ణయించారు. మరోవైపు...పీ4కి భాగస్వాములుగా వ్యవహరిస్తున్న కేపీఎంజీ, మిలాప్, తమ్మడ, భవ్య, భార్గో, ప్రాజెక్ట్ డీప్ సంస్థలు మరింత కీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఒక బంగారు కుటుంబానికి అవసరమైతే ఒకరికి మించి మార్గదర్శులు సాయం అందించేలా చూడాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వాయుగుండంగా అల్పపీడనం

>> కృష్ణా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించారు. అదే విధంగా ఉత్తర కోస్తా పోర్టులకు మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక, దక్షిణ కోస్తా పోర్టులకు ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాబోయే 48 గంటల్లో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, కోస్తాంధ్రలో మోస్తరు వర్షాలు కురిసే ఆస్కారం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.అదే విధంగా తీరం వెంబడి 4555 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. శుక్రవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశముందని అధికారులు వివరించారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. శనివారం ఉత్తరాంధ్రలో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వానలు పడతాయని వాతావరణ విభాగం అంచనా వేసింది. అల్పపీడనం ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, పల్నాడు, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయంకి వరద కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలంలో 1,11,651 క్యూసెక్కులు చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 1,40,773 క్యూసెక్కులు. రెండు స్పిల్‌వే గేట్ల ద్వారా 54,130 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31,328 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.80 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203.42 టీఎంసీలుగా కొనసాగుతోంది. వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు: మరోవైపు వర్షానికి రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో సకాలంలో వైద్యం అందక అల్లూరి జిల్లాలో ఓ గిరిజనుడు మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం జర్రెల పంచాయతీ జె.కొత్తూరు గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై ఉన్న రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో గ్రామం నుంచి బయటకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

# ముందస్తు చర్యలు చేపట్టాలి

>> రు.సముద్రం అలజడిగా ఉంటుందని, తీరం వెంబడి గంటకు 4060 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తీరాల్లో అలలు 2.9 నుంచి 3.6 మీటర్ల ఎత్తులో ఎగసిపడే అవకాశం ఉందని చెబుతున్నారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.వర్షాలు, ఫ్లాష్ ఫ్లడ్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రమాద హాట్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకుసూచించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయంతో గండ్లు గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాల న్నారు. ఏపీ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి మంత్రి స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ 112, 1070, 1800 425 0101 నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు.

# మాల్దీవులకు రూ.4850 కోట్ల సాయం

>> 'ఇండియా ఔట్' నినాదంతో రెండు దేశాల మధ్య సంబంధాలు ఒడిదొడుకులకు గురైన నేపథ్యంలో తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులు అధ్యక్షుడుగా మహ్మద్ ముయిజ్జు ఎన్నికైన మొదట్లో చైనా అనుకూల విధానాలు అవలంబిస్తూ.. 'ఇండియా ఔట్' నినాదాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మాల్దీవులకు భారత్ అందిస్తున్న సైనిక సాయాన్ని వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే విడతల వారీగా గత మే నాటికి మాల్దీవుల్లోని భారత్ సైన్యం వెనక్కి వచ్చేసింది. అంతేకాకుండా భారత్‌తో కలిసి నిర్వహిస్తున్న ప్రాజెక్టులను కూడా నిలిపివేయాలని మాల్దీవులు నిర్ణయించింది. ముయిజ్జు 'చైనా ఫస్ట్' విధానాన్ని అనుసరించారు. తర్వాత తన నిర్ణయాల ప్రభావం ముయిజ్జుకు త్వరగానే అర్థమైంది. దాంతో మనతో సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి మొగ్గు చూపారు. గత యేడాది మన దేశ పర్యటనకు వచ్చిన ఆయనమోడీని మాల్దీవులకు ఆహ్వానించారు. దీనికి ముందు బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించారు. రెండు దేశాల మధ్య గురువారం చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) లాంఛనప్రాయంగా కుదిరింది. ఈ ఎఫ్‌టిఎకు అధికారికంగా 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా)' నామకరణం చేశారు. దీనిపై మోడీ స్పందిస్తూ.. 'భారత్, బ్రిటన్ సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక రోజు. యేళ్ల తరబడి చేసిన శ్రమ ఫలితంగా ఇరు దేశాల మధ్య సెటా కుదిరింది' అని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు బ్రిటన్‌కు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదని స్పష్టం చేశారు.

# పునర్విభజనపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

**విజయవాడ,జులై 25,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్,తెలంగాణలో నియోజక వర్గాల పునర్విభజనపై దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌పై జస్టిస్ సూర్యకాంత్,జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం నియోజక వర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని పిటీషనర్ కోరారు. జమ్మూకాశ్మీర్‌లో పునర్విభజన చేసే సమయంలో ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది.

2028లో మొదటి సనగణన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని గేట్లు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. కేంద్ర పాలిక ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని సర్వోన్నతన్యాయస్థానం వ్యాఖ్యానించింది.జమ్మూకాశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్న పిటీషనర్ వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. జమ్మూకాశ్మీర్ కోసం జారీ చేసిన నిజెజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించడం, ఏకపక్షం,వివక్ష కాదని స్పష్టం చేస్తూ పురుషోత్తంరెడ్డి పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది.




తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్న వారితో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

# మార్షల్ ఆర్ట్స్ పోటీలతో క్రీడా స్ఫూర్తి

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** మార్షల్ ఆర్ట్స్ పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతకు మార్గనిర్దేశం చేస్తాయని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నేటి నుండి 27 వరకు 3 రోజుల పాటు జరగనున్న 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్షిప్ 2025 పోటీలను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,తైక్వాండో వంటి పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతకు అనుకూల దిశలో మార్గనిర్దేశం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అన్ని విధాల మద్దతు ఇస్తుంది" అని తెలిపారు.కృష్ణా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పోటీలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# మద్యం కేసులో కెపిఎంజి ప్రతినిధులకు సిట్ నోటీసులు

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ ప్రతినిధులకు సిట్ అధికారులు గురువారం నోటీసులిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం ఇండెంట్,ఎకౌంటింగ్,ఆడిటింగ్‌పై సలహాలు,సూచనల కోసం ఏపీఎస్‌బీసీఎల్ కేపీఎంజీని కన్సల్టెన్సీగా నియమించుకుంది. వైసీపీ మద్యం ముఠా ఆదేశాల మేరకు,ముడుపులు చెల్లించిన సరఫరా కంపెనీలు, డిస్టలరీలకే అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చేందుకు వీలుగా నిబంధనలు మార్చేసిని ఏపీఎస్‌బీసీఎల్ అంతా చట్టప్రకారమే చేశామనే భావన కల్పించేందుకు కేపీఎంజీ నివేదికను అడ్డం పెట్టుకుంది. ఆ సంస్థ 2019 చివరోల పలు సిఫార్సులు చేయగా...వాటిల్లో దోపిడీకి అనుకూలంగా ఉన్న మద్యం డిస్టలరీలు,సరఫరాదారులకు పీడీ ఖాతా నుంచి గ్రీన్ ఛానల్‌లో చెల్లించాలన్న సిఫార్సును మాత్రమే ఏపీఎస్‌బీసీఎల అమలు చేసింది. మద్యం కుంభకోణానికి బీజం ఇక్కడే పడింది.2019 నవంబరు 4నకేపీఎంజీ సంస్థ ప్రతినిధి సందీప్ పైడి ఏపీఎస్‌బీసీఎల్‌కు నివేదిక అందచేయగా...2019 డిసెంబరు 8న మరో నివేదిక ఇచ్చినట్లు ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు పత్రాన్ని తెరపైకి తెచ్చారు. అందులోని సిఫార్సులు అంతకుముందు ఇచ్చిన నివేదిక లోని వాటికి భిన్నంగా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఆ రెండో నివేదిక అనుమానాస్పదంగా ఉందని సిట్ వెల్లడించింది. మరోవైపు కేపీఎంజీ నివేదిక లోని సిఫార్సులను పరిశీలించి సూచనలు చేసేందుకు నలుగురు అధికారులతో బేవరేజెస్ కార్పొరేషన్ కమిటీని నియమించింది. ఆ కమిటీ అనుమానాస్పదంగా ఉన్న రెండో నివేదికనే పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో అప్పట్లో అసలు ఏం జరిగింది అనేది తేల్చేందుకు సిట్ అధికారులు...కేపీఎంజీ ప్రతినిధి సందీప్ పైడితో పాటు మరికొందరికి నోటీసులిచ్చినట్లు సమాచారం.

# పార్లమెంట్ సమావేశాలకు సహకరిస్తాం

## స్పీకర్ అఖిలపక్ష సమావేశంలో విపక్ష ఎంపిలు

**న్యూఢిల్లీ,జూలై 25:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాకు ప్రత్యేక నిశిత సవరణ (సర్) చేపట్టడం, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించడం వంటి అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్నాయి. ఆయా అంశాలపై చర్చకు విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పట్టుబడుతున్నాయి. వాయిదా తీర్మానాలపై చర్చించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో సభలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. వారి ఆందోళనలతో గత నాలుగు రోజులుగా సభా కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. ఉభయసభలు ప్రారంభమైన నిమిషాల్లోనే వాయిదా పడుతున్నాయి. దీంతో సభలో నిరసనలకు బ్రేక్ వేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా శుక్రవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు సహకరించాలని ప్రతిపక్ష నాయకులను స్పీకర్ కోరినట్లు తెలిసింది. దీంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని ప్రతిపక్ష ఎంపీలు చెప్పినట్లు సమాచారం. దీంతో సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలూ సజావుగా సాగనున్నాయని సమాచారం. జూలై 28 నుంచి ఆపరేషన్ సింధూర్‌పై పార్లమెంట్‌లో చర్చ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారతీయ సైనిక దళాలు పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్‌లో ఉన్న 9 ఉగ్రస్థావరాలను ఆ ఆపరేషన్ సమయంలో నేలమట్టం చేశారు. అయితే పార్లమెంట్‌లో ఆ అంశంపై చర్చించేందుకు కేంద్రం డేట్ ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. జూలై 28వ తేదీన దీనిపై చర్చ చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఇందు కోసం లోక్‌సభ, రాజ్యసభలో 16 గంటల పాటు చర్చించేందుకు సమయాన్ని కేటాయించింది.

# ఒబిసిల చరిత్రను చెరిపేసిన బిజెపి

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, జులై 25:** భారత ఉత్పాదక శక్తికి ఒబిసిలు ప్రతీకలని కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. అలాంటి వారికి అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోందని ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన బాగిదారి న్యాయ మహా సమ్మేళనం కార్యక్రమంలో రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి, ఆరెస్సెస్‌పై విమర్శలు గుప్పించారు. ఒబిసిల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారని దుయ్యబట్టారు. '2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను. ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే ఒబిసిల ప్రయోజనాలను కాపాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేకపోయాయనని అనిపిస్తోంది. ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నా. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలం. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలి. దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారు. ఒబిసిల చరిత్ర ఎక్కడుంది. బిజెపి, ఆరెస్సెస్ ఉద్దేశపూర్వకంగా ఆ చరిత్రను చెరిపేశాయి' అని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. 'ఒబిసిలు ఉత్పాదకశక్తికి ప్రతీకలు. కానీ వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు. అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ ఇండియాలో ఒబిసిలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది? కుల గణన కూడా ఎప్పుడో చేయాల్సింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మేం తప్పకుండా కులగణన పూర్తి చేస్తాం అని కాంగ్రెస్ ఎంపి తెలిపారు. ఈ సందర్భంగా భాషా వివాదంపైనా రాహుల్ స్పందించారు. 'అభివృద్ధిలో విద్యే ప్రాధాన్యం. ఇంగ్లిష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయి. బిజెపి నేతలు మాత్రం ఇంగ్లీష్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమే. దీనితో పాటు ఆంగ్ల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

### వారం - వర్జ్యం

26-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
విదియ రా.10.46
ఆశ్లేష మ.3.57
వర్జ్యం : తె.4.12-5.50
దు.తె.5.47-7.27
శుభసమయం : సా.6.45-7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి నుండి ఆస్తి, వస్తులాభాలు పొందుతారు. అతిథుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా ఉండును. ఇంటా బయటా ప్రోత్సాహ కరంగా వుండును.

**మిథునం:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా వుండటం మంచిది.

**కర్కాటకం :** ప్రత్యర్థులు మిత్రులుగా మారి సాయం అందిస్తారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి సన్మానాలు పొందుతారు.

**సింహం:** ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**కన్య :** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. సోదరుల నుండి విలువైన సమాచారం అందుతుంది.

**తుల :** అనుకోని అవకాశాలు పొందుతారు. సంతానం నాకు అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. వస్తులాభం.

**వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక, కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. దీర్ఘకాలిక రుణాలు తీరి ఊరట చెందుతారు. ప్రయాణాలు.

**కుంభం:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది.

**మీనం :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. అకారణంగా వివాదాలు ఏర్పడవచ్చు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రంలోని 9,098 ఆలయాలు రూ.772 కోట్లతో పునర్నిర్మాణం: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**శ్రీకాకుళం, జూలై, 25 (ప్రభాతవార్త ప్రతినిధి) :** రాష్ట్రంలో ఆలయాల పునర్నిర్మాణం చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లాకు వచ్చిన ఆయన ముందుగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని, శ్రీకూర్మంలో ఉన్న శ్రీకూర్మనాథ స్వామి వారిని దర్శించి అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రంలోని 9,098 ఆలయాలకు రూ.772 కోట్లతో పునర్నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. 5,523 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు పది వేల రూపాయలు చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.66.27 కోట్లు ఖర్చు అవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు నియోజక వర్గంలో ధూప దీప నైవేద్యాల కోసం కొత్తగా ఐదు ఇచ్చినట్లు చెప్పారు. పునర్నిర్మాణం కింద మూడు ఆలయాలు ఉన్నాయని, వీటికి 5 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించామని పేర్కొన్నారు. ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో పునర్నిర్మాణానికి ఇప్పటికే కోటి 96 లక్షలు ఇచ్చి ప్రారంభినట్లు చెప్పారు. 20 కొత్త పనులకు రూ.12.75 కోట్లు మంజూరు చేయడమైనదని, ధూప దీప నైవేద్యాలకు 157 ఆలయాల్లో 10 వేలు చొప్పున ఇస్తామని తెలిపారు.

శ్రీకాకుళం నియోజకవర్గం లో వృద్ధాప్య ఫించన్లు 16వేల 151, వితంతు, వికలాంగ, చేనేత, మత్స్య కార, గీత కార్మికులు, అభయ హస్తం, ఒంటరి మహిళా, తదితరమైనవి కలిపి 33,703 పంపిణీ చేసినట్లు వివరించారు. శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో కొన్ని పునర్నిర్మాణ పనులు చేయాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి వచ్చినపుడు పుష్కరిణి ఖాళీ చేయించి భక్తులకు వెసులుబాటు కల్పించాలనే ఆదేశాల మేరకు పుష్కరిణిని ఖాళీ చేసినట్లు చెప్పారు.

శ్రీకూర్మం ఆలయం విషయమై ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరక్టర్‌తో పునర్నిర్మాణంపై మాట్లాడామని, వారం పది రోజుల్లో వచ్చి పరిశీలిస్తామని చెప్పినట్లు చెప్పారు. అరసవల్లి, శ్రీకూర్మనాధుని ఆలయాలను భావితరాలకు అందించేందుకు ఇప్పటికే తగు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం పండుగను రాష్ట్ర పండుగగా ఇప్పటికే నిర్వహించడమైనదని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం ఈ యేడాది ప్రారంభమైనదన్నారు.

రెండు ఆలయాల పునర్నిర్మాణం విషయమై జిల్లాలో ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులతో చర్చించి తగు చర్యలు చేపడతామన్నారు.

## తిరుపతి-షిర్డీ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, జూలై 25,ప్రభాతవార్త** యాత్రికుల సౌకర్యార్థం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి–షిర్డీ–తిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపారు. తిరుపతి నుంచి సాయినగర్ షిర్డీ వెళ్లే నెంబర్ 07637ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు ఆగస్టు 3నుంచి సెప్టెంబరు 28వరకు ప్రతి ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 10.45గంటలకు సాయినగర్ షిర్డీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయినగర్ షిర్డీ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07638ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4నుంచి సెప్టెంబరు 29వరకు ప్రతి సోమవారం సాయంత్రం 7.35గంటలకు సాయినగర్ షిర్డీ నుంచి బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి 1.30(బుధవారం తెల్లవారుజామున) తిరుపతి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికూడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, భల్కీ, ఉద్గీర్, లాతూర్, పర్లీ, గంగాఖేర్, పర్భని, సేలు, జాల్నా, ఔరంగాబాద్, నాగర్‌సోల్, మన్మాడ్, కోపర్‌గావ్ స్టేషన్లలో నిలుస్తాయి.

## ప్రజల తలరాతలను మార్చే నాయకుడు చంద్రబాబు

### - తిరుపతి సుపరిపాలనలో మంత్రి నిమ్మల



**తిరుపతి,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల తలరాతలు మార్చే నాయకుడు ,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అయితే ప్రాణాలు తీసే వ్యక్తి జగన్‌అని ఆయన విమర్శించారు. నాయకుడు అంటే అన్ని విధాలుగా ఆదుకుని ప్రజలకు కష్టమొచ్చినా రక్షించేలా ఉండాలిగానీ జగన్‌లో ఇబ్బందులు పెట్టి చంపే విధంగా ఉండకూడదని ఆయన ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో నేడు ఏ నియోజకవర్గం, ఏ పట్టణం, గ్రామానికి వెళ్లి ఏ గడపతొక్కినా ప్రజలు పరిపాలన బాగుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గంలో శుక్రవారం ఉదయం ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మతో కలసి మంత్రి రామానాయుడు చింతలచేను వద్ద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలతో మమేకమై వారినుండి సమస్యలు తెలుసుకున్నారు. ఈ రాష్ట్రప్రభుత్వం నుండి ఏమి ఆశిస్తున్నారు, ఎంతవరకు లబ్ధిపొందారు, మంచి జరిగిందని సమాధానాలు రాబట్టారు. ప్రజలందరూ అనేక పథకాలతో లబ్ధిపొంది ఆనందంగా ఉన్నామని తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైసిపిపాలన అంతా కక్షలు, కేసులు ,వేధింపులతో జరిగిపోయిందన్నారు. మాకు ఆనందం కలిగితే నవ్వుకోలేని పరిస్థితి, కష్టం వస్తే కన్నీళ్ళు పెట్టుకోవడానికి కూడా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అటువంటి పాలననుండి విముక్తి కలిగిందన్నారు. అనేక పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వెళ్ళిపోయాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఫెన్షన్లు, ఇళ్ళపట్టాలు, ఉపాధి అవకాశాలు, మహిళలకు ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చుతున్నామన్నారు.

ఏడాదిలో సుపరిపాలన ప్రభుత్వం చేసిన మంచిపనులను ఆయన ఇంటింటికి ప్రజలకు వివరించారు. ప్రజలందరూ కూడా సంవత్సరం పాలనపై ఆశీర్వాదాలందిస్తున్నారన్నారు. తిరుపతికి కూడా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. నరసింహయాదవ్, పుష్పావతియాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ, ఆర్‌సి మునికృష్ణ, విజయకుమార్, వట్టికుంట చిన్నబాబు, కంకణాల రజనీకాంత్‌నాయుడు, మన్నెం శ్రీనివాసులు, బుల్లెట్‌రమణ, దంపూరి భాస్కర్‌యాదవ్, సదాశివం, ఊకా విజయకుమార్ బివి కీర్తి ,పాతకం వెంకటేశ్, హేమంత్‌రాయల్, పాల్గొన్నారు.

# టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు గదులు ఇవ్వరు!

## - రూ.300 ఆన్‌లైన్ టిక్కెట్‌ల వారికీ ఇదే సమస్య

**తిరుమల,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు ...ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు పలు రకాల దర్శన టిక్కెట్లు,టోకెన్లతో వస్తున్న భక్తులకు పూర్తిగా గదులు ఇవ్వడం నిలుపుదలచేశారు. ఆయా భక్తులు సమయానికి కొండకు చేరుకుని వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలో వెళ్ళి దేవదేవుడ్ని దర్శనం చేసుకోవాలని టిటిడి అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ సముదాయాల్లో ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న ఉచిత సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లు పొందిన భక్తులు ముందుగానే తిరుమలకు చేరుకుని సిఫార్సులేఖలపై గదులు పొందేవారు. ఇలా వస్తున్న వారి సంఖ్య పెరగడంతో గదుల కొరత తీవ్రంగా ఉంది. అంతేగాక ఈ టైమ్‌స్లాట్ భక్తులు టోకెన్‌పై నిర్ధేశించిన రోజు ఆ సమయానికి మాత్రమే కొండకు చేరుకోవాలి. టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు తిరుమలలో సిఫార్సులేఖలపై గదులు కేటాయింపు పూర్తిగా రద్దుచేశారు. ఇక ఆన్‌లైన్‌లో 300 రూపాయలు టిక్కెట్లు (మూడునెలల ముందుగానే)బుక్‌చేసుకుని తిరుమలకు చేరుకునే భక్తులకు కూడా ప్రత్యేకంగా గదులు కేటాయించరు. ఈ విధానాన్ని టిటిడి పూర్తిగా రద్దుచేసింది. సుదూర ప్రాంతాల భక్తులకు మాత్రమూ సిఫార్సులపై గదులు ఇచ్చేందుకు వసతికల్పన విభాగం సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. ఆఫ్‌లైన్‌లో రోజువారీగా 20వేల వరకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీఅవుతున్నాయి. ఆన్‌లైన్‌లో 300 రూపాయలు టిక్కెట్లు 25వేల వరకు విడుదల చేసినా ఈ ఆన్‌లైన్ భక్తులు అధికంగా తమిళనాడు, కర్నాటక,తెలుగురాష్ట్రాల నుండి ఆయారోజుల్లో తిరుమలకు చేరుకుని నేరుగా ఇష్టదైవమ్ దర్శనం చేసుకుని తిరుగుప్రయాణమవుతూన్నారు. వీలైనంత వరకు దర్శన టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులు తిరుపతిలోనూ వసతి పొంది దర్శన సమయానికి రెండు గంటల ముందు తిరుమలకు చేరుకోవాలని టిటిడి సూచన. తిరుమలలో ప్రస్తుతం 7.200వరకు గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 2వేల వరకు గదులు ఆన్‌లైన్‌లోనే కేటాయిస్తారు. మిగిలిన గదుల్లో సామాన్యభక్తులకు 1,500వరకు గదులు కేటాయింపు జరుగుతుంది. ఇక పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో అతిదిగృహాలు. విశ్రాంతి గృహాలను రాజ్యాంగపరిధిలోని న్యాయమూర్తులు, మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు, బ్యూరోక్రాట్స్ అధికారులు ఇలా సిఫార్సులేఖలపై గదులు కేటాయింపు జరుగుతుంది. ఎంబిసి ప్రాంతంలో టిటిడి ఉద్యోగులు,వారి సిఫార్సులేఖలు, బోర్డు సభ్యుల సిఫార్సులేఖలకు గదులు కేటాయింపు జరుగుతుంది. ఇప్పటికే తిరుమలలో ఉన్న గదులు కేటాయింపులో సిఫార్సులేఖల తలనొప్పులు టిటిడి అధికారులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ భక్తులకు పూర్తిగా గదులు కేటాయించడానికి లేదు. 10,500 రూపాయలు దర్శన టిక్కెట్ కొనుగోలుచేస్తున్న శ్రీవాణి భక్తులకు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో 100రూపాయలు, వెయ్యిరూపాయలు అద్దె గదులను కేటాయిస్తున్నారు.

# స్కూలు నుండి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిన నలుగురు విద్యార్థులు

## - తిరుమలలో పిల్లల ఆచూకీ కనుగొన్న పోలీసులు



**అనంతపురం, జూలై 25, (ప్రభాతవార్త బ్యూరో)** స్థానిక ఒకటవ రోడ్ లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివే నలుగురు విద్యార్థులు పారిపోయి మళ్లీ తిరుమలలో పోలీసులు దొరకడంతో సస్పెన్స్ వీడింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. బాగా చదువుకోవాలని టీచర్లు చెప్పడంతో పారిపోయి తిరుమలలో ఉన్న నలుగురు విద్యార్థులను శుక్రవారం అనంతపురం మూడవ పట్టణ పోలీసులు పట్టుకొని అనంతపురం తీసుకొస్తున్నారు.. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వాని పట్టుకోవడంతో అందరిలో ఆందోళన విడింది..కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన నలుగురు విద్యార్థులు స్థానిక ఒకటో రోడ్డులోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతూ మూడవ రోడ్డులోని బి.సి హాస్టల్ లో ఉంటున్నారు. బాగా చదువుకోవాలని లేదంటే చర్యలు తీసుకుంటామని స్కూలు టీచర్లు సూచించడంతో నలుగురు ఏకమై గురువారం సాయంత్రం చెప్పాపెట్టకుండా స్కూలు నుండి వెళ్లిపోయారు.

ఆ నలుగురు పిల్లల మిస్సింగ్ పై అనంతపురం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో మూడవ పట్టణ సి.ఐ శాంతిలాల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రంగంలోకి రెండు ప్రత్యేక బృందాలను పంపి బెంగుళూరు, తిరుపతి నగరాలలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. టెక్నాలజీ సహాయంతో తిరుమలలో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసుల సహాకారంతో సదరు నలుగురు విద్యార్థులను మూడవ పట్టణ పోలీసులు సురక్షితంగా హ్యాండోవర్ చేసుకుని అనంతపురం తీసుకొస్తున్నారు.



## మిసైల్‌ను విజయవంతంగా ప్రయోగించడంపై సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ,జూలై 25,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలులోని టెస్టింగ్ రేంజ్‌లో డీఆర్‌డీఓ డ్రోన్ ద్వారా మిసైల్‌ను విజయవంతంగా ప్రయోగించడంపై ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మన దేశ రక్షణ పర్యావరణ వ్యవస్థ వృద్ధికి దోహదపడటం ఆంధ్రప్రదేశ్ కు గర్వంగా ఉందని చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్ఓఏఆర్)లో విఏవిలాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి (యుఎల్‌పిజీఎమ్- వి3 ) పరీక్ష విజయవంతం చేసిన శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు అభినందనలు తెలిపారు. మన దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని చంద్రబాబు అభివర్ణించారు. గేలిశిబిలీజు3 విజయం ఆత్మనిర్భర్ భారత్ నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని చంద్రబాబు అన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ట్వీట్ కు ప్రతిస్పందనగా చంద్రబాబు ఈ సందేశమిచ్చారు. భారత రక్షణ రంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీఓ) మరో విజయాన్ని అందుకుంది. డ్రోన్ ద్వారా ప్రిసిషన్ గైడెడ్ మిసైల్‌వీ3ని (యూఎల్‌పీజీఎమ్) విజయవంతంగా ప్రయోగించింది. కర్నూల్‌లోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ ప్రయోగంలో డీఆర్‌డీఓతో పాటు రక్షణ రంగానికి చెందిన పలు సంస్థలు పాల్గొన్నాయి.

## రాష్ట్ర పర్యాటకానికి ప్రతిష్టాత్మక ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డు

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పర్యాటకాన్ని ప్రతిష్టాత్మక ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డు వరించిందని ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట తెలిపారు. ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వినూత్న విధానాలు, కొత్త పాలసీలు, విప్లవాత్మక సంస్కరణలు ఈ అవార్డును సాధించి పెట్టాయని వివరించారు. ఈ అవార్డు రావడం రాష్ట్ర పర్యాటక రంగ ప్రతిష్టను మరింత పెంచిందన్నారు. 10వ ఇంటర్నేషనల్ టూరిజం కాన్ క్లేవ్ అండ్ ట్రావెల్ అవార్డ్ (ఐటీసీటీఏ) ఈ పురస్కారాన్ని ప్రకటించిందని, జులై 26న న్యూఢిల్లీలోని లె మెరిడియన్ లో సాయంత్రం 7 గంటలకు ఈ అవార్డు అందించనున్నట్లు ఐసీఎం గ్రూప్ ఎండీ, ఛైర్మన్ అజయ్ గుప్తా మరియు ఐటీసీటీఏ జ్యూరీ సభ్యులు తెలిపారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి కాట ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటక పరిశ్రమ అభివృద్ధికి చేస్తున్న కృషికి నిదర్శనంగా అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆమ్రపాలి అన్నారు. ఢిల్లీలో అవార్డు అందుకోవడానికి తాను వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిని మరింత అభివృద్ధి చేసి పర్యాటకాంధ్రప్రదేశ్ కు బాటలు వేస్తామన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేసి అభివృద్ధిలో భాగస్వామ్యులైన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడుకు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీకి, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ కు, పర్యాటక శాఖ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు చెబుతూ వారి కృషిని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాటకు ఐటీసీటీఏ సంస్థ శుభాకాంక్షలు తెలిపింది.

## ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి హైకోర్టులో చుక్కెదురు

### ఓఎంసి కేసులో రివిజన్ పిటిషన్ డిస్మిస్

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం రేపిన ఓబుళాపురం మైనింగ్ కేసులో ఎపికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఓబుళాపురం గనుల కేసులో నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని ఆమె దాఖ లు చేసిన రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం నాడు డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఆమె పేరును నిందితుల జాబితాలో వుండాల్సిందేనని సిబి ఐ దాఖలు చేసిన పిటిషన్‌తో హైకోర్టు ఏకీభవించింది. దీంతో ఓబుళాపురం మైనింగ్ కేసులో ఆమె కోర్టు విచారణను చవిచూడాల్సి వుంటుందని ప బ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాడియా మీడియాకు తెలిపారు. ఉమ్మడి ఎపి హయాంలో ఓఎంసి కేసుగా పేరొందిన ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాలకు సంబంధించి అప్పట్లో గనుల శాఖ కార్యదర్శిగా వు న్న సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మిపై సిబిఐ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసులో ఓఎంసి ఎండిగా వున్న గాలి జనార్ధన్ రెడ్డితో పా టు ఆయన సోదరుడు శ్రీనివాస్ రెడ్డి నాటి గనుల శాఖ డైరక్టర్ రాజగోపాల్ సహా మరికొందరిని దోషులుగా సిబిఐ కోర్టు రెండు నెలల క్రితం తీర్పు చెప్పడం విదితమే. ఈ కేసుకు సంబంధించి 2011లో గాలి జనార్ధన్ రెడ్డి సహా నిందితులందరు రెండేళ్లకు పైగా చంచల్‌గూడ జైల్లో రిమాండులో వుండగా వీరితో పాటు శ్రీలక్ష్మి కూడా ఏడాది పాటు జైలు జీవితం గడిపారు. ఈ కేసులో ఆమె బెయిలుపై వున్నారు. అయితే ఓఎంసి కేసులో శ్రీ లక్ష్మిని నిందితుల జాబితా నుంచి తొలగిస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేయగా దీనిని సిబిఐ తప్పుపట్టింది. ఇదే సమయంలో శ్రీలక్ష్మి కూడా తన పే రును ఓఎంసి నిందితుల జాబితా నుంచి తొలగించాలని హైకోర్టును కోరారు. ఆమె పేరును తొలగించేందుకు వీల్లేదని హైకోర్టులో సిబిఐ ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేసింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై శుక్రవారం ఉదయం హైకోర్టులో విచారణ జరిగింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన రి విజన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో సిబిఐ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ కేసులో శ్రీలక్ష్మి అక్రమాలకు పాల్పడ్డార నడానికి పక్కా ఆధారాలు వున్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. ఇదే కేసులో నాటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డితో పాటు ఐఎఎస్ అ ధికారి కృపానందంలకు ఊరట కలిగించినట్లు తనకు మినహాయింపు ఇవ్వాలని శ్రీలక్ష్మి కోరడం సరికాదని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు లో సిబిఐ తరపున ప బ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాడియా తన వాదనలు వినిపించారు.

# తిరుమల సమాచారం

## శ్రావణమాసం అష్టలక్ష్మీవైభోగవ్రతం



**తిరుపతి,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** సిరులొసంగే మహాలక్ష్మిదేవిని వేడుకుంటూ శ్రావణ మాసం తొలి శుక్రవారం టిటిడి, హిందూ ధర్మ ప్రచారపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో అష్టలక్ష్మీవైభోగవ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఈ వ్రతంలో 600మంది మహిళలు పాల్గొన్నారు. సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో జరిపించిన వైభోగవ్రతంలో విశ్వహిందూపరిషత్ రాష్ట్రఉపాధ్యక్షురాలు మురళమ్మ, వసుందర, ప్రసన్నలక్ష్మి, గీతాంజలి, చంద్రమౌళి ,రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కస్పా పద్మనాభం, వాసు, మురళి పాల్గొని ఎంతో వేడుకగా వేదమంత్రాల నడుమ ఈ వ్రతం నిర్వహింపజేశారు. మహిళలకు పసుపుదారాలు, గాజులు, పూలు, కుంకుమ ప్రసాదం వితరణ చేశారు.

## 28న టిటిడి సద్గమయ

**తిరుమల,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం,హిందూ ధర్మప్రచారపరిషత్ సంయుక్తంగా 28వతేదీ సోమవారం టిటిడి పాఠశాలల్లో సద్గమయ కార్యక్రమం చేపడుతున్నారు. టిటిడి పాఠశాలల్లోని విద్యార్థులకు మానవీయ,నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. తిరుపతిలోని ఎస్‌జిఎస్ ఉన్నతపాఠశాల,ఎస్వీ ఉన్నతపాఠశాల, కోదండరామస్వామి ఉన్నతపాఠశాల, ఎస్వీ ఓరియంటల్ ఉన్నతపాఠశాల, పద్మావతి బాలికల ఉన్నతపాఠశాల, ఎస్‌కెఎస్ ఉన్నతపాఠశాల, తిరుమలలోని ఎస్వీ ఉన్నతపాఠశాలలో 8,9,10తరగతుల విద్యార్థులకు ఎంపికచేయబడిన శిక్షకులచే శిక్షణ ఇవ్వనున్నారు. రోజుకు గంటసమయం నాలుగురోజులపాటు సద్గమయ శిక్షణ ఉంటుంది.

## టిటిడి ట్రస్ట్‌లకు ఇద్దరు దాతలు రూ.20లక్షలు విరాళం



**తిరుమల,జూలై 25ప్రభాత వార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులు ఆకలిఅనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు తిరుపతికి చెందిన ఎల్‌వి లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ పిసి రాయల్ గురువారం 10లక్షలు చెక్కును. అలాగే బెంగుళూరుకు చెందిన సుకుమార్ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు చెక్కులను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. పిసిరాయల్ తన పుట్టినరోజు సందర్భంగా ఈ విరాళాన్ని అందించారు.

## వెంకన్న దర్శనంతో మనసు సంతోషం: ప్రముఖులు



**తిరుమల,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, స్వామివారిని దర్శించుకోవడంతో మనసు సంతోషంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో డిఆర్‌డిఒ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి, మహారాష్ట్రమంత్రి పంకజ్‌ముండే,సినీనటుడు సత్యంరాజేశ్ ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కిన వీరంతా ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలు బహుకరించారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పదవులకోసం కాదు ప్రజలకోసం పోరాడే వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

## - ఎమ్మెల్యే పై ప్రశంసల వర్షం కురిపించిన మంత్రి



**నెల్లూరు రూరల్, జూలై 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలోనే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మొట్టమొదటిగా పూర్తిచేసిన నియోజకవర్గం నెల్లూరు రూరల్ నియోజకవర్గం నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువ నాయకుడు నారా లోకేష్‌కి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అంటే చాలా ఇష్టం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, ఐపిఆర్ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్, వడ్డిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, 85 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, ఐ పి.ఆర్. శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌లు శంకుస్థాపన చేసారు. సంవత్సర కాలంలో రాష్ట్రంలో 268 కోట్ల రూపాయలతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసిన ఒకేఒక్క శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, ఐపి.ఆర్. శాఖామంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ప్రజలకు సేవచేయాలన్న తాపత్రయం ఉన్న వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ మరియు ఐ పి.ఆర్. శాఖామాత్యులు కొలుసు పార్థసారధి. కార్యకర్తల కష్టంతోనే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం రాష్ట్రంలోనే మొదటి స్థానం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో 17వ డివిజన్ అభివృద్ధికి 3 కోట్ల 60 లక్షల నిధులు కేటాయించామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కో క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టంపరిధిలో ప్రవేశాలకు ఫీజుల ఖరారు

**విజయవాడ,జూలై25, పభాతవార్తప్రతినిధి:** విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో భర్తీ చేస్తున్న 25% సీట్లకు ఫీజులను ఖరారు చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. స్టార్ రేటింగ్ ఆధారంగా ఫీజులను నిర్ణయించారు. ఒక స్టార్ ఉంటే రూ.8,500, రెండు స్టార్లకు రూ.10వేలు, మూడు స్టార్లకు రూ.11,500, నాలుగు స్టార్లకు రూ.13 వేలు, ఐదు స్టార్లకు నిర్ణయించారు.

**VIJAYAWADA MUNICIPAL CORPORATION**
'E' Procurement Notice No.17/VMC/CDB/2025-26, Dt.25-07-2025

Roads, Drain, Culvert, Water supply, Lights, repairs
(Total 137 works)-Est. Amount Rs.2811.82 Lakhs

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without aasigning any reasons there of

Further details and any corrigendum can be seen@ www.tender. apeprocurement.gov.in.


S/d-
For COMMISSIONER

ప్రతిభావంతుడు సముద్రపు గట్టులాంటి వాడు.
అలల వంటి సమస్యలకు వెనుతిరిగి పోడు.
-టి. ఎడిసన్

# ఉభయ తారక ఒప్పందం

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలన్న భారత్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్యంలో ఆటంకాలన్నిటినీసర్దుకుంటూ, సరిచేసుకుంటూ సౌహార్ద్ర సంబంధాలతో భారత్ ముందడుగు వేస్తోంది. తాజాగా ప్రధాని నరేంద్రమోడీ భారత్ యునైటెడ్ కింగ్‌డమ్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యాన్ని సుగమం చేసే దిశగా స్వయంగా రంగంలోకి దిగారు. దాంతో సుంకాల రహిత స్వేచ్ఛా వాణిజ్యానికి ఆ దేశంలో అంకురార్పణ చేశారు. ఇన్నాళ్లు ఇచ్చిపుచ్చుకునే ధోరణికి కొన్ని దేశాలు విభిన్నపోకడలను అనుసరించాయి. భారత ప్రధాని సౌహార్ద్రతకు ఎక్కువ ప్రాముఖ్యమిస్తూ భారత్ బ్రిటన్‌ల మధ్య చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకంగా చెప్పుకోదగినది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేసుకోవాలన్నది వారి సంకల్పం. ఐరోపా యూనియన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత బ్రిటన్ భారత్‌తో కుదుర్చుకున్న ఏకైక అతిపెద్ద అత్యంత కీలక వాణిజ్య ఒప్పందంగా బ్రిటన్ ప్రధాని స్మార్టర్ పేర్కొనగా, అభివృద్ధి వాద యుగంలో తొలివికాస వాణిజ్య ఒప్పందంగా ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈ ఎఫ్‌టిఎను 'సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం'గా ఉభయ దేశాల ప్రధానులు పేర్కొనడం విశేషం. భారత్ ఎగుమతులకు సుంకం తగ్గడం ఒక ఎత్తయితే భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు బ్రిటన్ స్వాగతించడం ఒక ఎత్తు. ఇలా 'ఫ్రీ ట్రేడ్ డీల్' కారణంగా ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు ఏర్పడడం విశేషం. భారతీయ రైతులకు ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం చేకూరుతుంది. వాణిజ్య బంధాలు బలోపేతమౌతాయి. ఈ ద్వైపాక్షిక ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ ధృవీకరించాక వాణిజ్యం మొదలవుతుంది. అయితే దాదాపు ఆ ప్రక్రియకు ఏడాది కాలం పట్టుందని అంచానా. ఇది ప్రారంభమైన తర్వాత నాలుగైదేళ్లలో12వేల కోట్ల డాలర్ల వాణిజ్యానికి ప్రణాళికలు రూపకల్పన చేసుకుంటారు. బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ అధికారంలో ఉండగా భారత్ బ్రిటన్‌లు ఒకరి వికాసం కోసం మరొకరు చేతులు కలపాలనే ప్రతిపాదనలకు అంకురార్పణ జరిగింది. ప్రస్తుతం లేబర్ పార్టీ అధికారంలో ఉంది. బ్రిటన్ కొద్దికాలంగా ఆర్థికంగా బలహీనమవుతూ వస్తోంది. ఎవరు అధికారంలో ఉన్నా ఆర్థిక పరిస్థితులేమీ మెరుగుపడలేదు. ఈ నేపథ్యంలో 'ఎఫ్‌టిఎ' ఒప్పందాన్ని పెద్దగా ఎవరూ అభ్యంతరపెట్టలేదు. ఎన్నికల హామీలో కూడా చేర్చాయి. భారత్‌కు అండదండలు పుష్కలంగా అందించేందుకు బ్రిటన్ అక్కున చేర్చుకుంటామని భారత్‌లు ఒకరిపై ఒకరు విశ్వాసం కల్పించుకున్న తర్వాతనే 'ఒప్పందం'పై ఇరు వర్గాలు అడుగు ముందుకేశాయి. ఉభయదేశాల మధ్యజరిగే వాణిజ్య ఒప్పందంలో ఫార్మా వంటి రంగాల భవిష్యత్‌పై కొన్ని సందేహాలున్నాయి. వాటి విషయం ఎఫ్‌టిఎ ఆచరణలోకి వచ్చినప్పుడుమాత్రమే ఆయా అంశాల్లో మిగిలి ఉన్న 'కొర్రీ'లపై పరిష్కారం జరగగలదని తెలుస్తోంది. భారత్ నుంచి బ్రిటన్‌కు వెళ్లే 99 శాతం ఎగుమతులపై సుంకాలు బాగా తగ్గిపోతాయి. బ్రిటన్‌నుంచి మనకు వచ్చే దిగుమతులు కూడా 15శాతంనుంచిమూడు శాతానికి తగ్గిపోతాయి. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు వలన భారత్ రైతాంగం సంతోషపడే రోజులు కనుచూపు మేరలోనే ఉన్నాయి. ఇవన్నీ అమల్లోకి వస్తే ఉభయదేశాల్లోనూ ఉపాధిఅవకాశాలు పెరుగుతాయి. ఇరుదేశాలపరస్పర ప్రయోజనాలు చేకూరే ఈ ఒప్పందాన్ని ఉభయ దేశాల ప్రధానుల సమక్షంలో భావోద్వేగాలమధ్య వాణిజ్యమంత్రులు అధికారులు 'ఎఫ్‌టిఎ'పై సంతకాలు చేశారు. యూకె నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే 90శాతం ఉత్పత్తులపై దశలవారీగాసుంకాల తగ్గింపునకు ఆమోదించారు. ఒప్పందం అమలులోకి రాగానే 64శాతం సుంకాల కోత ఉంటుంది. ఐ.టి ఆర్థిక, వృత్తిపరమైన ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్, విద్యాసేవల సంబంధితమై సుంకాలు తగ్గుతాయి. తాత్కాలిక ప్రాతిపదికపై యూకెకు వెళ్లే భారతీయ కార్మికులకు, వారి యాజమాన్యానికి, సామాజిక భద్రత సహకారాలకు మూడేళ్ల కాలం మినహాయింపు ఉంటుంది. ఆటోమేటిక్ రంగంలో సుంకాలను టారిఫ్ రేటు కోటా వ్యవస్థ కింద 100 శాతంనుంచి పది శాతానికి తగ్గుతాయి. కానీ విదేశీ దిగుమతులు మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని నష్టపరుస్తాయనే విమర్శల మధ్య ఊగిసలాడుతోంది. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపులో భాగంగానే భారత్, యూకెల మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం కూడా సానుకూలపడే పరిస్థితి ఉంది. ఇకపై భారతీయులకువిదేశీ మద్యం చౌకధరకు దొరికే వీలుంది. రానున్న మూడేళ్లలో బ్రిటన్‌కు భారతీయ వ్యవసాయ ఎగుమతుల్లో 20 శాతం వృద్ధి చూస్తాం. భారతీయ వస్త్రాలు, పాదరక్షలు, వజ్రవైడూర్యాలు, ఆభరణాలు సముద్ర ఆహార ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులకు యూకెలో ఎలాంటి సుంకాలు లేకుండా విక్రయించుకోవచ్చు. భారత్, బ్రిటన్ భాగస్వామ్యంలో'విజన్ 2035'లక్ష్యంగా సాగుతున్నందున వీలైనంతమేరకుప్రయోజనాలు పరస్పరం అనుభవించే వీలుంది. భారతవిమానయాన సంస్థలలో రూ.58వేల కోట్లఒప్పందం చేసుకున్నారు. బ్రిటన్‌కు చెందిన 26 సంస్థలు ఒప్పందాలలో భాగస్వాములయ్యాయి. ఈఒప్పందంతో భారత్‌కు విమానాలు ఇంజన్లు దక్కుతాయి. అనేక బ్రిటన్ సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయి. ప్రపంచ దేశాల మధ్య శాంతిని నెలకొల్పే విషయంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయన్న ఆశాభావం ప్రధానిమోడీనుంచి వ్యక్తమయింది. పహల్గాం ఉగ్రవాదం విషయంలో బ్రిటన్ వైఖరి భారత్‌ను సంతోషపరిచింది. అనంతరంనాలుగేళ్లుగా సాగినప్రతిపాదనలు ఇంతవేగిరంగా స్వేచ్ఛావాణిజ్యఒప్పందాలకు ఉభయదేశాలు వడివడిగా ముందుకొచ్చాయి.

కష్టాలను తప్పించుకునే వారికంటే, వాటిని అధిగమించే వారే విజయం సాధించగలరు.



మహాత్మా గాంధీ

నువ్వెంత కష్టపడి పని చేస్తున్నావో చెప్పొద్దు. ఏం పని పూర్తయిందో చెప్పు.



బెర్నార్డ్ షా

# ప్రజావాక్కు



## కుబేర తరహా కుంభకోణమా?

ఈ మధ్యనే వచ్చిన 'కుబేర' చిత్రంలో బిచ్చగాళ్లను మోసగించినట్టు చూపితే, ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు కేంద్రంగా నిరుపేదలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి బ్యాంకు నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన తీరు చూస్తుంటే చాలా దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. యాక్సిస్ బ్యాంకు కేంద్రంగా చోటు చేసుకున్న ఈ కుంభకోణంలో అమాయకులైన దళితులు, గిరిజనులకు రుణాలను ఇప్పిస్తామంటూ కొంత మంది వ్యక్తులు మోసగించి నట్టు ప్రాథమిక సమాచారం. తొలుత 56 మందిని మోసగించి, రూ. 20 కోట్ల నుంచి రూ.30 కోట్లు స్కామ్ చేశారని భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం వందల కోట్లు దాటిందనే పత్రికల కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థల్లో లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరగడంపై ఆర్.బి.ఐ. తరచూ ఆందోళన వ్యక్తం చేయడం మినహా కార్యా చరణ లేకపోవడం ప్రమాదకరం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పిల్లలపై డిజిటల్ దుష్ప్రభావం

ఇప్పటి డిజిటల్ యుగంలో మొబైల్స్, ట్యాబ్‌లు, టీవీలు వంటి గ్యాడ్జెట్ల వాడకం పిల్లలజీవితంలో భాగమైపోయింది. అయితే దీనివల్ల వారి ఆరోగ్యంపై, చదువుపై, ప్రవర్తనపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం ద్వారా కంటిచూపు సమస్యలు, శారీరకజడత్వం పెరుగుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్ వీడియోలు వంటి వినోదాల వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది. అలాగే, సోషల్ మీడియా వల్ల పిల్లల్లో అసహనం, ఒత్తిడి ఏర్పడుతోంది. ఆత్మవిశ్వాసం తగ్గుతుంది కొన్నిసార్లు. డిజిటల్ ప్రపంచానికి పరిమితి ఉండాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అటెండర్ స్థాయి నుండి జిల్లా కలెక్టర్‌స్థాయి వరకు అధికారులకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వంతరపున గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. గుర్తింపుకార్డులలో ఉద్యోగికి సంబంధించిన పూర్తివివరాలను స్పష్టంగా ఉండే విధంగా చూడాలి. ఐడి నంబరు, పేరు, ఫోన్ నెం. ఉండాలి.

-ఈదూనూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## యూరియా కొరతతో అన్నదాత ఆగమాగం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో యూరియా కొరత వల్ల రైతులు నానా యాతన పడుతూవున్నారు. సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. ఉదయమే క్యూలైన్‌లో పాసుబుక్కులు పెట్టిన రైతులు వర్షాలతో రాళ్లను పెట్టి నిరీక్షిస్తున్నారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామనిప్రభుత్వం చెబుతున్నప్పటికీక్షేత్రస్థాయిలో మాత్రం అది కనబడటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులువరి, మొక్కజొన్న పంటలను ఎక్కువ మొత్తంలో సాగుచేశారు. యూరియా అవసరం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బారులు తీరుతున్నారు. యూరియా బస్తాలు తక్కువగా ఉండటంతో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు సరిపడా యూరియాను సరఫరా చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

## ఉచిత వైద్యం కల్పించాలి

కేంద్రప్రభుత్వం సుమారు ఏడాది క్రితం ఘనంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ కార్డులు తెలంగాణా రాష్ట్రంలో అయితే ఇంతవరకు జారీకాలేదు. మీ సేవ వారికి కూడా ఏ విధమైన సమాచారంలేదు. ఆధార్‌కార్డు ద్వారా కె.వై.సి. తీసుకుంటే హాస్పిటల్ వాళ్లు దానిని వైద్యానికి ఒప్పుకుంటారని అంటున్నారు. ఇంతవరకు ఆ పత్రాలను చూపించి వైద్యం చేయించుకున్న వాళ్లెవరు తారసపడలేదు. మరొక విషయ మేమంటే ఈ ఆరోగ్య పథకం ఎమర్జెన్సీలో హాస్పిటల్‌లో చేర్చుకున్న వారికే వర్తిస్తుందట. అవుట్ పేషంట్లకు ఈ పథకం పనికిరాదట. ఆపైన ఈ5లక్షల పథకం ఏడాదికి భార్యా భర్తలకు కలిపి ఉంటుందట. కేవలం ఆధార్ కార్డు ద్వారా 70 ఏళ్లుదాటిన వారందరికి ఏఅడ్డంకులు లేకుండాసూచించిన వైద్య శాలల్లో ఉచిత వైద్యం కల్పిస్తే ఏ గందరగోళం ఉండదు కదా!

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## కల్తీ విత్తనాలను అరికట్టాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఫర్టిలైజర్ యాజమాన్యసంస్థలు రైతులకు అందించే విత్తనాలపైదృష్టిసారించి నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులు మోసపోకండా చూడాలి. అదేవిధంగా అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీకి ప్రభుత్వమే అందించే ప్రయత్నం చేయాలి.

-ఎం.సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మనవి: ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సంక్షోభంలో యువజనం!

**దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకోని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, కొన్ని ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒక స్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏ ఆధారం లేక, నిరుత్సాహంగా అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు.**

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. ఈ మూడింటిలోనూ సాఫల్యం చెందితేనే పరిపూర్ణత లభిస్తుంది, అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతాం. ఇది వ్యక్తులకైనా, సంస్థలకైనా, ప్రభుత్వాలకైనా వర్తిస్తుంది. దేశంలో కోట్లాది మంది యువతీ యువకులు నిరాశానిస్పృహలతో నీరసించిపోతున్నా రనేది పెద్దలకు తెలియంది కాదు. వారిలో నూతనోత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి కార్యోన్ముఖులను చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి కూడా పెద్దలకు క్షుణ్ణంగా తెలుసు. కానీ ఆ వైపు అడుగులు పడడం లేదు. రాజకీయ నాయకులు ఎప్పుడూ రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తే రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్తు గురించి మదనపడతారు. అధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతో శాస్త్రసాంకేతిక రంగాలు పురోగమిస్తున్నాయి. ఆధునిక మానవుడు అపూర్వమైన మేథాసంపత్తిని సంతరించుకొని శక్తియుక్తులు, ప్రతిభాసామర్థ్యాలతో విశ్వాంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలకమైనదని నేతలు వక్కాణిస్తుంటారు. నవభారత నిర్మాణానికి ఉద్యమించి దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేయాల్సిన పవిత్ర బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందని పెద్దలు పదేపదే సెలవిస్తుంటారు. కాగితాలపై కళా విన్యాసంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని పల్లెపల్లెల్లో ప్రతి బస్తీలోనూ స్థితిగతులను చక్కదిద్ది ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా యువజనులందరినీ కలిపి ఐక్యంతో కృషిచేస్తే దేశానికి ఉజ్వల భవిష్యత్ సుసాధ్యమవుతుందని పాలకులందరికి తెలిసిందే. ఇందుకోసం అనేక పథకాలు కూడా ప్రవేశపెట్టారు. కానీ ఆ పథకాల అమల్లో అవినీతికి, అవతవకలు తావులేకుండా చేయలేకపోతున్నారు. మారిన కాలానుగుణంగా పరిస్థితుల దృష్ట్యా ముఖ్యంగా విద్యావిధానంలో మార్పు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలిసినా ఆ కోణంలో చర్యలు చేపట్టలేకపోతున్నారు. చాలా మంది విషయంలో చదివే చదువుకు జీవనోపాధికి సంబంధం లేకుండాపోతున్నది. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎందరో హోంగార్డు, పోలీసు లాంటి ఉద్యోగాలకు వెళ్తున్నారు. ఏదో ఒకరిద్దరు కాదు. వందలసంఖ్యలో ఈ నియామక పరీక్షలకు హాజరవుతున్నారు. అంతేకాదు ఆ ఉద్యోగాల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసేందుకు కూడా సిద్ధపడుతున్నారు. దళారుల చేతుల్లో మోసపోయిన వారెందరో ఉన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక బంగారు కొలువుగా మారిపోయింది. ఆ ఉద్యోగంలో చేరితే ఆ కుటుంబానికి ఆరోగ్య, ఆర్థిక సెక్యూరిటీ లభిస్తాయనే ఆశలు పెరిగిపోయాయి. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్రాల పాలకులు ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనలు ఇస్తున్నారు. కొంతమేరకు నియామకాలు కూడా జరుగుతున్నాయి. ఈ ఉద్యోగాల కోసం గ్రామాల్లో ఉన్న యువత పట్టణాలకు చేరుకొని కోచింగ్ సెంటర్ల బాటపడుతున్నారు. వేలాది రూపాయలు వ్యయం చేస్తున్నారు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొన్ని కోచింగ్ సెంటర్లు తమ శక్తి కొలదీ ప్రయత్నాలు చేస్తున్నాయి. పరీక్షలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ కోచింగ్ సెంటర్లకు అంతగా లక్ష్మీప్రసన్నం ఉంటుంది. మరొకపక్క ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా దళారుల ప్రమేయానికిఆస్కారం లేకుండా ఈ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు చేస్తున్నా, శతకోటి దారిద్ర్యాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఈ దళారులు ఏదో ఒక రూపంలో

## ఒక్క మాట

ఎక్కడో ఒక చోట చొచ్చుకుపోయేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత గతంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సంబంధించి భారీ కుంభకోణమే జరిగింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగాలే ప్రశ్నపత్రాలు అమ్ముకున్న విషయం వెలుగు చూసింది. ఆ కేసుకు సంబంధించి వందమందికిపైగా అటు ఉద్యోగులను, ఇటు ప్రశ్నపత్రాలను అందుకున్న అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు నడుస్తున్నది. అనేక రాష్ట్రాల్లో ఈ పరీక్షాపత్రాల వ్యాపారం జోరుగానే జరుగుతున్నట్లు గతంలో వెలుగు చూసిన సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే కేవలం ఐదారుశాతం మందికి ఉద్యోగాలు కల్పిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. దేశంలో ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూస్తున్న కోట్లాది మంది యువతీయువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం అనేది సాధ్యమయ్యే పనికాదు. అలా కోరుకోవడం కూడా ఏమాత్రం సమంజసం కాదు. పోనీ స్వయం ఉపాధి పథకాలేమైనా అవకతవకలకు, అవినీతికి దూరంగా నడుస్తున్నాయంటే అదీలేదు. ఉత్తరమో, దక్షిణో లేకుండా ఫైళ్లు కదలని పరిస్థితి. రాజకీయ అండైనా లేక లక్ష్మీప్రసన్నలైనా ఉండాలి. అందుకే యువజన శక్తులే దేశాభివృద్ధికి బాటలు అంటూ ఉపన్యాసాలు ఇస్తూ దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలు యువజన సంక్షేమం కోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువకులే కాదు ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, కొన్ని ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒకస్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏఆధారం లేక, నిరుత్సాహంగా అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ చేసి మెరికల్లాంటి యువతీయువకులు ఇంతకాలం విదేశాలకు వెళ్లిపోయి తమ విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకొని అక్కడే సేవలు అందిస్తున్నారు. అక్కడికి వెళ్లాలనే ఆరాటపడే వారి సంఖ్యకూడా తక్కువేమీకాదు. ఇప్పుడు అక్కడి పరిస్థితులు కూడా అయోమయంగా మారిపోయాయి. అమెరికా దేశ అధ్యక్షుడుగా ట్రంప్ రెండోసారి గెలిచిన తర్వాత స్థానికులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత అంటూ గళమెత్తారు. మొన్న బుధవారం వాషింగ్టన్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో ఆయన ఏకంగా భారతీయులను ఉద్యోగాల్లో నియమించుకోవద్దని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎంతో మంది అమెరికా నుండి భారత్‌కు వచ్చారు, వచ్చేస్తున్నారు. అక్రమ వలసదారుల పేరుతో మరెందరినో గొలుసులు వేసి విమానాల్లో ఎక్కించి పంపుతున్నారు. అక్కడ ఉన్నవారికే పరిస్థితి అలా ఉంటే కొత్తగా వెళ్లాలనుకునేవారికి అవకాశాలు దాదాపు మూసుకుపోయినట్లే చెబుతున్నారు. ఇంకొకపక్క ఆస్ట్రేలియాలో కూడా పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. గతవారంలో భారత సంతతికి సంబంధించిన ఒక యువకుడిని హత్యచేయగా, దేశంనుంచి వెళ్లిపోమంటూ పోస్టర్లు వేస్తున్నారు. ఇక ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్ తదితర దేశాల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. యుద్ధాలతో అవి అతలాకుతలం అవుతున్నాయి. ఉద్యోగాల సంగతి దేవుడెరుగు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులను సైతం స్వదేశాలకు తరలించారు. మరొకపక్క ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసంచేసే కార్యక్రమాలు దేశంలో నిరాటంకంగా జరుగుతున్నాయి. పాలకులకు ఈ విషయాలన్నీ తెలియనివి కావు. ఇదంతా లేత మనసులపై చెరగని ముద్ర వేస్తున్నది. సమాజంపై ప్రేమ అభిమానం ఉన్న యువకులే పగ, ద్వేషంతో రగలిపోతున్నారు. మరికొందరు నిస్సహాయస్థితిలో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు కళ్లుతెరవాలి. యువతీయువకుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. ఇందుకు ముఖ్యంగా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలి. కనీసం యువతీయువకుల సంక్షేమం కార్యక్రమాలు, ఉద్యోగాల నియామకాల్లో త్రికరణశుద్ధిగా అవినీతికి అవకాశం లేకుండా వ్యవహరించగలిగితే కొంత మేరకైనా లక్ష్యం సాధించే అవకాశాలు ఉంటాయి. ●

# నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించేవారెవరు?

డి. అశోక్

పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు ప్రతి రోజూ పరితపిస్తూ ఉంటారు. స్కూల్ బస్సులు, ఆటోలు, వ్యాన్లకు వేల రూపాయలు వెచ్చించి తమ బిడ్డలను దూర ప్రాంతాల స్కూళ్లకు పంపించే తల్లిదండ్రులు, వాళ్లు సురక్షితంగా తిరిగివస్తారన్న నమ్మకంతోనే ఆ నిర్ణయంతీసుకుంటారు. కానీ ఆ నమ్మకాన్ని కొన్ని నిస్సహాయ పరిస్థితులు భగ్నం చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు దీనికి నిదర్శనంగా మారాయి. తనిఖీల్లో భయానక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. స్కూల్ బస్సులు నడిపే 14 మంది డ్రైవర్లు, విద్యార్థులను తరలించే 26 మంది ఆటో డ్రైవర్లు మద్యం సేవించిన స్థితిలో వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. ఓ డ్రైవర్ రక్తంలో ఆల్కహాల్ స్థాయి నిబంధనల కంటే 13 రెట్లు అధికంగా ఉండటం, అతడు ఇలా వాహనం నడపడం నాకు కొత్త కాదు అని నిర్లక్ష్యంగా చెప్పడం గమనార్హం. ఈ సంఘటనలు పిల్లల ప్రాణాలను ఏ స్థాయిలో ప్రమాదంలోకి నెట్టుతున్నాయో స్పష్టంగా చూపిస్తున్నాయి. డ్రైవర్‌లు తాగిన మత్తులో వాహనాలు నడపడం కేవలం వ్యక్తిగత బాధ్యతాలోపం కాదు. ఇది యాజమాన్యాల నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్‌ల ఆరోగ్య పరిస్థితిని, మద్యపానం వంటి అలవాట్లను కచ్చితంగా తనిఖీ చేయాల్సిన బాధ్యత కలిగి ఉన్నప్పటికీ, చాలా చోట్ల అది జరగడం లేదు. ఓ చిన్న అప్రమత్తత పిల్లల ప్రాణాలపై తీవ్రప్రభావాన్ని చూపుతుంది. 2022లో దేశవ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్‌వల్ల 10వేలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 4,201మంది ప్రాణాలు కోల్పోయారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత కొన్ని సంవత్సరాల్లో 83వేల డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 18వేలకి చేరిన ఈ కేసులు, పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో తెలుపుతున్నాయి. విశాఖపట్నంలో 2023తో పోల్చితే డ్రంకన్ డ్రైవ్ కేసులు 58 శాతం పెరగడం, ఇతర పట్టణాల్లోనూ ఇలాంటి వృద్ధి నమోదవడం కళ్లెదుట నడిచే ప్రమాద ఘట్టాల వైనాన్ని గుర్తు చేస్తోంది. తాగి వాహనం నడిపిన వ్యక్తులపై ఇప్పటికీ తక్కువ ఫైన్‌లు, కొన్ని రోజులు లైసెన్స్ సస్పెన్షన్ వంటి చర్యలు మాత్రమే తీసుకుంటున్నాం. కానీ అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో ఇటువంటి చర్యలు అత్యంత కఠినంగా ఉంటాయి. మరణాలు కలిగిస్తే 15నుంచి 20ఏళ్లవరకు జైలుశిక్ష విధిస్తారు. అటువంటి శిక్షలు వందల మంది జీవితాలను కాపాడే అవకాశాన్ని ఇస్తాయి. అందుకే భారత్‌లో కూడా శిక్షల తీవ్రతను పెంచేలా కొత్త చట్టాలను తేవాల్సిన అవసరం ఉంది. డ్రంకన్ డ్రైవ్‌ను ఆదాయ వనరుగా చూడడం మానేయాలి. మద్యం వలన ఎన్నో కుటుంబాలు విడిపోతున్నాయి. పిల్లలు అనాథలవుతున్నారు. ఇది సామాజిక సమస్యగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసులు వారాంతాల్లో మాత్రమే కాకుండా ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలి. హైవేలపై గణనీయంగా శ్వాస విశ్లేషణ పరీక్షలు జరగాలి. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపితే, అతడి లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దుచేయాలి. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్లపై పోలీసు వెరిఫికేషన్ చేయడం తప్పనిసరి చేయాలి. పిల్లల భవిష్యత్తు కంటే విలువైనది మరొకటి లేదు. ప్రతి తాగిన డ్రైవర్ స్కూల్ బస్సు స్టీరింగ్ పట్టుకున్నప్పుడు అది కేవలం చట్ట ఉల్లంఘన కాదు, ఒక కుటుంబంపై జరిగిన దాడి. సమాజంగా మనం మేలుకోవాలి. చట్టాలను కఠినతరం చేయాలి. ●

# నామినేటెడ్ సభ్యుల ఎంపికలో కొత్త ఒరవడి

యేచన్ చంద్రశేఖర్

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 80, క్లాజ్ (1), సబ్ సెక్షన్ (ఎ) ప్రకారం, కళ, సాహిత్యం, సాంకేతిక విజ్ఞానం, సామాజిక సేవా రంగాలలో గణనీయమైన కృషి చేసిన 12 మంది సభ్యులను రాజ్య సభకు నామినేట్ చేసేందుకు రాష్ట్రపతికి అధికారం కల్పించింది. రాష్ట్రపతి, రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన అధికారాన్ని వినియోగించుకుంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని మంత్రి మండలి సిఫార్సుల మేరకు గతంలో నామినేట్ చేయబడి పదవీ విరమణ చేసిన సభ్యుల స్థానాలను భర్తీ చేయడానికి ఉజ్వల్ నికమ్, సి సదానందన్ మాస్టర్, హర్షవర్ధన్ ష్రింగ్లా, డాక్టర్ మీనాక్షిజైన్‌లను రాజ్యసభకు నామినేట్ చేసినట్లు జూలై 12, 2025 నాడు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు తప్ప నామినేటెడ్ సభ్యులు ఎన్నికైన ఎంపీలు అనుభవించే అన్ని అధికారాలు, హక్కులకు అర్హులు. గత దశాబ్ద కాలంలో, ప్రత్యేకించి రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేసే 12 మంది సభ్యుల విషయంలో, గణనీయమైన మార్పు గోచరిస్తోంది. రాజకీయాలకు దూరంగా విభిన్న దృక్పథాలతో వివిధ రంగాలలో తమ నైపుణ్యాలతో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని ఎగువ సభలోకి ఆహ్వానించి వారి అనుభవం నుండి ప్రయోజనం పొందడానికి నామినేషన్ పద్ధతి ప్రవేశపెట్టబడింది. ఇటీవలకాలంలో రాష్ట్రపతి ద్వారా రాజ్యసభకు నామినేట్ చేయబడే సభ్యుల ఎంపికలో స్వాగతించదగ్గ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో మాదిరిగా రాజకీయ లబ్ధి కోసమో లేదా సెలెబ్రిటీలు, డబ్బు పరపతి ఉన్న వ్యక్తులనో రాజ్యసభకు నామినేట్ చేసే ఒరవడి కాస్త తగ్గుముఖం పట్టి భారతదేశ సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించడంలో వారి కృషికి గుర్తింపు పొందిన వారిని నామినేట్ చేయడంపై ప్రాధాన్యత పెరుగుతోంది. ఇది ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేసిన నలుగురు సభ్యుల విషయంలో స్పష్టంగా వెల్లడవుతోంది. ఈ నలుగురిలో ఉజ్వల్ దేవరావు నికమ్ ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్. ఆయన కీలకమైన క్రిమినల్ కేసులను విచారించడంలోపేరు గడించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన నిర్వహించిన కీలక కేసుల్లో 26/11 ముంబై ఉగ్రవాద దాడి విచారణ ఒకటి. ఈ కేసులో ప్రాణాలతో పట్టుబడ్డ ఏకైక ఉగ్రవాది అజ్మల్ కసాబ్‌కు ఉరిశిక్ష పడేలా వ్యాజ్యం నడిపిన తీరు ఆయన న్యాయవాద వృత్తి నైపుణ్యానికి, నిబద్ధతకు నిదర్శనం. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన ప్రాతినిధ్యం వహించిన కేసులలో 1991 బాంబే బాంబు పేలుళ్ల కేసు, 1993 ముంబై వరుస పేలుళ్ల కేసు2003 గేట్‌వే ఆఫ్ ఇండియా బాంబు దాడులు కేసు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రధాన కేసుల్లో కూడా నికమ్ వాదించారు.



ప్రముఖ గూర్ఖా వ్యక్తులలో ఒకరైన హర్షవర్ధన్ ష్రింగ్లా డార్జిలింగ్ కొండ ప్రాంతానికి చెందినవారు. ఆయన 2020 నుండి 2022 వరకు భారత విదేశాంగ కార్యదర్శిగా పనిచేశారు. 2019-2020లో అమెరికాలో భారత రాయబారిగా కూడా పనిచేసిన ఆయన 2019లో అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన హౌడీ మోడీ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి పనిచేశారు. 2023లో భారతదేశ జి20 అధ్యక్ష పదవికి ఆయన చీఫ్ కోఆర్డినేటర్ కూడా పనిచేశారు. విదేశాంగ విధానం దౌత్యంలో విస్తృత అనుభవం కలిగిన ష్రింగ్లా యునైటెడ్ స్టేట్స్, థాయిలాండ్ రాయబారిగా, బంగ్లాదేశ్‌కు హైకమిషనర్‌గా కూడా పనిచేశారు. కోవిడ్19 మహమ్మారి సమయంలో ష్రింగ్లా భారతదేశ దౌత్య కార్యకలాపాలకు నేతృత్వం వహించడంతో పాటు చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు వంటి సున్నితమైన సమస్యల పరిష్కారానికి కృషి చేసారు. వ్యూహాత్మక ఆలోచనా ధోరణితో మేధోపరమైన సహకారం అందించగల ఆయన నైపుణ్యం, సంక్లిష్టమైన దౌత్య సవాళ్లను నిర్వహించగల ఆయన సామర్థ్యం పార్లమెంటరీ కార్యకలాపాలను సుసంపన్నం చేస్తాయనడంలో ఎలాంటి సంశయం లేదు. పద్మశ్రీ మీనాక్షిజైన్ ప్రస్తుతం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లో (ఐసిఎస్‌ఆర్) సీనియర్ ఫెలో. భారతదేశంలో సాంస్కృతిక, మతపరమైన పరిణామాలపై విశేష పరిశోధనలు చేసారు. విద్య, సాహిత్యం, చరిత్ర రాజకీయ శాస్త్రంలో ఆమె చేసిన కృషి ముఖ్యంగా విద్యాపరమైన చర్చలను సుసంపన్నం చేసింది. భారతీయ వారసత్వం, మత సంస్కరణలు, ప్రస్తుత రాజకీయ పోకడలపై ఆమె అభిప్రాయాలు, లోతుగా పరిశోధించి జాతీయ ప్రాముఖ్యత కలిగిన చారిత్రక సమస్యలను పరిష్కరించిన రచనలు పార్లమెంటరీ చర్చలకు విలువైన రచనలుగా పరిగణించబడతాయి. 2014లో భారత ప్రభుత్వంచే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సభ్యురాలిగా నామినేట్ చేయబడిన ఆమె సాహిత్యం విద్యా రంగాలలో చేసిన కృషికి 2020లో పద్మశ్రీఅవార్డును అందుకున్నారు. రాజ్య సభ సభ్యురాలిగా ఆమె నామినేషన్ భారతీయ చరిత్ర సంస్కృతి రంగంలో మేధోపరమైన కృషి మరియు పాండిత్యానికి గుర్తింపును ప్రతిబింబిస్తుంది. సదానందన్ మాస్టర్ రాజ్యసభ ఎంట్రీ కేరళ సుదీర్ఘ రాజకీయ హింస, ప్రతీకార హత్యల చరిత్రనుగుర్తు చేస్తుంది. హింస బెదిరింపులు అతని ఉత్సాహాన్ని ఏమాత్రం నిలువరించలేకపోయాయి. కమ్యూనిస్ట్ కుటుంబంలో జన్మించిన సదానందన్ మాస్టర్ తన కళాశాల రోజుల్లో సిపిఎం సభ్యుడిగా చురుకుగా ఉండేవారు. సిపిఎం నాయకులతో విభేదాల కారణంగా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులైన ఆయన కొంతమంది స్నేహితులతో కలిసి, సిపిఎం బలమైన కోట అయిన మట్టన్నూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ యూనిట్‌ను ఏర్పాటు చేయగా ఆయనను కన్నూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్‌గా నియమించారు. జనవరి 25, 1994న, 12 మంది సిపిఎం కార్యకర్తలు, ఆయన ప్రయాణిస్తున్న కారు నుండి బయటకు లాగి, రెండు కాళ్లను తెగనరికారు. అయితే, ఎన్నికైన నామినేట్ చేయబడిన సభ్యుల కూర్పుతో రాజ్యసభ ప్రధాన నిర్మాణం భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో కీలకమైన అంశంగా పరిగణించబడుతుంది. ●

# గాజాలో మరణరోదన..



## ఆకలితో పిట్టల్లా రాలుతున్న పిల్లలు

**గాజాసిటీ, జూలై 25:** గాజాలో పరిస్థితులు రోజురోజుకు దారుణంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా ఆకలి కేకలే. ఏడిస్తే కన్నీరు కూడా రాని పరిస్థితి. తిండి లేక అల్లాడుతున్న చిన్నారులు పిట్టల్లా రాలిపోతున్నారు. పోషకాహార లోపంతో నిత్యం వందలాది మంది పసి పిల్లలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఆహారం, ఔషధాలు లేక వైద్యులు చేతులెత్తేస్తున్నారు. ఇలా గడిచిన నాలుగు రోజులుగా గాజాలో అనేకమంది చిన్నారులు ఆకలికి బలయ్యారు. 'ఉత్తర గాజాలో ఉన్న పేషెంట్స్ ఫ్రెండ్స్ ఆస్పత్రిలో ఎన్నడూ లేని విధంగా చిన్నారుల చేరికలు ఉన్నాయి. నిత్యం 200 నుంచి 300 మంది చేరుతున్నారు. ఈ విపత్తును చూస్తుంటే మాటలు రావడం లేదు. శరీరం బక్కచిక్కి ఎముకలు మాత్రమే కనిపిస్తున్నాయి. పిల్లలు నడవడం, కనీసం ఏడవడానికీ ఓపిక లేదు. వారి పొత్తికడుపులు ముడుచుకుపోయాయి. వీరికి ఇవ్వడానికి ఆస్పత్రిలో సరైన పోషకాహారం కూడా లేదు. కొందరికి ఐసియులో చికిత్స అందిస్తున్నా ప్రాణాలను కాపాడలేకపోతున్నాం. ఇంతకంటే దారుణ, భయంకరమైన పరిస్థితి మరొకటి లేదు. మే కూడా అలసిపోయాం' అని అమెరికా స్వచ్ఛంద సంస్థ తరఫున డాక్టర్ రానా సోహోబ్ పేర్కొన్నారు. చిన్నారులకు పోటాషియం ఎంతో కీలకమని, కానీ, అది అందుబాటులో లేకపోవడంతో రానున్న రోజుల్లో మరిన్ని మరణాలు చూడక తప్పని దుస్థితి నెలకొందని వాపోయారు.

**లక్ష మందికి తక్షణ అవసరం:** లక్ష మంది మహిళలు, చిన్నారులకు అత్యవసర చికిత్స అవసరమని ఐరాసకు చెందిన ప్రపంచ ఆహార కార్యక్రమం విభాగం పేర్కొంది. చాలా కీలక చికిత్సలు ఆగిపోయాయని, అవసరమైన ఔషధాలు అయిపోనట్లు వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకలి చావులకు ఇది ఆరంభం మాత్రమే నని మెడ్‌గ్లోబల్ సహవ్యవస్థాపకుడు, గాజాలో వాలంటీర్‌గా పనిచేసిన డాక్టర్ జాన్ కహలెర్ పేర్కొన్నారు. గత మూడు వారాల్లో 48 పోషకాహార లోపం సంబంధిత మరణాలు చోటుచేసుకున్నాయని, వారిలో 28 మంది పెద్దలు, 20మంది చిన్నారులు ఉన్నారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. గత ఐదు నెలల్లో 10 మంది చనిపోగా ఇప్పుడది వేగంగా పెరుగుతోందని తెలిపింది. మరోవైపు ఐదేళ్ల లోపు 21 మంది చిన్నారులు ఆకలి కారణంగా ప్రాణాలు కోల్పోయారని, జూలైలోనే 13 మంది చనిపోయినట్లు గుర్తించామని ఐరాస మానవతా సంస్థ ఒసిహెచ్ఎ తెలిపింది.

**ట్రక్కుల లూటీ:** ఐరాస అంచనా ప్రకారం గాజా వాసులకు నిత్యం 500-600 ట్రక్కుల ఆహార పదార్థాలు అవసరం. కానీ, ప్రస్తుతం సరాసరి 69 ట్రక్కుల్లో మాత్రమే సరఫరా అవుతున్నట్లు ఐరాస చెబుతోంది. అయితే, వీటిని పంపిణీ చేయకముందే.. ఆహారం కోసం అల్లాడుతున్న పాలస్తీనా వాసులు ఆ ట్రక్కులపై దాడి చేసి లూటీ చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రానున్న రోజుల్లో భారీగా ఆకలి చావులు నమోదయ్యే ప్రమాదం ఉందని, ఆయా దేశాలు తక్షణమే స్పందించి ఆహార పదార్థాలు సరఫరా చేయాలని 115 అంతర్జాతీయ మానవ హక్కుల, స్వచ్ఛంద సంస్థలు ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే.



## అటవీ అధికారి ఇంట్లో రూ.1.4 కోట్ల నగదు

### విజిలెన్స్ సోదాల్లో మరింతగా నగదు లభ్యం

**కోరాపుట్,జూలై 25:** ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఉన్న జేయ్‌పోర్ డిప్యూటీ రేంజర్ రామచంద్ర నేపాక్ ఇండ్లపై ఇవాళ విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. ఆ తనిఖీల్లో ఆ ఆఫీసర్ ఇంట్లో సుమారు 1.4 కోట్ల నగదు దొరికింది. అతని అపార్ట్‌మెంట్‌లోని ఓ రహస్య ట్రెజరీలో ఆ నగదును దాచిపెట్టాడు. ఫారెస్ట్ ఆఫీసర్ రామచంద్ర నుంచి నగదుతో పాటు నాలుగు బంగారు బిస్కెట్లు, 16 బంగారు నాణాలు రికవరీ చేశారు. మొత్తం ఆరు ప్రదేశాల్లో ఇవాళ ఒడిశా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులను సంపాదించినట్లు ఆ ఆఫీసర్‌పై ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్ శాఖ స్పెషల్ జడ్జి ఇచ్చిన సెర్చ్ వారెంట్‌తో అధికారులు ఆ ఆఫీసర్ ఇండ్లల్లో తనిఖీలు చేశారు. ఆరుగురు డీఎస్పీలు, అయిదుగురు ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఏఎస్‌ఐలు, ఇతర సిబ్బంది ఈ సోదాల్లో పాల్గొన్నారు. అన్ని చోట్ల నుంచి సుమారు 1.4 కోట్ల నగదును సీజ్ చేశారు. ప్రస్తుతం ఇంకా తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. సోదాలు ముగిసిన తర్వాత సమగ్రమైన ఇన్ఫర్మేషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. జేయ్‌పోర్ పట్టణంలోని గోల్డెన్ హైట్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ లో ఉన్న ఫ్లాట్ నెంబర్ 510లోని ఓ సీక్రెట్ లాకర్‌లో 1.4 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఒడిశా విజిలెన్స్ అధికారులు చెప్పారు.

## పూంచ్‌లో మందుపాతర పేలి అగ్నివీర్ మృతి



**పూంచ్, జూలై 25:** జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఎల్ఒసి వెంబడి మందుపాతర పేలడంతో ఒక ఆర్మీ జవాన్ శుక్రవారం ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఇండియన్ ఆర్మీకి చెందిన వైట్‌నైట్ కార్ప్స్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. 'కృష్ణ ఘాటి బ్రిగేడ్ జనరల్ ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా మందుపాతర పేలి 7-జాట్ రెజిమెంట్‌కు చెందిన అగ్నివీర్ లలిత్‌కుమార్ వీరమరణం పొందారు. ఆయన కుటుంబసభ్యులకు మేము అందగా నిలుస్తాం' అని వైట్‌నైట్స్ కార్ప్స్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ మిలటరీ చర్యలకు దిగు తూ ఎల్ఒసి వెంబడి పెద్దఎత్తున క్రాస్-బోర్డర్ షెల్లింగ్ జరిపింది. గత నెలలో రాజౌరి జిల్లా ఎల్ఒసి సమీపంలోని ఫార్వార్డ్ ఏరియాలో అనుమానాస్పద కదలికలు గుర్తించడంతో ఆర్మీకాల్పులు జరిపింది. పూంచ్, సాంబ, కథువా జిల్లాలతో సహా డజనుకుపైగా ఏరియాల్లో గాలింపు చర్యలు చేపట్టింది.

## విమానంలో సాంకేతిక లోపం

### వెనక్కి మళ్లించిన పైలట్లు!

**జైపూర్, జులై 25:** గగనతలంలోఉండగా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. జైపూర్ నుంచి ముంబయి వెళుతున్న విమానం టేకాఫ్ అయిన 18 నిమిషాలకే సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు దాన్ని వెనక్కి మళ్లించారు. దాంతో అది బయల్దేరిన చోటే ల్యాండ్ కావాల్సి వచ్చిందని విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. ఇటీవలి కాలంలో ఎయిరిండియా విమానాలు తరచూ వార్తల్లో నిలుస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ప్రయాణికులు భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 188మంది ప్రయాణికులు, సిబ్బందితో ఉన్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలె త్తినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో ఘట నలో హాంకాంగ్ నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చిన ఎయిరిండియా ల్యాండింగ్ అయిన కాసే పటికే పవర్ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైనసిబ్బంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేయడంతో పెనుప్రమాదం తప్పింది.

## కుప్పకూలిన స్కూలు భవనం పైకప్పు

### ఏడుగురు చిన్నారులు మృతి, 28 మందికి తీవ్రగాయాలు



**జైపూర్,జూలై 25:** రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఝులావర్‌లోని పీప్లోడీ ప్రాథమిక పాఠశాల పైకప్పు ఒక్కసారిగా శుక్రవారం ఉదయం కుప్పకూలింది. దీంతో శిథిలాల కింద అనేక మంది విద్యార్థులు చిక్కుకుపోయారు. ఘటనలో ఏడుగురు చిన్నారులు చనిపోయారు. 28 మంది విద్యార్థులు గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ఉదయం పిల్లలు తరగతులకు హాజరవుతుండగా ఘటన జరిగినట్లు తెలిపారు.అయితే ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించి, చిన్నారులను బయటకు తీశారు. ఆ విషయంలో స్థానికులు కూడా సహాయపడ్డారు. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనలో ఏడుగురు పిల్లలు మరణించగా, మరో 28 మంది గాయపడ్డారని పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ మీడియాకు తెలిపారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను ప్రత్యేక ఆరోగ్య కేంద్రంలో చేర్పించామని, కొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. పాఠశాల పైకప్పు కూలిన ఘటనలో ప్రాణనష్టం సంభవించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు.రాజస్థాన్‌లోని ఝులావర్ లోని ఒక పాఠశాలలో జరిగిన ప్రమాదం విషాదకరం. తీవ్ర బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత విద్యార్థులు, వారి కుటుంబాలతో నా ఆలోచనలు ఉన్నాయని మోదీ తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. అధికారులు బాధిత వారికి అన్ని విధాలుగా సహాయం అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు, పాఠశాల పైకప్పు కూలిన ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడంపై సంతాపం తెలిపారు. గాయపడిన పిల్లలకు సరైన చికిత్స అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఖిఖిమరణించిన వారికి దేవుని పాదాల వద్ద స్థానం దొరకాలి. అపారమైన దుఃఖాన్ని భరించే శక్తిని వారి కుటుంబాలకు దేవుడు ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ కూడా స్పందించారు. ఈ విషాద ఘటన తనను ఎంతో బాధించిందని తెలిపారు. గాయపడిన చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. వారి చికిత్సకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. భవనం పైకప్పు ఎలా కూలిపోయిందో తెలుసుకునేందుకు విచారణ జరిపిస్తామన్నామని వెల్లడించారు. గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ఆకాంక్షించారు. శిథిలాల కింద మరికొందరు విద్యార్థులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, దీనిపై గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పుడు కూలిపోయి విషాదానికి దారి తీసిందని చెబుతున్నారు.

## రెండుదేశాలమధ్య రాజుకుంటున్న శివాలయాల వివాదం


### పరస్పర దాడులకు దిగుతున్న థాయిలాండ్, కాంబోడియా



**బ్యాంకాక్,జూలై 25:** ఆసియా దేశాలైన థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య ఘర్షణలు యుద్ధం అంచుకు చేరుకున్నాయి. ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకోవడంతో ఇరుదేశాల బలగాలు ఫిరంగులు, రాకెట్లతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఘర్షణలకు సరిహద్దు వివాదాలే కారణమని చెబుతున్నా ఆ సరిహద్దుల్లోని హిందూ దేవాలయాల కోసం ఇరుదేశాలు ఎన్నో ఏళ్లుగా కొట్టుకుంటున్నాయి. ప్రధానంగా ప్రముఖ ఆలయాలు ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అరణ్యాలు కలగలిసిన ప్రాంతాల కోసం దశాబ్దలుగా ఇరుదేశాల మధ్య తీవ్ర పోరాటం జరుగుతోంది. ఈ ఆలయాల్లో శివలింగం, సంస్కృత లిపిలో శాసనాలు, హిందూ దేవతల చిత్రాలు ఉన్నాయి. థాయిలాండ్, కంబోడియా మధ్య 508 మైళ్ల సరిహద్దు ఉంది. దీనిలో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. రెండు దేశాలు శాంతియుతంగా కలిసి ఉంటున్నప్పటికీ, సరిహద్దుల్లో మాత్రం తరచూ ఘర్షణలతో రగులుతున్నాయి. వీటిల్లో 9వ శతాబ్దానికి చెందిన ప్రీహ్ విహార్ కీలకమైంది. ఈ శివాలయాన్ని ఖెమర్ పాలకులు నిర్మించారు. డాంగ్రెక్ పర్వతాల శిఖరం థాయ్‌లాండ్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. ఈ ఆలయం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానిని థాయ్‌లాండ్ అంగీకరించింది. కంబోడియా విజ్ఞప్తి మేరకు 2008లో ఈ ఆలయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. దీనిని థాయ్‌లాండ్ తీవ్రంగా వ్యతిరేకించింది. కంబోడియానాడు చూపిన మ్యాప్‌లో 4.6 చదరపు మైళ్లను ఆక్రమించుకొన్నట్లు ఆరోపించింది. అటు థాయ్‌లాండ్ దేశ పరిధిలోని సురిన్ ప్రావిన్స్‌లోని ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ప్రాంతాలు కూడా ఇరుదేశాల మధ్య వివాదాస్పద ప్రదేశాలుగా ఉన్నాయి. థాయ్‌లాండ్ సురిన్ ప్రావిన్సులోని ప్రసాత్ ట మోన్ థోమ్ అనే మరో శివాలయం కోసం కూడా రెండు దేశాలు గొడవ పడుతున్నాయి. చారిత్రక ఆధారాల ప్రకారం ఈ శివాలయం తమకే చెందుతుందని కంబోడియా వాదిస్తోంది. అందుకు థాయ్‌లాండ్ అంగీకరించట్లేదు. శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాలు రెండు దేశాల మధ్య వివాదంతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన వేళ కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు థాయ్‌లాండ్‌లోని భారతీయులకు అడ్వైజరీ జారీ చేసింది. భారతీయ పౌరులు థాయ్‌లాండ్‌లోని ఏడు ప్రావిన్సులవైపు ప్రయాణాలు చేయద్దొని అక్కడి భారతీయ రాయబార కార్యాలయం ప్రకటనను విడుదల చేసింది. ప్రస్తుత అస్థిర పరిస్థితుల దృష్ట్యా థాయ్‌లాండ్‌లో పర్యటించే భారతీయులు స్థానిక అధికారులు ఇచ్చే అప్‌డేట్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎంబసీ సూచించింది. ఆ దేశ పర్యాటక శాఖ సూచించిన ప్రదేశాల్లో ప్రయాణాలకు దూరంగా ఉండాలని పేర్కొంది.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్నికల అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్

**న్యూఢిల్లీ,జూలై 25:** నూతన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం, తాజాగా రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీని నియమించింది. ఆరోగ్య సమస్యలను పేర్కొంటూ సోమవారం సాయంత్రం పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఉప్పరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. న్యాయ మంత్రిత్వ శాఖతో సంప్రదించి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ సమ్మతితో 2025 ఉపరాష్ట్రపతి ఎన్నికలకు మోదీని రిటర్నింగ్ అధికారిగా నియమించినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. రాజ్యసభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, సెక్రటేరియట్ డైరెక్టర్ విజయ్ కుమార్‌లను సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లు పూర్తి కాగానే అతి త్వరలో షెడ్యూలు విడుదల చేస్తామని ఎన్నికల కమిషన్ బుధవారం తెలిపింది. నెల రోజుల్లో ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ పూర్తి కావొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు 10 వరకూ పదవీ కాలం ఉంది. కొత్త ఉప రాష్ట్రపతి మిగిలిన కాలానికి కాకుండా ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు. అయితే దేశంలో ఇప్పటిదాకా 16 సార్లు ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగ్గా నాలుగు సార్లే ఏకగ్రీవమైంది. మిగిలిన 12 సార్లు పోటీ జరిగింది. ఇందులో రెండు ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పోటీ చేశారు. 2022లో కాంగ్రెస్ అభ్యర్థి మార్గరెట్ ఆల్వాను ఓడించి జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి అయ్యారు. ఈసారి బీజేపీ సీనియర్ నేతనే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే కూటమి ఖరారు చేస్తుందని తెలుస్తోంది. తొలుత బీహార్ సీఎం నీతీశ్ కుమార్‌తోపాటు మరో ఐదుగురు పేర్లు వినిపించినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మరోవైపు, ఇండియా కూటమి తమ తరఫున ఒక ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని యోచన చేస్తున్నట్లు సమాచారం. పార్లమెంట్‌లో ఇండియా కూటమికి మెజారిటీ లేకపోయినప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటూ ఉండడం గమనార్హం. ఫలితంతో సంబంధం లేకుండా బలమైన సందేశాన్ని పంపే ఉద్దేశంతోనే ప్రతిపక్ష పార్టీల కూటమి పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



## ఐదో రోజూ ఉభయసభల్లో గందరగోళం

### సోమవారానికి వాయిదాపడిన పార్లమెంట్



**న్యూఢిల్లీ,జూలై 25:** పార్లమెంట్ ఉభయ సభల్లో ఐదో రోజైన శుక్రవారం కూడా గందరగోళ వాతావరణం కొనసాగింది. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను ఉపసంహారించుకోవాలని డిమాండు చేస్తూ విపక్షాలు నినాదాలు చేయడంతో రభస ఏర్పడి సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. విపక్ష సభ్యుల నిరసనలతో ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఉభయ సభలు శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశమయ్యాయి. సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఆందోళనకు దిగారు. వాయిదా తీర్మానాలపై చర్చకు ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టాయి. ముఖ్యంగా బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చించాలని డిమాండ్ చేశాయి. సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. విపక్షాల ఆందోళనతో ప్రారంభమైన నిమిషాల్లో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఎలాంటి చర్చా లేకుండానే మధ్యహ్నాం 2 గంటల వరకూ దిగువ సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఆతర్వాత సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ అదే పరిస్థితి కొనసాగింది. సభ ప్రారంభంకాగానే సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్ హాసన్ ఎంపీగా రాజ్యసభలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత విపక్ష ఎంపీల నిరసనలతో సభ వాయిదా పడింది.



## డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగం విజయవంతం

### ఎక్స్‌లో ఫొటోను పోస్టు చేసిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**రాజంపేట, జూలై 25 ప్రభాతవార్త:** భారత్ సరికొత్త ఆయుధాలతో సత్తా చాటుతోంది. తాజాగా డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగించే పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుజిల్లా ఓర్వకల్లు డిఆర్‌డిఓ కు కేటాయించిన టెస్ట్ సెంటర్‌లో డ్రోన్ నుంచి ప్రిసెషన్ గైడెడ్ క్షిపణిని విజయవంతంగా శుక్రవారం ప్రయోగించారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కర్నూలులో యుఏవి లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి (యు ఎల్ పి జి ఎం) వి3 పరీక్షలను నిర్వహించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్ష భారతదేశ క్షిపణి సామర్థ్యాన్ని మరింత పెంచిందన్నారు. యుఎల్‌పిజిఎంని డిఆర్డిఓ యొక్క టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీఓని అభినందించారు. ఈ మేరకుఎక్స్‌ లో ఫొటోను రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్‌పోస్ట్‌చేశారు. క్షిపణి తయారీలో భాగస్వాములైనసంస్థలను రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు.

## భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండాలి

### సిడిఎస్ అనిల్‌చౌహాన్



**న్యూఢిల్లీ, జూలై 25:** భారత్ 365 రోజులూ, 24 గంటలూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిడిఎస్ అనిల్‌చౌహాన్ హెచ్చరించారు. ఆయుధాలు ఇతర పరిజ్ఞానం గురించి మిలిటరీ పూర్తిగా అప్‌డేట్ అయి ఉండాలని అభిప్రాయపడ్డారు. యుద్ధాల గతి మారిపోతోందని సిడిఎస్ వెల్లడించారు. భవిష్యత్తులో దళాల్లో ఇన్ఫో-టెక్ తోపాటు స్కాలర్ వారియర్స్ కలగలిసి ఉంటాయన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని గుర్తు చేశారు. సుబ్రతోపార్క్‌లో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. యుద్ధాల్లో రన్నరప్‌లు ఉండరని సిడిఎస్ అనిల్‌చౌహాన్ గుర్తు చేశారు. అందుకే సైన్యాలు అప్రమత్తంగా ఉంటూ ఏ క్షణమైనా ఆపరేషన్ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దీనికి ఆపరేషన్ సిందూర్‌నే ఆయన ఉదాహరణగాచూపారు. భారత మిలిటరీకి భవిష్యత్తులో ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ, స్కాలర్ వారియర్స్ అవసరం చాలా ఉందని చెప్పారు. మారుతున్న పరిణామాల ఆధారంగా భవిష్యత్తు సైనికులు ఈ మూడు నైపుణ్యాల కలబోతగా ఉంటారని పేర్కొన్నారు. సైనిక దళాల్లో జరుగుతున్న మార్పుల మూడో విప్లవం కీలక దశలో మనం ఉన్నట్లు వెల్లడించారు. దానిని తాను కన్వర్జెన్సీ యుద్ధంగా అభివర్ణిస్తానన్నారు. ఇది కైనటిక్, నాన్-కైనటిక్ మిశ్రమంగా ఉంటుందన్నారు.




## పాకిస్థాన్‌లో వరదల బీభత్సం 266 మంది మృతి

**ఇస్లామాబాద్, జూలై 25:** పాకిస్థాన్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వర్షాలు, వరదల కారణంగా జూన్ చివరి వారం నుంచి ఇప్పటి వరకు 266 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) శుక్రవారం తెలిపింది. మృతుల్లో 126 మంది చిన్నారులే కావడం గమనార్హం. గత 24 గంటల్లో భీకర వర్షానికి 14 మంది ప్రాణాలు కోల్పోగా 17 మందికి గాయాలయ్యాయని ఎన్‌డిఎంఎ తాజా నివేదికలో పేర్కొంది. భారీ వర్షాలు, వరదల కారణంగా వేల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. వందలకొద్దీ మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పాకిస్థాన్‌లోని పంజాబ్ గవర్నర్ సర్దార్ సలీమ్ హైదర్ పర్యటించి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. కొండచరియలు విరిగిపడటంతో హారిపూర్‌లోని ఖాన్‌పూర్‌లో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. జూన్‌లో రుతుపవనాల తాకిడి మొదలైనప్పటి నుంచే వరదలు తీవ్రమయ్యాయని అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు ఎన్‌డిఎంఎ అధికారులు తెలిపారు.

## సంక్షిప్తంగా..

### వృద్ధ తల్లితండ్రులను చూసుకునేందుకు అదనపు సెలవులు

#### కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై 25:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్కారు శుభవార్త చెప్పింది. సంవత్సరంలో 30రోజులు అదనంగా సెలవులు తీసుకోవచ్చని చెప్పింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ రాజ్యసభలో ప్రకటించారు. ఉద్యోగులు ఆయా సెలవులను తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఇందులో 20రోజుల హాఫ్ పే లీవ్, ఎనిమిది రోజుల క్యాజువల్ లీవ్, 2 రోజుల పరిమిత సెలవులు ఉన్నాయి. రాజ్యసభలో ఎంపీ సుమిత్రా బాల్మిక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర సహాయమంత్రి జితేంద్ర సింగ్ సమాధానం ఇచ్చారు. సర్వీస్ రూల్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 30 రోజులు సెలవు తీసుకు నేందుకు అర్హులని ఈ సెలవులను వృద్ధ తల్లిదండ్రులను చూసుకునేందుకు, ఇతర వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించవచ్చన్నారు.

### విమానం గాల్లో ఉండగానే ప్రయాణికుడి మృతి

#### అత్యవసర లాండింగ్ తర్వాత మృతదేహం అదృశ్యం

**కాలిఫోర్నియా,జూలై 25:** విమానం గాల్లో ఉండగానే ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురై క్షణాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. అయితే పైలెట్లు విమానాన్ని అత్యసవరంగా ల్యాండింగ్ చేయాలనుకున్నా కుదరకపోవడం గమ్యస్థానానికి చేరాకే మృతదేహాన్ని కిందకు దించారు. కానీ ఆ తర్వాత నుంచి మృతదేహం కనిపించకుండా పోయింది. కాలిఫోర్నియాకు వెళ్తున్న టర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో చోటు చేసుకుంది. ముఖ్యంగా ఈనెల 13వ తేదీన టర్కిష్ ఎయిర్ లైన్స్‌కు చెందిన టూకే79 విమానం ఇస్తాంబుల్ నుంచిశాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరింది. అయితే ఈ విమానం గాల్లో ఉండగానే ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అప్రమత్తమైన సిబ్బంది అతడి దగ్గరకు వెళ్లేలోపే అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈక్రమంలోనే విమానాన్ని ఇస్‌లాండ్‌లోని కెఫాలావిక్ విమానాశ్రయానికి మళ్లించేందుకు పైలెట్లు ప్రయత్నంచారు. కానీ అది కుదరకపోవడంతో చికాగో ఎయిర్ పోర్టుకు మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఆపై మృతదేహాన్ని కుక్ కౌంటీ మెడికల్ ఎగ్జామినర్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలుస్తోంది. కానీ ఎగ్జామినర్ కార్యాలయ ప్రతినిధి నటాలియా డెరెవ్యానీ టర్కిష్ ఎయిర్ లైన్స్ నుంచి తమకుఎలాంటి మృతదేహం లభించలేదని చెప్పారు. దీంతో విమానం ల్యాండింగ్ తర్వాత ఏంజరిగింది, అసలా మృతదేహం ఏమైందనే దానిపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### యూట్యూబ్ చూసి బరువుతగ్గే ప్రయత్నంలో విద్యార్థి మృతి

**చెన్నై,జూలై 25:** యూట్యూబ్ చూసి బరువు తగ్గడానికి ప్రయత్నించిన ఒక విద్యార్థి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. గత మూడు నెలలుగా బరువు తగ్గడానికి కేవలం పండ్ల రసం తాగుతూ వ్యాయామం చేస్తున్న ఆ విద్యార్థి ఊపిరాడక కుప్పకూలిపోయి విషాదకరంగా మరణించాడు. కన్యాకుమారిలోని బర్నత్విలైకి చెందిన శక్తీశ్వర్ అనే 17 ఏళ్ల యువకుడు స్థానికంగా ఉన్న ఇంటర్ కాలేజ్‌లో సెకండ్ ఇయర్‌లో ఉత్తీర్ణత సాధించి ఇంజనీరింగ్ కళాశాలలో చేరడానికి సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో శక్తీశ్వర్ ఇంట్లో అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే స్థానికి హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు చనిపోయినట్టు నిర్ధారించారు.

### సరిహద్దు సమస్యలపై సమగ్ర దౌత్య చర్చలు

**న్యూఢిల్లీ,జూలై 25:** భారత్, చైనా మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై నిజాయితీగా దౌత్య చర్చలు జరిగాయని చైనా పేర్కొంది. ఇరుదేశాలు తమ మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై ఢిల్లీలో వర్కింగ్ మెకానిజం ఫర్ కన్సల్టేషన్ అండ్ కోఆర్డినేషన్ చట్రం కింద చర్చలు జరిపాయి. దీని తర్వాత చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అందులో భారత్‌చైనా మధ్య జరిగిన చర్చలు ఎలాంటి కపటం లేకుండా నిజాయితీగా జరిగాయని పేర్కొంది. భారత్‌చైనా సరిహద్దు అంశాలపై ప్రత్యేక ప్రతినిధుల 23వ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు వీటి అమలుపై ఇరుపక్షాలు దృష్టిసారించాయి. అంతేకాదు త్వరలో 24వ ప్రత్యేక ప్రతినిధుల సమావేశానికి సంయుక్తంగా సిద్ధం కావడానికి అంగీకరించాయని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. డబ్ల్యూఎంసీసీ చర్చల తరువాత భారత విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా స్పందించింది. సరిహద్దుప్రాంతాల్లో ప్రశాంతతల వ్యాప్తిపై ఇరుపక్షాలు సంతృప్తి వ్యక్తం చేశాయి. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను క్రమంగా సాధారణీకరించడానికి దారితీస్తుందని తెలిపింది. అంతేకాదు ఈఏడాది చివర్లో భారత్‌లో జరగనున్న తదుపరి ఎడిషన్ ప్రత్యేక ప్రతినిధుల చర్చలకుకూడా రంగంసిద్ధం చేసినట్లు పేర్కొంది.

## ఎంపి మిథున్‌రెడ్డికి సహాయకుడినివ్వలేం

**ఎసిబి కోర్టుకు జైలు సూపరింటెండెంట్**

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సహాయకుడిని ఏర్పాటు చేయాలంటూ ఇటీవల ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఇప్పుడు రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. జైలులో ఖైదీలకు సహాయకుల్ని ఏర్పాటు చేసే నిబంధనలు లేవని, కోర్టు ఆదేశాల్లో ఉన్న మార్గదర్శకాలను పునః పరిశీలించాలని ఆయన కోరారు. జైలు నిబంధనల ప్రకారం ఒక ఖైదీ తన పనులు తాను చేసుకోలేని స్థితిలో ఉన్నా, లేదా తీవ్రమైన అనారోగ్యానికి లోనైతే తప్ప ప్రత్యేక సహాయకుడిని నియమించే అవకాశం లేదని, అటువంటి పరిస్థితుల్లో జైలులో ఉన్న ఎన్ఎస్ఓ, ఎస్ఎస్ఓ సహాయ సిబ్బందిని ఉపయోగించుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరో పక్క ఏపీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ అయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి మరోసారి నిరాశ మిగిలింది. ఈ కేసులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను 29కి కోర్టు వాయిదా వేసింది. దీంతో మిథున్ రెడ్డి మరో నాలుగు రోజులు జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.



## ఎవెన్యూలో ఘనంగా నారా రోహిత్ జన్మదిన వేడుకలు

**గుంటూరు,జులై25,ప్రభాతవార్త ప్రతినిధి :** సినీ హీరో నారా రోహిత్ జన్మదిన వేడుకలను రోహిత్ అభిమాన సంఘం మరియు టిఎన్ఎస్ఎఫ్ టిఎన్టియుసిల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ముందుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటుచేసిన భారీ కేక్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నిర్మాత మరియు ఎన్టీఆర్ శతజయంతి లిటరేచర్ సావునీర్ కమిటీ కన్వీనర్ అట్లూరి నారాయణరావు గారు చేతులమీదుగా కేక్ కట్ చేయడం జరిగింది అలాగే అనంతరం వర్సిటీ ఎదురుగా గల జె.ఎం.జె ఉజ్వల హోమ్స్ లో బాలికలకు ఒకరోజు భోజనం సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే వసతి గృహంలో ఉండే విద్యార్థులకు ఆపిల్ మరియు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది.

## కాన్సర్ విస్తృతి అంచనాకు ఎన్‌సిడి 4.0 సర్వే

**-వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్**

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్‌సీడీ 3.0 సర్వే ఫలితాల ప్రకారం క్యాన్సర్ తీవ్రత తక్కువగా ఉన్నట్లు తేలడంతో...మరింత లోతుగా అధ్యయనానికి సెప్టెంబరు నుంచి ఎన్‌సీడీ 4.0 సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ) సర్వే నిర్వహణపై గుంటూరు జిల్లా చినకాకానిలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి కార్యశాలను మంత్రి గురువారం ప్రారంభించారు. ఎన్‌సీడీ 3.0 సర్వేలో 4.10 కోట్ల మందిని స్క్రీనింగ్ చేయాలని లక్ష్యంగా నిర్ణయిస్తే..ఇప్పటి వరకు 3 కోట్ల మందిని పరీక్షించినట్లు పేర్కొన్నారు. ఈ స్క్రీనింగ్‌లలో దాదాపు 0.35శాతం మేరకే వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. దేశ వ్యాప్త క్యాన్సర్ ఉధృతితో పోలిస్తే ఈ ఫలితాలు తక్కువగా ఉన్నట్లు తేలడంతో మరోసారి సర్వేకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## సోనియాజీ కన్న కలలకు కార్యరూపం

**సామాజిక ఆర్థిక సర్వే భావితరాలకు మార్గదర్శకం**

**సిఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ రాహుల్ ట్వీట్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి** హైదరాబాద్,జూలై 25: తెలగాణలో సామాజిక ఆర్థిక కులసర్వే నిర్వహించడంలోకాంగ్రెస్ ప్రభుత్వంచేసిన అద్భుత కృషి ఎంతో గర్వంగా ఉందని, సోనియాజీ కన్న కలలు సాకారం చేసినట్లయిందని కాంగ్రెస్ అగ్రనేత,లోకసభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ శుక్రవారం ట్వీట్ చేసారు. ఈ సర్వే ఇపుడు దేశవ్యాప్తంగా భవిష్యత్తులో నిర్వహించనున్న జనాభా గణన, కులసర్వే కసరత్తులకు మార్గనిర్దేశం చేస్తునందనే తాను విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వేతోనే తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో 42శాతం ఒబిసి రిజర్వేషన్ల సిఫారసు చేసి చరిత్రాత్మక అడుగు ముందుకు వేసిందన్నారు. ఈ బిల్లు ఇపుడు రాష్ట్రపతి ఆమోదం పొందడం కోసం వేచి ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశవ్యాప్త నమూనాగా నిలిచిందని, 21వ శతాబ్దపు డేటా ఆధారంగా రూపొందించిన ఈ సర్వే సామాజిక న్యాయంలో 2.0 అని భారత్ ఎలా ముందుకు సాగుతున్నదీ నిర్వచించిందని అన్నారు. తెలంగాణ ప్రజలు, భాష, సంస్కృతితో ముడిపడిన మా భావోద్వేగ సంబంధాన్ని ఈ సర్వేతో మరింత సుస్థిరంచేసినట్ల యిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసేందుకు సోనియాజీ నిర్వహించిన పోరాటం.

## కాంగ్రెస్‌తోనే కాపులకు న్యాయం

**- పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల..**

**- పిసిసి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల కు కాపు జెఎసి వినతి పత్రం..**



**విజయవాడ, జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** కాపుల సమస్యలపై ఇటీవల ప్రతిపాదించిన 12 తీర్మానాలను కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చందు జనార్దన్ పిసిసి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు శుక్రవారం నాడు ఉదయం 11 గంటలకు విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ వైయస్ షర్మిల కు కాపుల సమస్యలను వివరించి చెప్పగా వైయస్ షర్మిల సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాపులను హక్కును చేర్చుకున్న చరిత్ర కాంగ్రెస్ దేనని.. కాపులకు పూర్తి న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమని ఆమె అన్నారు. కాపు జేఏసీ బలపరిచిన 12 తీర్మానాలకు వైయస్ షర్మిల సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వినతిపత్రంలో కాపు తెలగ బలిజ ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలని, సమస్యల పరిష్కారంకోసం దశలవారి ఉద్యమం జిల్లా,డివిజన్,మండల స్థాయి సమావేశాలు అనంతరం విజయవాడ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో బహిరంగ సభలు.రాష్ట్రం లో కాపు వర్గాలపై జరిగే దాడులను అరికట్టాలన్నారు.కృష్ణా జిల్లాకు,ఐకాన్ బ్రిడ్జ్ కు స్వర్గీయ వంగవీటి మోహనరంగా గారిపేరు నామకరణం చెయ్యాలి, కృష్ణదేవరాయలు జయంతిని ప్రభుత్వం ఆదికారికంగా నిర్వహించాలన్నారు.కాపు కార్పొరేషన్ కు ప్రతి సంవత్సరం 3000 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలన్నారు.

## నానో ఎరువుల వినియోగం తప్పనిసరి అవసరం : వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు

**విజయవాడ, జూలై 25, ప్రభాతవార్త ప్రతినిధి :** పంటల సాగులో నానో ఎరువులు వాడటం తప్పనిసరి అని ఏపీ వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు స్పష్టం చేశారు. విజయవాడలోలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యములో "వ్యవసాయ వనరుల రంగములో నూతనముగా ఎదుగుతున్న నానో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులకు జరిగిన వర్క్ షాప్ లో ముఖ్య అతిథి గా రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిల్లీ రావు మాట్లాడుతూ దేశ వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువుల తయారీకి అవసరమైన భాస్వరం ,పొటాష్ ,గంధకం తదితర ముడిసరకుల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తున్నదని ,పాశ్చాత్య దేశాల్లో తరచుగా యుద్ధ వాతావరణం ఏర్పడుతుండటం ,తద్వారా డాలర్ విలువ పెరిగి మన దేశానికి విదేశీ మారక ద్రవ్య వ్యయం ఎక్కువగా పెరగటం జరుగుతున్నాయని తెలిపారు .గత నాలుగేళ్లలో కరోనా తర్వాత ఎరువులకు సబ్సిడీ రూపములో 95000/ కోట్ల రూపాయల నుండి ప్రస్తుతం 1,70,000/ కోట్ల రూపాయల వరకు వ్యయం పెరిగిందని చెప్పారు .అంతేకాకుండా మన దేశం ఎరువుల ముడిసరుకు కోసం విదేశాలపై తప్పనిసరిగా ఆధారపడాల్సి వస్తున్నదని తెలిపారు. నేలలను జీవమున్న పదార్థంగా బావించి ,నేలలు బలోపేతం అవ్వటానికి తగినంత సేంద్రీయ పదార్థాలను అందించాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు . నేలలలో తగినంత సేంద్రీయ పదార్థం లేకపోవడం ,పంట దిగుబడుల కోసం రైతులు మితిమీరి రసాయనిక ఎరువులను వాడటం వల్ల నేల భూ భౌతిక పరిస్థితి దెబ్బతింటున్నదని ,కాబట్టి రైతులు ఇప్పటినుండే రసాయనిక ఎరువుల వినియోగం లో కొంతమేర పాక్షికంగా తగ్గించి వాటి స్థానములో నానో ఎరువులను వాడటం వల్ల నేల ఆరోగ్యం బాగా అభివృద్ధి చెంది ముందుతరాలకు సారవంతమైన భూముల అందించిన వారం అవు తామని తెలిపారు .

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబిసి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి: ఇబిసి జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

**హైదరాబాద్,జులై 25,ప్రభాతవార్త :**ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని,ఈబీసీ కార్పొరేషన్,ఈబీసీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని ఈబిసి జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఈబీసీ కార్యాలయంలో జరిగిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రవర్ణాల నిరుపేదలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయకుండా అగ్రవర్ణాల వారంతా సంపన్నులనే భావనతో విద్య,ఉద్యోగ రంగాలు, అభివృద్ధి,సంక్షేమ పథకాలను వర్తింప చేయకుండా వివక్ష చూపిస్తున్నారని, వేళ్లపై లెక్కించకలిగిన కొంతమంది అగ్రవర్ణాలలోని సంపన్నులను చూపించి అగ్రవర్ణాలలోని మెజారిటీ నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు.ఇటువంటి పరిస్థితుల నుండి అగ్రవర్ణాలకు న్యాయం జరిగేందుకు పోరాటం చేయాలని అందుకు అందరూ ఏకం కావాలని రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. అగ్రవర్ణాల నిరుపేదల హక్కుల సాధనకోసం ఇటు తెలుగు రాష్ట్రాల్లో అటు దేశవ్యాప్తంగా అగ్రవర్ణాల నిరుపేదలను ఏకంచేసి ఉద్యమిద్దామని రవీందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రవిశంకర్, ఉపాధ్యక్షులుగా ఉన్నం సుబ్బారావు, నీలగిరి దయాకర్ రావు, గట్టు శ్రీనివాసా చార్యులు, నూకల పద్మారెడ్డి, ప్రచార కార్యదర్శిగా యూసుఫ్ బాబు, జాయింట్ సెక్రటరీ పోచంపల్లి రమణారావు, కోశాధి కారి ఒలం యాదగిరి గుప్త. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆరుగురు, కార్యవర్గ సభ్యులుగా 18మంది.



మీడియా సమావేశంలో మంత్రి నారాయణ, అధికారులు

## విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తాం

**- విజయవాడ మెట్రోరైల్‌కు టెండర్లు పిలుస్తాం: మంత్రి నారాయణ**

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** మెట్రో రైల్ ప్రాజెక్ట్ ను రానున్న మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. శుక్రవారం లెనిన్ సెంటర్ లోని సీఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ 2014 ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం విశాఖపట్నం, విజయవాడలలో మెట్రో రైల్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉండన్నారు. ఫీజుబులిటీ రిపోర్టు స్టడీ చేయడానికి ఆరు నెలలు సమయం పట్టిందన్నారు. కేంద్రం అనుమతించిన మేరకు మెట్రో రైల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ముందుగా విశాఖపట్టణంలో మెట్రో రైల్ కు టెండర్లు ఇవ్వడం జరిగిందని, నేడో, రేపో విజయవాడ మెట్రోకు టెండర్లు పిలవటం జరుగుతుందన్నారు. కేంద్రం మెట్రో రైల్ నిర్మాణానికి పాలసీ మార్చిందని మారిన పాలసీ ప్రకారం మెట్రో నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. అందుకనుగుణంగా నిన్న జరిగిన కేబినెట్ భేటీలో మెట్రో రైల్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా 20 శాతం, కేంద్రం వాటాగా 20, మిగిలినవి కేంద్రం అనుమతితో సాఫ్ట్ లోన్ ను 30 సంవత్సరాల కాలపరిమితితో తక్కువ వడ్డీ రేటుకు అంతర్జాతీయ సంస్థల నుంచి కేంద్రం అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం ఫీజుబులిటీ చేపట్టి మెట్రో రైల్ నిర్మాణాన్ని చేపట్టకుండా పక్కన పడేసిందన్నారు. మా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతుందన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ట్రాఫిక్ సమస్య ఉందని దానికి పరిష్కారంగా మెట్రో రైల్ నిర్మాణాలను బెంగళూరు, హైదరాబాద్, నాగపూర్ తదితర ప్రాంతాల్లో చేపట్టడం జరిగిందన్నారు. మిక్స్ డ్ డబుల్ వర్షన్స్ ను ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని క్రింది అంతస్థులో పార్కింగ్, మొదటి అంతస్తులో కమర్షియల్ నిర్మాణాలు, రెండో అంతస్తులో రెసిడెన్షియల్ గా ఉండేలా వర్షన్స్ ఇవ్వడంతో వాక్ టూ వర్క్ లా పరిస్థితులు మారిపోతున్నాయన్నారు. జంక్షన్స్ వద్ద ట్రాఫిక్ కు ఏవిధమైన అంతరాయాలు ఏర్పడకుండా మొదటి ఫ్లైఓవర్ పై ట్రాఫిక్ వాహనాలు, రెండో ఫ్లైఓవర్ పై మెట్రో ట్రైన్ వెళ్లేలా నిర్మాణాలు ఉంటాయని దీనివల్ల వాహనాదారులకు ఏ విదమైన ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ప్రయాణించవచ్చున్నారు.

## కనకదుర్గమ్మకు శ్రావణమాసం పూజలు



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక నందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూలై 25, ప్రభాతవార్త** దుర్గమ్మవారికి శ్రావణమాసం ప్రారంభమైన తరుణంలో భక్తులు ప్రత్యేక కుంకుమార్చనల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర ్భంగా శుక్రవారం ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ వికె శీనా నాయక్ భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా దుర్గమ్మవారికి రు.1000 రుసుముతో ప్రత్యేక కుంకుమార్చనను ఆర్జిత సేవగా జరుపుతామని ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు భక్తులు పాల్గొనాలన్నారు. - నిత్యాన్నదానానికి విరాళం: దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116 ల విరాళాని ్న విజయవాడకు చెందిన యలమంచిలి నాగశ్రీను శుక్రవారం అందించారు. అలాగే వీరులపాడుకు చెందిన జొన్నలగడ్డ కృష్ణవేణి తమ కుటుంబసభ్యులతో కలిసి రు.1,01,116ల విరాళాన్ని నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. - అలరించిన నృత్యార్చన: దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం అమలాపురంకు చెందిన శ్రీ రామాంజనేయ డాన్స్ అకాడమి నాట్యాచార్యులు ఎన్ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఆయన శిష్యబృందం 20 మంది నృత్యనీరాజనార్పించి భక్తులను అలరించారు.

## రాష్ట్రంలో ఆగస్టు29న ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తాం :శాప్ ఛైర్మన్ రవినాయుడు



సమీక్షలో శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ అజయ్ జైన్, శాప్ ఉన్నతాధికారులు

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఆగస్టు29వ తేదిన క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు.నేషనల్ స్పోర్ట్స్ డే నిర్వహణపై శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ అజయ్ జైన్, శాప్ ఉన్నతాధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా సమన్వయంతో సమర్థ వంతంగా స్పోర్ట్స్ డేను నిర్వహించాలి శాప్ ఎండీ అజయ్ జైన్ కోరారు... క్రీడాసదుపాయాల కల్పన, ఏర్పాట్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు... స్పోర్ట్స్ డే విజయవంతానికి ముందస్తు సమాచారంతోపాటు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.ఈ సమావేశం అనంతరం శాప్ ఛైర్మన్ రవినాయుడు మీడియాతో మాట్లాడుతూ క్రీడాశాఖామంత్రి రాంప్రసాద్ రెడ్డి సూచనల మేరకు ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్స్ డేను నిర్వహించనున్నాం ప్రత్యేక ఆకర్షణగా ఏడాది పాలనలో సాధించిన క్రీడా విజయాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రీడాప్రోత్సాహకాల పంపిణీతోపాటు ఏపీలోని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.డిస్ట్రిక్ట్, జోనల్, రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీల నిర్వహణకు కసరత్తు చేస్తున్నాని శాప్ ఛైర్మన్ తెలిపారు.

## జెసి ప్రభాకర్‌రెడ్డిపై ఉన్న కేసులపై చంద్రబాబు, లోకేష్‌లు ఆలోచనలు చేయాలి

**- తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి**

**అనంతపురం, జులై 25 ప్రభాతవార్త బ్యూరో** తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తరచూ నాకు అన్యాయం జరిగిందని, నాపై అక్రమ కేసులు పెట్టారని, నాకు న్యాయం చేయానలి తరచూ చెబుతుంటారు. జెసి ప్రభాకర్‌రెడ్డిపై ఉన్న కేసులు గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఆలోచన చేయాలని ఆయనపై ఉన్న కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు తెప్పించుకుని తగిన చర్యలు తీసుకోవాలని వైసిపి నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అనంతపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో పెద్దారెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చేసిన వన్నీ అక్రమాలని బిఎస్-3, బిఎస్-4 వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేశాడని, అందుకు సంబంధించే కేసులు నమోదు అయ్యాయని, తప్పుడు సర్టిఫికెట్లతో వాహనాలు కొనుగోలు చేసినట్లు అధికారులు నివేదికలు ఉండటంతో కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ విధంగా చేసిన తప్పుడు పనులపై కేసులు ఉంటే నాకు చంద్రబాబు, లోకేష్ న్యాయం చేయాలని జెసి ప్రభాకర్‌రెడ్డి అడగడంలో అర్థం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు ఒక వేల నేనే తప్పు చేశానని భావిస్తే మీ వద్ద ఆధారాలు ఉంటే తగిన చర్యలు తీసుకోవచ్చని సంబంధిత ఆధారాలను పోలీసు అధికారులకు ఇచ్చి కేసులు పెట్టుకోవచ్చని కేతిరెడ్డి పెద్దారెడ్డి వెల్లడించారు. జెసి ప్రభాకర్‌రెడ్డి, చేసేదంతా నేరాలేనని, తాను తప్పులు చేస్తూ ఇతరులపై నింధలు వేస్తుంటారని ఆయన ఆరోపించారు.

## ఇచ్ఛాపురం సబ్ పోస్టాఫీస్‌లో రూ2.86 కోట్ల స్కాం

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జూలై 25, ప్రభాతవార్త** శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆన్లైన్ ద్వారా 2.86 కోట్ల రూపాయల మేర మోసం జరిగినట్లు సోంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ శుక్రవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. 33 మంది ఖాతాదారుల డిపాజిట్లు నుండి 2.86 కోట్ల రూపాయలు నిధులు ఆన్‌లైన్ ద్వారా గల్లంతయినట్లు వివరించారు. ఈ మేరకు ఖాతాదారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. ఈ నెల 6న పోస్టల్ వెబ్సైట్లో పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు అందిందని సంబంధించిన వ్యక్తితో ఫోన్ చేసిన తర్వాత పూర్తి ఆధారాలతో సమాచారం రావడంతో రంగంలోకి దిగిపోస్టుల ఉన్నత అధికారులు దర్యాప్తు చేపట్టారని చెప్పారు. గత పది రోజులుగా చేస్తున్న విచారణలో 33 మంది ఖాతాదారుల కెవిపి బాండ్‌ల నుండి ఆన్లైన్ ద్వారా మోసం జరిగినట్లు గుర్తించామని, సిబిఐ ఈడీలకు కేసును అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 14 మందిని అనుమానితులుగా గుర్తించినట్లు చెప్పారు. వీరిలో 5 గురు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

## సింహాద్రినాధుని క్షేత్రంలో 500 కోట్లతో దేవాలయల పునర్నిర్మాణం

**:దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**సింహాచలంప్రభాత వార్త జూలై 25...**శ్రీ వరాహ లక్ష్మీ ్మ నరసింహ స్వామి వారిని దేవస్థానం శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. మంత్రి కి దేవస్థాన కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, ఆలయ అధికారులు మరియు దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.మంత్రి ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసి, అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితుల వేద ఆశీర్వచనము పొందారు.ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర సమాచారం కోరారు, ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని హామీ ఇచ్చారు. భక్తుల భద్రత, ఆలయ పరిసరాలలో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలను సమీక్షి ంచారు. అన్నదాన పథక నాణ్యత, క్యూలైన్ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలంటూ అధికారులకు సూచనలు చేశారు. ప్రత్యేక పూజల సమయంలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, దర్శనంలో సౌలభ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. భక్తుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు.ఆలయ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి ఖచ్చితమైన నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానంతో ఆలయ అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ఆలయ సేవలో ఉన్న సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, దేవాలయాల భద్రత కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఉత్సవాల సమయంలో భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.!! ఐ వి ఆర్ ఎస్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత దేవాలయాల్లో పరిస్థితులు మెరుగుపడుతున్నాయ అని, గిరి ప్రదక్షి ణ ఘనంగా జరిగింది అన్నారు. దేవాలయాల్లో ఉన్నత ప్రమాణాలు నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దేవాదాయ శాఖ కమిషనర్ పరిధిలోని ఆలయ పాలకవర్గాల నియామక ప్రక్రియ ప్రారంభమైంది" అని మంత్రి స్పష్టంచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని దేవాలయాల్లో 500 కోట్ల రూపాయల వ్యయంతో పునర్నిర్మాణ పనులు చేపట్టామని, ఆలయ పరిమాణం బట్టి కాలాన్ని నిర్ణయించి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. దేవాలయాలకు పాలక మండల నియామకం ప్రారంభించమన్నారు. కొన్ని దేవాలయాల్లో ఇంకా పాత మండల కొనసాగుతున్నాయి. వాటిని తొలగించి కొత్త పాలకవర్గాలను నియమిస్తామని స్పష్టం చేశారు. ధూప, దీప నైవేద్యాలు కింద 10 వేల రూపాయలు చొప్పున ఇప్పటికే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉత్సవాలు జరిగే ఆలయాలకు ముందుగానే ప్రత్యేకమైన టీం పంపించి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సింహగిరి ప్రదక్షణ చాలా బాగా జరిగిందని భవిష్యత్తులోగిరి ప్రదక్షణకు ప్రత్యేకమైన స్థానం కల్పించేలా చర్యలు తీసుకుంటామని, దేవాలయాల్లో జరిగే ప్రధాన ఉత్సవాలన్నీ రాష్ట్ర పండగలేనని అన్నారు. క్యాడర్ స్ట్రాంగ్ సర్వీస్ రూల్స్ ని పరిగణలోకి ఖాళీలను భర్తీ చేస్తూ దేవాలయాలకు స్వాసత ఈఓ లను నియామకం చేయడం జరుగుతుంది అని అన్నారు. ఇప్పటికే కమిషనర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు ధార్మిక పరిషత్ ద్వారా ఈవోల నియామకం ప్రక్రియ జరిపించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖలో ఎన్ ఎమ్ ఆర్ ఉద్యోగలు ఉన్నారని వారిని క్రమబద్ధీకరించాలంటే ప్రభుత్వంలో కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయ అని దాటవేశారు. పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం అవుతుందని 12149 నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందని మంత్రి వెల్లడించారు.మంత్రికి అర్చక పెద్దల విజ్ఞాపప్రధాన ఉత్సవాల కోసం సింహాద్రి నాథుడు కొండ దిగివకు వెళ్లే మార్గాన్ని సుగమం చేయాలని సింహాచలం దేవాలయ వైదిక పెద్దలు దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డికి విజ్ఞాపన చేశారు. రానున్న విజయదశమి సందర్భంగా కొండ దిగువ ప్రత్యేక ఉత్సవం నిర్వహించవలసి ఉందని ఈ మేరకు అధికారులు మూసివేసిన మార్గం లో మెట్ల నిర్మాణం చేయవలసి ఉందని ఆర్చక పెద్దలు మంత్రి దృష్టికి తీసికొని వెళ్లారు. సాంకేతకమైన పరమైన అడ్డంకులను వీలైనంత త్వరగా తొలగించి స్వామివారి ఉత్సవానికి తీసుకొని వెళ్లలా చొరవ తీసుకోవాలని అర్చక పెద్దలు మంత్రి ని కోరారు. ఆర్చక పెద్దల వినతి పై స్పందించన మంత్రి అధికారులు

## ఒబిసి హక్కుల పరిరక్షణకే దేశవ్యాప్త కులగణన: రాహుల్ గాంధీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై25:**కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేకపోయామని, అది ముమ్మాటికీ తన తప్పదమేనని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన భాగిదారి న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ఒకసారి వెనక్కి తిరిగి చూసినప్పుడు తాను ఓ తప్పు చేశానని అర్థమవుతోందని అన్నారు.ఓబీసీల హక్కులను రక్షించాల్సిన విధంగా రక్షించలేదని, అప్పట్లో ఓబీసీల సమస్యలను లోతుగా అర్థం చేసుకోలేకపోయానని పేర్కన్నారు. ఓబీసీ చరిత్ర, సమస్యలను కొంచెం ముందుగానే తెలుసుకుని ఉన్నట్లయితే అప్పట్లోనే కులగణన చేపట్టి ఉండేవాడిని. అది కాంగ్రెస్ పార్టీ తప్పుకాదు, ముమ్మాటికీ నా తప్పే. ఇప్పుడు ఆ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాంఖి అని రాహుల్ అన్నారు. తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్ అని రాహుల్ గాంధీ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసే వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఇది తన శపథమని అన్నారు. అవకాశాలు అందిపుచ్చుకునే సామర్థం అందరికీ రావాలని,తమ శక్తిని తాము తెలుసుకోకపోవడమే కొందరి సమస్యని చెప్పుకొచ్చారు.దేశంలో దళితుల చరిత్రను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అర్థం చేసుకున్నారని చెప్పారు. చరిత్రలో ఓబీసీలు ఉన్నా,వారి గురించి ఎవరూ పట్టించుకోలేదని, ఓబీసీల చరిత్ర ఎక్కడుంది? ఎవరు రాశారు? అని రాహుల్ ప్రశ్నించారు. ఓబీసీల చరిత్ర రాయకపోవడం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర ఉందని ఆరోపించారు. బిజెపి,ఆర్ఎస్ఎస్ కలిసి ఉద్దేశపూర్వకంగా ఓబీసీల చరిత్రను తుడిచిపెట్టేశాయని ఆరోపించారు. ఓబీసీలు అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారని రాహుల్ ప్రశ్నించారు. అదానీ ఓబీసీనా, మీడియా రంగంలో ఓబీసీలకు స్థానం ఎక్కడుంది? అని ప్రశ్నించారు. అభివృద్ధిలో విద్యదే కీలకపాత్ర అని,ఇంగ్లీషు నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయని అన్నారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్న వారు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని బిజెపి నేతలను ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాలని రాహుల్ డిమాండ్ చేశారు. దేశంలో ప్రతి ఒక్కరికీ కలలు సాకారం చేసుకొనే హక్కు ఉందని, రైతు కుమారుడు వ్యాపారవేత్త కావొచ్చని పేర్కొన్నారు. అవకాశాలు అందిపుచ్చుకొనే సామర్థం అందరికీ రావాలన్నారు. తమ శక్తిని తెలుసుకోలేకపోవడమే కొందరి సమస్యగా చెప్పుకొచ్చారు. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తెలంగాణలో పకడ్బందీగా కులగణన చేపట్టారని పేర్కొన్నారు.ప్రాంతీయ భాషలు ముఖ్యమే, అలాగే ఇంగ్లీషు కూడా కీలకమైన అని రాహుల్ అన్నారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రధాని మోదీని కొన్ని సార్లు కలిశానని, ఆయనలో అంతగా విషయం లేదని అంతా షోనేనని వ్యాఖ్యానించారు. ప్రధానిపై భారీగా హైప్ పెంచింది మీడియానేనని, ఆయనలో పెద్దగా విషయం లేదనే విషయం తనకు అప్పుడే అర్థమైందన్నారు. "ఇంతకుముందు ఎప్పుడు నేను ఆయనను కలవలేదు, కానీ ఈ మధ్యలో ఆయనను 23 సార్లు కలిశాను. అప్పుడే నాకు అర్థమైంది.

## డెలివరీబాయ్స్ దుస్తుల్లో వచ్చి నగల షాపులో చోరీ

**ఘజియాబాద్,జూలై 25:** ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఫుడ్ డెలివరీ బాయ్స్ దుస్తుల్లో ఇద్దరు దొంగతనం చేశారు. సిటీలో ఉన్న జ్యువెలరీ షాపులోకి చొరబడ్డారు. గురువారం సాయంత్రం 3.30 నిమిషాలకు ఈ చోరీ జరిగింది. ఫుడ్ డెలివరీ ఏజెంట్ల తరహాలో ఎంట్రీ ఇచ్చిన ఇద్దరు ఆ తర్వాత చోరీకి పాల్పడ్డారు. నిందితులు ఇద్దరు హెల్మెట్లు ధరించారు. బ్లింకిట్, స్విగ్గీ దుస్తులు వేసుకుని వచ్చారు. మన్ని జ్యువెలరీ షాపులోకి చొరబడ్డ ఆ ఇద్దరు అక్కడ ఉన్న ఉద్యోగిని నెట్టివేసి సిల్వర్ ఐటమ్స్ ఎత్తుకెళ్లారు. డిస్‌ప్లే కేసుల్లో ఉన్న ఆభరణాలను తీసి తమ బ్యాగుల్లో కుక్కేశారు. షాపులో ఉన్న కుర్చీ తీసి అద్దాల కేజ్‌లను పగులగొట్టి వాటిల్లో ఉన్న ఐటమ్స్ దోచేశారు. టూ వీలర్ బైక్‌పై ఆ ఇద్దరూ పరారీ అయ్యారు. దొంగలు 20కిలోల సిల్వర్, 125 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. కేవలం అయిదారు నిమిషాల్లోనే ఈ తతంగం పూర్తి చేశారు. చోరీ మొత్తం సీసీటీవీ కెమెరాలకు చిక్కింది. నేను వాష్‌రూమ్‌లో ఉన్నానని, దొంగ దొంగ అని మా ఉద్యోగి అరిచాడని, పోలీసులకు ఫోన్ చేసినట్లు ఆ షాపు ఓనర్ తెలిపాడు. పోలీసులు 15 నిమిషాల్లో అక్కడకు చేరుకున్నారన్నారు.

# మామునూర్ బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల

## ఎకరాకు రూ. కోటి 20 లక్షలు చెల్లించనున్న సర్కారు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూసేకరణ చేయడానికి రాష్ట్రప్రభుత్వం రూ.205కోట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్నాయుడు మార్చి నెలలో వరంగల్ నగరం శివారులోని మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు సమ్మతి తెలిపారు. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్పోర్ట్స్ అథారిటీ నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత ఫైల్ సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలు పెడతామని కేంద్ర మంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యం లోనే భూ సేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది. ఇదిలా ఉంటే ఇటీవలే మామునూరు విమా నాశ్రయం నిర్మాణానికి భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.కోటి 20లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించింది. అలాగే ప్లాట్లకు, ఇళ్లకు సైతం న్యాయమైన పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదించడంతో భూ బాధితుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. గత నెల రోజులుగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహ సీల్దార్ బండి నాగేశ్వర్‌రావు సఫలీకృతులయ్యారు.

**నిధుల విడుదలపై మంత్రి సీతక్క ధన్యవాదాలు**

మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకి అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా...అందుకు కృషి చేసిన సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. మామునూరు విమా నాశ్రయం నిర్మాణానికి భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.కోటి 20 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించినట్టు వివరించారు.అలాగే ప్లాట్లకు, ఇళ్లకు సైతం న్యాయమైన పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదిం చారు. గత నెల రోజులుగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో తాము జిల్లా ఇంఛార్జీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులు కృషి చేస్తున్నట్టు వివరించారు. కేరళలోని కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం మాదిరిగా మామునూరు ఉండాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు వివరించారు. సుమారు 1,000 ఎకరాల్లో నిర్మించనున్నట్టు చెప్పారు. ఎయిర్ పోర్టు పూర్తయితే, మామునూరు విమానాశ్రయం ప్రారంభమైతే చుట్టుపక్కల ప్రాంతాలే కాకుండా సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి అక్కడికి వెళ్లే రహదారుల వెంట అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పంటల వివరాల నమోదులో డేటా వినియోగం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగవుతున్న పంటల వివరాలు అంచనా వేయడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. దీనికి సంబంధించి తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన ప్రాజెక్టుపై హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగవుతున్న పంటల విస్తీర్ణం అంచనా వేయటం ద్వారా రానున్న కాలంలో ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడానికి వీలుంటుందన్నారు. కావున వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు బృందం ముందస్తు అంచనా వేయటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఇతర వసతులను ఉపయోగించనున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా రెండు మాసాల వరకు రాష్ట్రంలో పంటల వారిగా సాగవుతున్న విస్తీర్ణాన్ని అంచనా వేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాటి అమలుకు అవసరమైన నిధులు ప్రభుత్వం అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అదేవిధంగా రానున్న కాలంలో ప్రభుత్వం అమలు చేయనున్న పంటల భీమా పథకానికి సమగ్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించాలని సూచించారు. వివిధ పంటలను ఆశించు చీడపీడల వివరాలను కూడా సెన్సార్ అమర్చడం ద్వారా ముందుగానే తెలుసుకునే వీలుందని, ఈ దిశగా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వివిధ పంటలలో ఈ పంటకాలం నుంచే ప్రయోగాలు చేపట్టాలన్నారు.

## వర్షాలతో సింగరేణికి రూ.35 కోట్ల నష్టం

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు వెలికితీతకు అంతరాయం ఏర్పడింది. మూడు రోజుల్లో లక్ష టన్నులకుపైగా ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. దీంతో సింగరేణికి సుమారు 35 కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని అంచనా.

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిలో ఓపెన్‌కాస్ట్ గనులు కీలకంగా ఉన్నాయి. రాత్రి షిఫ్ట్‌ల్లో వర్షం ఎక్కువగా కురుస్తుండడంతో ఎక్కడికక్కడే డంపర్లు నిలిచిపోతున్నాయి. వర్షం కారణంగా ఒక్క రోజు శ్రీరాంపూర్‌ఏరియా ఓసీల్లో 43 శాతం, మణుగూరులో 36, మందమర్రిలో 39, ఇల్లెందులో 65, ఆర్జీ-3లో 50, భూపాలపల్లిలో 43 శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగింది.

## హెచ్‌ఎండిఏ ముందస్తు ప్రణాళిక చర్యలు భేష్

### హెచ్‌ఎండిఏ ప్రణాళికలపై జెడిఏ ప్రతినిధులు బృందం అధ్యయనం

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) ప్రణాళికా చర్యలు బాగున్నాయని జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (జెడిఏ) ప్రతినిధి బృందం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ ఆనంది నేతృత్వంలో ప్రతినిధి బృందం హెచ్‌ఎండిఏ కార్యాలయాన్ని సందర్శించించారు. ఈ బృందంలో ప్లానింగ్ డైరెక్టర్ ప్రీతి గుప్తా, అదనపు చీఫ్ టౌన్ ప్లానర్ అంకుర్ దధీచ్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రుషికేష్ కొల్టే పాల్గొన్నారు. హెచ్‌ఎండిఏ ప్రణాళికా కార్యక్రమాలు, మెట్రోపాలిటన్ అభివృద్ధిలో అనుసరిస్తున్న వాటిని అధ్యయనం చేయడానికి ఈ ప్రతినిధి హైదరాబాద్ నగరానికి వచ్చారు. ఇక్కడ అమలు అవుతున్న వాటి స్థితిగతులను పరిశీలించాలన్నదే జెడిఏ ప్రతినిధులు బృందం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సంస్థ అభివృద్ధిపై సమగ్ర సమీక్షా ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్లు, రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్లు, ల్యాండ్ పూలింగ్ పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం - 2050 కోసం రూపొందించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. ఇందులో ..కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్, ఆర్థికాభివృద్ధి ప్రణాళిక, బ్లూగ్రీన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్‌లను ఏకీకృతంగా కలిపింది, జిఐఎస్ ఆధారిత బేస్ మ్యాప్ ద్వారా మొత్తం మెట్రోపాలిటన్ ప్రాంతానికి ఆధారభూతంగా పని చేస్తున్నదని తెలిపారు. అదనంగా, తెలంగాణ యొక్క ముఖ్యమైన పట్టణ ప్రాంతం కోసం 3డి డిజిటల్ ట్విన్.. అభివృద్ధి చేస్తుండటం, అలాగే కొత్త ..కాంప్రెహెన్సివ్ బిల్డింగ్ రెగ్యులేషన్స్.. రూపకల్పనలో ఉన్నట్లు తెలియజేశారు. సమావేంలో ఉన్నతాధికారులు ఎస్. దేవేందర్ రెడ్డి, ప్లానింగ్ డైరెక్టర్లు కె. విద్యాధర్, ఎం. రాజేంద్ర ప్రసాదనాయక్‌తో పాటు పలువురు టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

### హెల్త్ వర్సిటీలో ఎంబిబిఎస్, బిడిఎస్ కన్వీనర్ కోటా

## రిజిస్ట్రేషన్ల గడువు 30వ తేదీకి పెంపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూలై 25:** రాష్ట్రంలో కొనసాగుతున్న కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీలో ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల రిజిస్ట్రేషన్ కోసం నిర్దేశించిన గడువును పొడిగించారు. రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 30 వరకూ పొడిగిస్తున్నట్టు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ప్రకటించింది. గతంలో రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 25 వరకు ఉన్న సంగతి తెలిసిందే. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు గడువును పొడిగించినట్టు యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. 2025-26 విద్యా సంవత్సరానికి కాంపిటెంట్ అథారిటీ కోటా కింద ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం నోటిఫికేషన్‌ఈ నెల 15న జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ ఎలిజిబిలిటీకమ్‌ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యుజి-2025లో కటాఫ్ స్కోర్‌లు, అంతకంటే ఎక్కువ సాధించడం ద్వారా అర్హత సాధించిన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీని పొడిగించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి వచ్చిన అనేక అభ్యర్థనలతోపాటు స్థానిక, స్థానికేతర సమస్యలకు సంబంధించి కోర్టు కేసు కారణంగా ఈ నెల 30 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్టు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కేబినెట్ సమావేశం 28వ తేదీకి వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 25:** తెలంగాణ కేబినెట్ సమావేశం ఈనెల 28కి వాయిదా పడింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం వాయిదా పడింది. ఏఐసిసి కార్యాలయంలో బీసీ రిజర్వేషన్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఐదుగురు మంత్రులు ఢిల్లీలోనే ఉన్న కారణంగా కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ భేటీని ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రానికి ఢిల్లీ నుంచి తిరిగి హైదరాబాద్ వచ్చేశారు.

# నర్సులే సమాజానికి ప్రాణదాతలు

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### ఘనంగా 4వ బ్యాచ్ బిఎస్సీ నర్సింగ్ విద్యార్థుల స్నాతకోత్సవ సభ



స్నాతకోత్సవ సభకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూలై 25, ప్రభాతవార్త:** నర్సింగ్ వృత్తి కీలకమైనదని, నర్సులే సమాజానికి ప్రాణ ప్రధాతలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహిళా దక్షత సమితి విద్యాసంస్థలు, బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నుంచి బీఎస్సీ నర్సింగ్‌లో పట్టభద్రుల 4వ బ్యాచ్ స్నాతకోత్సవ కార్యక్రమం చందానగర్ గంగారంలోని మహిళ దక్షతసమితి ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.నర్సులు సమాజానికి అదృశ్యశక్తులన్నారు. నర్సులు కేవలం డిగ్రీలు తీసుకోవడమే కాకుండా సరికొత్త బాధ్యతలు, హామీలు, మానవజాతికి సేవ చేయలన్న లక్ష్యాన్ని స్వీకరించారని గుర్తుచేసుకోవాల న్నారు. డాక్టర్ సరోజ్ బజాజ్‌లాంటి నాయకత్వపు మార్గనిర్దేకత్వంలో విద్యార్థులు నూతన ప్రపంచంలోనికి ఎంతో ఉత్సాహంతో డిగ్రీ సాధించారని, సాధికారతతో కూడిన మహిళలుగా సమాజానికి చికిత్స చేయటానికి బయట అడుగుపెట్టాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్, ఐపీఎస్ అధికారిణి అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. నర్సింగ్ అనేది కేవలం ఒక ఉద్యోగం కాదని, అదొక దైవకార్యం లాంటిదన్నారు. వృత్తిపరమైన జీవితాల్లోనికి పవిత్రభావనతో అడుగుపెట్టాలన్నారు. వసుద ఫార్మా కెమ్ లిమిటెడ్ సీఎండీ మంతెన వెంకట రామరాజు మాట్లాడుతూ.. వైద్యవ్యవస్థకు ఎంతగానో అవసరమైన నర్సింగ్ వృత్తి కీలకమైనదన్నారు. తపాడియా డయాగ్నస్టిక్స్ ఎండి డాక్టర్ మహేశ్ తపాడియా మాట్లాడుతూ.. కోవిడ్ వంటి మహమ్మారుల సమయంలో కూడా ఎంతో ధైర్యంగా సేవలందించిన మహిళా దక్షత సమితికి తమ వంతు సహకారం అందిస్తామని,ఉచితంగా నర్సింగ్ విద్యార్థులందరికి తలసీమియా పరీక్షలు చేయిస్తామన్నారు.

మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ.. 1991లో స్థాపించిన తమ సంస్థలో ఇప్పటి వరకు 10వేల మందికి పైగా యువతులు నిరుపేదలుగా తమ వద్దకు వచ్చినవారేనని, వారికి వైద్యం, ఆర్థిక టెక్నాలజీ రంగాల్లో శిక్షణనిచ్చి జీవితంలో స్థిరపడే విధంగా తమవంతు సహకారం అందిస్తున్నా మన్నారు. విద్యార్థుల అవసరాలకు, ఆడిటోరియం నిర్మాణానికి దాదాపు 1.15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బాలికల హాస్టల్, ఆడిటోరియంలకు తమ దాతృత్వం చాటుకుంటున్న దాతలు సజ్జన్ కుమార్ గోయెంకా,అరుణా మాలిని, నిర్మలా గోయెంకా,దివంగత రాంగోపాల్ గోయెంకాలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళ దక్షత సమితి సంస్థల ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్స్ పూర్తిచేసిన 50 మంది విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పట్టాలను అందించారు.

ఈ కార్యక్రమానికి వెయ్యిమందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎండిఎస్ ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మీ,విమలా భద్రుకా,మున్నా జెగెతియ,శారధా గుప్త, జయా బహితి, షీలా సొంతా లియా, అనిత్ అగర్వాల్, లక్ష్మీకుమార, రాజశ్రీజైన్, జ్ఞానపతి పరాష్,డాక్టర్ ఆకాశ్ అగర్వాల్, లలిత కుమార్ అగర్వాల్, శ్యాంసుందర్ ముందాడ,శకుంతల తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నేతలు బిసిలకు వ్యతిరేకులు

### రఘునందర్‌రావు బిసి రిజర్వేషన్ అమలు కోరుకోవడం లేదు: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** బిసి బిల్లును వ్యతిరేకిస్తూ బిజెపి నాయకులు మాట్లాడుతున్న తీరు దారుణం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పిలో శుక్రవారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి అగ్రవర్ణ కులాల్లో పుట్టినా రిజర్వేషన్‌తెచ్చారని సామాజిక న్యాయం పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం అన్నారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్కసారైనా బిసిలను ప్రధాని చేశారా అని ఇవాళ కాంగ్రెస్ ను ప్రశ్నించిన రఘునందన్ రావుకు

తాజాగా ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. బిసి బిల్లు అమలు కాకూడదని రఘునందన్ రావు కోరుకుంటున్నారని ఆరోపించారు. బిసిలకు న్యాయం చేసే విషయంలో బిజెపికి క్లారిటీ లేదని దుయ్యబట్టారు. రాష్ట్రం పంపిన బిల్లును ఆమోదించకుండా ఉంగ్రెస్ పై విమర్శలు చేయడం ఏంటని మండిపడ్డారు.

బిజెపి అగ్రకుల పార్టీ అని బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తోందని ధ్వజమెత్తారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, మా పార్టీని ప్రశ్నించే బదులు రఘునందన్ రావు మీ బిజెపి అధ్యక్షుడు ఎవరు? బిసిలకు అధ్యక్ష పదవి ఇవ్వమని అధిష్టానాన్ని మీరెందుక అడగరు అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. కాంగ్రెస్ చెప్పే సామాజిక న్యాయం మాటలకే పరిమితం కాదని మన్మోహన్ సింగ్ లాంటి నేతను రెండు సార్లు ప్రధానిగా చేసిన ఘనత మాదేనన్నారు.

# పంటలకు ప్రాణం.. వర్షాలతో అన్నదాతల హర్షం

### ఉమ్మడి జిల్లాలో వేధిస్తున్న ఎరువుల కొరత

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల పంటలకు ఊపిరి పోసినట్లయింది ఈ ఏడాది ప్రారంభంలో నైరుతి రుతుపవనాలు ముందుగా ప్రవేశించిన ఎప్పటికీ సరైన వర్షాలు కురవలేదు దీంతో మొదట్లో పంటలు సాగు చేసే రైతులు వర్షాలు లేక రెండు మూడు దఫాలుగా దుక్కిలో విత్తనాలను నాటవలసి వచ్చింది. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నారు ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది వానల కోసం రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు జూన్ నెల లొ వర్షాలకు వేసిన విత్తనాలు మొలవక పోవటం అన్నదాతలను ఆందోళన కలిగించింది. కాలం వచ్చాక పెరిగిన ఎండ వడగాల్పుల వల్ల వేసిన విత్తనాల మొలకలు కూడా ఎండి పోయాయి ఖమ్మం జిల్లాలో వానాకాలంలో 5.80 లక్షల ఎకరాల్లో ఎకరాల్లోనూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6.30 లక్ష ఎకరాల్లో పంటలు పండించాలని వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు కుంటలు బావులలో బోర్లలో నీరు చేరటంతో వరి నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు వీటితోపాటు వర్షాభా పరిస్థితి వల్ల ఇంకా సాగు చేయాల్సిన మొక్కజొన్న జొన్న కంది మిరప తోటలను పూర్తిస్థాయిలో వేయలేకపోయారు. ఈ వర్షాల వల్ల ఆ పంటలను కూడా ఇప్పుడు వేసే అవకాశం ఉంది ఈ దశలో రైతులకు అవసరమైన యూరియా కాంప్లెక్స్ డిఏపి లాంటి ఎరువులు మార్కెట్లో దొరకటం లేదు ఎరుల కోసం రైతులు దుకాణాల చుట్టూ పడిగాపులు కాస్తున్నారు ప్రధానంగా ఖమ్మం కొత్తగూడెం భద్రాచలం పాల్వంచ మధిర సత్తుపల్లి ఇల్లందు తదితర ప్రాంతాల్లో రైతులు ఎరువుల దుకాణాల ముందు ముందు క్యూలు కట్టి నిల్చుంటున్నారు ఒకవైపున ప్రభుత్వం ఎరువులకు ఎలాంటి కొరతలేదని ఎరువులు బ్లాక్ మార్కెట్లో తరలించిన గాని అధిక రేట్లకు వికరించిన గాని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నప్పటికీ వ్యాపారుల్లో మార్పు రావటం లేదు.

ఫలితంగా ఒకవైపు ఎరువుల సరఫరా తక్కువగా ఉంటే మరోవైపు మార్కెట్లో ఉన్న ఎరువులు కూడా వ్యాపారులు రైతులకు అందించడం లేదు దీంతో ఉమ్మడి జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఏర్పడింది.

# అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్-2025లో నారాయణ విద్యార్థులకు స్వర్ణ, రజత పతకాలు



**హైదరాబాద్, ప్రభాతవార్త, జూలై 25:** అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపిహెచ్‌వో) 2025లో నారాయణ విద్యార్థులు స్నేహిల్ ఝా, ఆగం షాలు స్వర్ణ, రజత పతకాలు గెలుచుకున్నారు. 2025 జూలై 18 నుండి 24 వరకు ఫ్రాన్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో ఆకట్టుకు న్నారు. భారత్ తరపున పాల్గొన్ని విజయకేతనం ఎగురవేశారు. అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపిహెచ్‌వో) అనేది జూనియర్ కాలేజీ విద్యార్థుల కోసం ప్రపంచవ్యాప్తంగా జరిగే అత్యంత ప్రతిష్టాత్మక పోటీ పరీక్ష. ఈ పరీక్షలో విద్యార్థులు సిద్ధాంతాలు, ప్రయోగాత్మక భౌతిక శాస్త్రాల్లోని జ్ఞానం, తర్కం, విశ్లేషణ సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం, వివిధ నైపుణ్యాలను సమగ్రంగా పరిశీలిస్తుంది. ఈ పోటీ ప్రతి సంవత్సరం వివిధ దేశాల్లో నిర్వహించబడుతుంది. 87 దేశాల నుండి పాల్గొన్న వందలాది విద్యార్థుల మధ్య పోటీని తట్టుకుని వివిధ దశలను దాటుకుంటూ చివరిదైన 5 దశను విజయ వంతంగా దాటి ఫైనల్లో విజేతలుగా నిలిచారు. ప్రపపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. అంతర్జాతీయ వేదికపై స్నేహిల్ ఝా, ఆగం షా చూపిన అసాధారణ ప్రతిభాపాటవాలు, అత్యుత్తమ ప్రదర్శన వారి మేధస్సుకు, నిరంతర కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. నారాయణ విద్యాసంస్థల్లో అందించే అత్యుత్తము శిక్షణ ఫిజిక్స్ ఒలింపియాడ్ మరోసారి తార్కాణంగా నిలుస్తోంది.

చిన్న వయస్సు నుండే శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంపొందించడంలో నారా యణ విజయవంతం అవుతోంది అనడానికి వీరి విజయాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ నారాయణ విద్యార్థులు అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ 2025లో సాధించిన విజయం పట్ల ఎంతో గర్విస్తున్నామన్నారు. ఇది వ్యక్తిగతంగా వారి జీవితంలో ఒక గొప్ప మైలురాయి మాత్రమే కాదని.. నారాయణ కుటుంబం మొత్తానికి, అలాగే యావత్ భారతావనికే గర్వకారణమన్నారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి శరణి నారాయణ మాట్లాడుతూ ఒలింపియాడ్ శిక్షణ విధానానికి వచ్చే సరికి స్పష్టమైన కాన్సెప్టు, లక్ష్యబద్ధమైన శిక్షణ, వ్యక్తిగత మార్గదర్శకతను కలిపి



సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు ఇస్తున్న నేరగాళ్ల నుంచి జప్తు చేసిన సెల్‌ఫోన్లు, లాప్‌టాప్

## సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలిస్తున్న 9 మంది నేరగాళ్ల అరెస్టు

### సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు జప్తు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** విదేశాల్లో వుండే బడా సైబర్ నేరగాళ్లకు భారత్‌లో నేర కలాపాలు సాగించేందుకు ఏజెంట్లుగా వుంటూ వారి కి మ్యూల్ బ్యాంకు ఖాతాలు సమకూరుస్తున్న తొమ్మిది మంది నేరగాళ్లను సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ నేరగాళ్లలో ఇద్దరు రాజస్తాన్‌కు చెందిన వారు కాగా మిగతా ఏడుగురు తెలంగాణకు చెందిన వారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 16 సెల్ ఫోన్లు, ఒక లాప్‌టాప్, రెండు కార్లతో పాటు 82,500 రూపాయల నగదును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబరాబాద్ కొత్వాల్ అవినాష్ మొ హంతి శుక్రవారం నాడు మీడియాకు వెల్లడించారు. సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ క్రమంలో రా ష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాలకు సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు సమాచారం ఇస్తుండడం తెలిసిందే. ఇలా అందిన సమాచారం మేరకు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు అందిస్తున్న ఓ ముఠాను పట్టుకున్నారు. ఈ ముఠాలో రాజస్తాన్‌కు చెందిన సుమిత్ రాథోడ్, మన్‌వేంద్ర సింగ్ రాథోడ్, తెలంగాణకు చెందిన మహమ్మద్ నదీం ఉర్ రెహమాన్, మహమ్మద్ నయీం ఉర్ రెహమాన్, మహమ్మద్ షఫీ, ఎస్.భరత్, తెలుగు మహేష్, అబ్దులన ఖలీద్, జెల్‌పిటి మహేష్ వున్నారు. వీకంతా ఒక ముఠాగా ఏర్పడి విదేశాల్లో వుంటూ సైబర్ నేరాలకు పాల్పడే బడా కేడీల కు భారత్‌లో తమ పేరిట వున్న కరెంటు బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం ఇస్తున్నారు. ఇదే సమయంలో సై బర్ నేరాల వల్ల తమ ఖాతాలకు వస్తున్న నగదును సిం కార్డులు, మొబైల్ అప్లికేషన్ ద్వారా విత్ డ్రా చేసుకుంటున్నారు. ఈ ముఠా టెలిగ్రాం అలియాస్ జాక్ అనే సైబర్ ముఠాలో కీలకంగా వుందని తేలింది. గచ్చిబౌలిలోని డిఎల్‌ఎఫ్ హోటల్‌తో పాటు నగరంలోని పలుచోట్ల త్రీ స్టార్ హోటల్ లో వారం పది రోజుల పాటు వుంటూ ఎవరికి అనుమానం రాకుండా గోల్‌మాల్ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇందుకోసం ఎపికె ఫైల్ అప్లికేషన్ ను వాడుతున్నారు. ఇది కేవలం శాంసంగ్ మొబైల్ ఫోన్‌లోనే పనిచేస్తుందని తేలింది. పట్టుబడ్డ నిందితులను జైలుకు తరలిం చారు. నిందితులపై బిఎన్‌ఎస్‌లోని సమాచార చట్టం 2008 కింద కేసు నమోదు చేశా రు. కాగా ఈ తరహా కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని కొత్వాల్ అవినాష్ మొహంతి కోరారు. సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు అందించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## మహిళా వర్సిటీకి త్వరలో పూర్తిస్థాయి సిబ్బంది

### సమావేశమైన ఉన్నతస్థాయి కమిటీ

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బంది నియమితులు కానున్నారు. ఇప్పటి వరకు ఉస్మానియా యూనివర్సిటీలో భాగంగా ఉన్న కోఠి మహిళా కళాశాలను విశ్వవిద్యాలయంగా ప్రభుత్వం ఉన్నతీకరించిన సంగతి తెలిసిందే. ఉస్మానియా విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం మధ్య బోధన, బోధనేతర సిబ్బంది.. ఇతర ఆస్తులను విభజించేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించిన సంగతి తెలిసిందే.

అందులో భాగంగా శుక్రవారం ఉన్నతస్థాయి కమిటీ మొదటి సమావేశం జరిగినట్టు తెలిసింది. అయితే వివిధ కారణాల రీత్యా కమిటీ సభ్యులైన ఓయూ విసి, మహిళా వర్సిటీ విసి సమావేశానికి హాజరు కానున్నట్టు తెలిసింది. మొదటి సమావేశంలో బోధన, బోధనేతర సిబ్బంది విభజనకు సంబంధించి చర్చించినట్టు తెలిసింది. ఓయూలో పనిచేస్తున్న వారికి, ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కాలేజీగా కొనసాగుతున్న కాలేజీలో బోధన చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఆప్షన్లను ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే బోధనా సిబ్బందిలో మహిళా యూనివర్సిటీకి సబ్జెక్టుల్లో ఇతర ఆప్షన్లు లేకుంటే.. కొత్తగా రిక్రూట్ చేసుకునే వరకు వారిని మహిళా వర్సిటీలోనే కొనసాగాలని సూచించనున్నారు.

కమిటీ మెంబర్ సెక్రటరీగా రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, సభ్యులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, ఓయూ విసి ప్రొఫెసర్ ఎం కుమార్, మహిళా వర్సిటీ విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఓయూ మాజీ విసి ఆచార్య తిరుపతిరావును నియమించారు. విభజన అనంతరం పూర్తిస్థాయి యూనివర్సిటీగా ఏర్పడనుంది.



ప్రహ్లాద్‌జోషికి వినతిపత్రం ఇస్తున్న ఎంపిలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, బిసి నేతలు గుజ్జ కృష్ణ, నందగోపాల్ తదితరులు

## పార్టీలకతీతంగా బిసి బిల్లుకు మద్దతు ఇవ్వాలి

### బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలి

### కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, జూలై 25,ప్రభాతవార్త:** పార్టీలకతీతంగా బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మరో ఎంపి బీదమస్తాన్‌రావు, బిసి సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ దుర్గా నరేష్, ఢిల్లీ ఇన్‌చార్జ్ కర్రీ వేణు మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి నంద గోపాల్, మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ శారద లతో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ..బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగాపరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవన్నారు. గతంలో పాలించిన కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం, బి సీ వ్యతిరేక వైకరి అవలంబించడం మూలంగానే ప్రమోషన్లలో రిజర్వేషను పెట్టలేదు. రాజ్యాంగ బద్ధమైన మండల్ కమీషన్ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందన్నారు. ఈవిషయాలపైన అన్ని పార్టీలతో చర్చిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల క్రితం పార్లమెంట్ లో బీసీ బిల్లు పెడితే 14 పార్టీలు బిఆర్ఎస్, టి.డి.పి. డి.ఎం.కె. అన్నా డి.ఎం.డి. పి.ఎం.క, సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తీళీశి, జనతాదళ్ (యునైటెడ్), జనతా దళ్ (దీ), కాంగ్రెస్ పార్టీ, నేషన్ లిష్టు కాంగ్రెస్ పార్టీ, ఆప్నా దళ్, లోక్ దళ్ పార్టీలు మద్దతు ఇచ్చాయని కానీ బిజెపి పార్టీ మద్దతు ఇవ్వకపోవడంతో బిల్లు పాస్ కాలేదని కావున బిజెపి బీసీ బిల్లుకు తమ విధాన ప్రకటన చేయాలని కోరారు.

# తెర

## కూలీ చాలా స్పెషల్




సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న కూలీ చిత్రంపై అంచనాలు పెరిగిపోయాయి. ఈ సినిమాలో నాగార్జున మెయిన్ విలన్‌గా నటిస్తున్నారు. ఆయన పాత్ర చాలా అద్భుతంగా ఉంటుందని శ్రుతి హాసన్ తెలిపారు. నాగార్జున నెగెటివ్ రోల్‌లో ఫెంటాస్టిక్‌గా నటించారని, ఆయనకు అందరూ సూపర్ ఫ్యాన్స్ అయిపోతారని ఆమె అన్నారు. ఈ మూవీలో నాగ్ చాలా కూల్‌గా కనిపిస్తారని శ్రుతి పేర్కొన్నారు.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, షౌబిన్ సాహిర్, సత్యరాజ్, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ క్యామియో చేయగా.. పూజా హెగ్డే స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారు. తాజాగా శ్రుతి హాసన్ ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. నాగ్ పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. కూలీ సినిమాలో నాగార్జున మెయిన్ విలన్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని లోకేష్ కనగరాజ్ ఇదివరకే కన్ఫార్మ్ చేశారు. ఇప్పుడు శ్రుతి హాసన్ దీనిపై మాట్లాడుతూ.. ఆ పాత్రలో నాగ్ అద్భుతంగా నటించారని తెలిపారు. ఈ సినిమాతో ఆయనకు అందరూ సూపర్ ఫ్యాన్స్‌గా మారిపోయామని చెప్పారు. ‘‘నాగార్జున గారితో నాకు ఈ సినిమా కంటే ముందు నుంచే పరిచయముంది. ఆయన ఎల్లప్పుడూ ఛార్మింగ్ గా, వండర్ ఫుల్ గా ఉంటారు. ఈ మూవీలో ఆయనతో వర్క్ చేయడం ఎక్స్ట్రా స్పెషల్. ఎందుకంటే నాగ్ సార్ కి ఇది ఫస్ట్ నెగెటివ్ క్యారక్టర్. ఆయన ఆ పాత్రలో ఫెంటాస్టిక్‌గా నటించారు. నేను ఎప్పుడూ ఆయనకి అభిమానినే. కానీ ఇప్పుడు మేము సూపర్ ఫ్యాన్స్ అయిపోయాం. మీరు కనీసం ఊహించను కూడా ఊహించలేరు. అది మాత్రం చెప్పగలను. సినిమాలో ఆయన చాలా కూల్ గా కనిపిస్తారు అని శ్రుతి అన్నారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## బాలీవుడ్ బ్యూటీతో బాస్ డ్యాన్స్

మెగా కంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ విశ్వంభరఅప్డేట్స్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మేకర్స్ మూవీ నుంచి ఇంట్రెస్టింగ్ అప్డేట్ పంచుకున్నారు. షూటింగ్ చివరి షెడ్యూల్ ప్రారంభమైనట్లు తెలిపారు. అంతేకాదు ఈ షెడ్యూల్‌లో బాస్ ఫ్యాన్స్‌కి కిక్కెకించే ఒక స్పెషల్ సాంగ్ షూట్ చేస్తున్నట్లు తెలియజేస్తూ ఫొటోను షేర్ చేశారు. ఈ ఫొటోలో లేడీ డాన్సర్స్ అంతా కలర్ ఫుల్ కాస్ట్యూమ్స్‌లో కనిపిస్తుండగా.. కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్, డైరెక్టర్ వశిష్ఠ మానిటర్‌లో చూస్తూ ఉన్నారు. మెగాస్టార్ బ్యాక్ సైడ్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపించారు. అయితే విశ్వంభరలో ఒక స్పెషల్ నెంబర్ ఉండబోతుందని ఇప్పటికే వార్తలు వినిపించారు. ఇప్పుడు ఈ ఫొటోలతో అది నిజమేనని అర్థమవుతోంది. ఈ సాంగ్‌లో బాలీవుడ్ బ్యూటీ మోనీ రాయ్ మెగాస్టార్ జోడీగా స్టెప్పులేయనున్నట్లు తెలుస్తోంది. మోని రాయ్ స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, ఆమెకున్న క్రేజ్ సినిమాకు ప్లస్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు.

సోషియో ఫాంటసీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో వీఎఫెక్స్ ప్రధాన ఆకర్షణగా నిల్వనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే విడుదలైన టీజర్‌లో గ్రాఫిక్స్ నాసిరకంగా ఉన్నాయని విమర్శలు రావడంతో.. నిర్మాతలు వీఎఫెక్స్ విషయంలో మరింత శ్రద్ధ వహిస్తున్నారు. ప్రేక్షకులకు మంచి అనుభవాన్ని అందించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో కలిసి పనిచేస్తున్నారు. దీని కారణంగానే విడుదల కూడా ఆలస్యమవుతూ వస్తుందని టాక్. ఈ సినిమాలో మెగాస్టార్ సరసన



త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తోంది. దాదాపు 18 ఏళ్ల గ్యాప్ తర్వాత మళ్ళీ చిరంజీవి, త్రిష కలిసి స్క్రీన్ పై కనిపించబోతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విశ్వంభరను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఒకేరోజు 15 సినిమాలు



మూవీ మొఘల్ డాక్టర్ డి.రామానాయుడు తర్వాత అత్యధిక చిత్రాలు నిర్మించిన వ్యక్తిగా, శతాధిక చిత్ర నిర్మాతల్లో రెండవ వాడిగా ఘనతకెక్కిన భీమవరం టాకీస్ అధినేత తుమ్మలపల్లి రామసత్యనారాయణ... ప్రపంచ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 15 చిత్రాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రపంచ రికార్డుగా నమోదు కానున్న ఈ చారిత్రక ఘట్టానికి హైద్రాబాద్ లోని సారధి స్టూడియో వేదిక కానుంది. సినిమా రంగంతోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ ప్రపంచ రికార్డుకు ప్రత్యక్ష సాక్షులు కానున్నారు. మన భారత స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఈ అరుదైన ఘట్టం శ్రీకారం చుట్టుకోనుంది.

## ఆయన వల్లే నేను ఈ స్థానంలో ఉన్నా




యంగ్ హీరో నరేష్ అగస్త్య, దర్శకుడు విపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఉమా దేవి కోట నిర్మించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా ‘మేఘాలు చెప్పిన ప్రేమ కథ’లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. చిత్రంలో రబియా ఖతూన్ కథానాయిక. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రం ఆగస్ట్ 22న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నరేష్ అగస్త్య మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చిడం ఆనందంగా వుంది. ఆగస్టు 22న సినిమా రిలీజ్ అవుతుంది. హీరో కంటే అందంగా ఉండే కామియో కావాలి. అందుకే వెతికి వెతికి రాజాని పట్టుకున్నారు(నవ్వుతూ). తను నాకు మంచి స్నేహితుడు. రబియా చాలా అద్భుతంగా నటించింది. వెరీ బ్యూటీఫుల్ క్లీన్ ఫిలిం ఇది. ప్రొడ్యూసర్ ఉమాదేవి కోట మాట్లాడుతూ.. మీరందరూ ఆదరిస్తే మరిన్ని సినిమాలు చేయాలని ఉంది అన్నారు. హీరోయిన్ రబియా మాట్లాడుతూ.. నా ఫస్ట్ డైరెక్టర్ ధనుష్. ఆయన వల్లే నేను ఇప్పుడు ఈ స్థానంలో నిలుచున్నాను అన్నారు. డైరెక్టర్ విపిన్ మాట్లాడుతూ సినామా కోసం చాలా ఎఫర్ట్ పెట్టామన్నారు. యాక్టర్ రాజా మాట్లాడుతూ చాలా క్లియర్ విజన్‌తో డైరెక్టర్ మోహన్ కృష్ణ మా అందరిని చాలా డిఫరెంట్‌గా చూపించారు అన్నారు.


## అభినయ కృష్ణ దర్శకత్వంలో కామాఖ్య



సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో ఓ థ్రిల్లింగ్ మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి కామాఖ్య అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. డివైన్ వైబ్‌తో వున్న టైటిల్ పోస్టర్ అదిరిపోయింది.

డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్. ఈచిత్రానికి సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

## కంటెంట్‌పై ఫోకస్



వరసగా సినిమాలైతే చేస్తున్నారు కానీ ఎందుకు చేస్తున్నారో కూడా శ్రీలీలకు కూడా అర్థం కావట్లేదు. అసలెప్పుడు వస్తున్నాయో.. ఎప్పుడెళ్తున్నాయో కూడా తెలియట్లేదు ఆమె సినిమాలు. ఈ ఏడాది రాబిన్ హుడ్, జూనియర్ సినిమాలతో వచ్చినా ఫలితం లేదు. కంటెంట్‌పై ఫోకస్ పెట్టమ్మా.. గ్యాప్ తీసుకున్నా పర్లేదంటున్నారు ఫ్యాన్స్. స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ కోసం చూస్తున్నారు శ్రీలీల. రవితేజ మాస్ జాతర, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలతో పాటు తమిళంలో శివకార్తికేయన్ పరాశక్తి.. హిందీలో కార్తిక్ ఆర్యన్ సినిమాల్లో నటిస్తున్నారు ఈ బ్యూటీ. వీటిలో శ్రీలీలకు కమ్ బ్యాక్ ఇచ్చే సినిమా ఏదవుతుందనేది ఆసక్తికరంగా మారింది. మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్య శ్రీ బోర్సే సైతం మాంచి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. విజయ్ దేవరకొండ కింగ్డమ్ జూలై




31న రానుంది.. అలాగే దుల్కర్ సల్మాన్ కాంతా, రామ్ ఆంధ్రాకింగ్ తాలూక సినిమాలు 2025లోనే రానున్నాయి. వీటితో కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు ఈ బ్యూటీ. ఇక రష్మిక మందన్నకు హిట్స్ ఉన్నాయి కానీ గ్యాప్ ఎక్కువగా ఇస్తున్నారు. పుష్ప 2 తర్వాత మొన్న



కుబేరాతో వచ్చారు. త్వరలోనే రెయిన్ బో, గాళ్ ఫ్రెండ్ అంటూ గ్యాప్ లేకుండా వస్తున్నారు. హిట్ 3 బానే ఆడినా శ్రీనిధి శెట్టి పేరు పెద్దగా వినిపించట్లేదు. అక్టోబర్ 17న తెలుసు కదా అంటూ మరోసారి పలకరించబోతున్నారు ఈ బ్యూటీ. అలాగే మంచి కథ దొరికితే తెలుగులో నటిస్తానంటున్నారు సమంత. ఖుషీ తర్వాత ఈమె కనబడలేదు. త్రిష సినిమాలు చేస్తున్నా.. విజయాల్లేవు. ఈమె ఆశలన్నీ విశ్వంభరపైనే ఉన్నాయి. మరి వీళ్లలో ఎంతమందికి కోరుకున్న కమ్ బ్యాక్ వస్తుందో చూడాలిక.



## షారుక్‌కు గాయాలు



ఇండియన్ సినిమాలో మోస్ట్ హార్డ్ వర్కింగ్ యాక్టర్స్‌లో షారుక్ ఖాన్ ఒకరు. ఎలాంటి సినీ బ్యాగ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన కింగ్ ఖాన్.. తన సినిమాలతో గత మూడు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. 60 ఏళ్ల వయసులోనూ రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారు. సినీ ప్రియులను ఆకట్టుకోడానికి యంగ్ హీరోలకు పోటీగా రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు బాలీవుడ్ బాద్ షా తన అప్ కమింగ్ సినిమా కోసం ఓ ఇంటెన్స్ యాక్షన్ సీన్ షూటింగ్ చేస్తుండగా, ప్రమాదం జరిగి గాయాలపాలైనట్లుగా వార్తలు వస్తున్నాయి. షారుక్ ఖాన్ ప్రస్తుతం ‘కింగ్’ అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఈ యాక్షన్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమా సెట్స్ లోనే షారుక్ గాయపడినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ముంబైలోని గోల్డెన్ టొబాకో స్టూడియోలో ఓ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేయగా.. షారుక్ డూప్ లేకుండా ఆ స్టంట్ చేశారట. ఈ సందర్భంగా ఆయనకు గాయాలైనట్లు కథనాలు పేర్కొన్నాయి. కింగ్ షూటింగ్‌లో ప్రమాదం జరగడంతో, అత్యవసర చికిత్స కోసం షారుక్ తన టీంతో కలిసి అమెరికా వెళ్లినట్లు ఆంగ్ల మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే అది తీవ్రమైన గాయం కాదని, కండరాల గాయం అని చిత్ర వర్గాలు తెలిపాయి. వైద్యులు ఒక నెల రోజుల పాటు రెస్ట్ తీసుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. దీంతో కింగ్ షూటింగ్‌ను సెప్టెంబర్‌కు వాయిదా వేసినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

## నన్ను సూపర్ స్టార్‌గా చూశారు

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ కింగ్డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. మరో ఆరు రోజుల్లో ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. మూవీ ప్రమోషన్స్‌లో సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కూడా భాగమయ్యారు. కింగ్డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్ పేరుతో సందీప్‌రెడ్డి వంగాతో కలిసి విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి స్పెషల్ చిట్ చాట్ నిర్వహించారు. సినిమాకి సంబంధించిన సంగతులతో పాటుగా పలు ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకున్నారు. శ్రీలంకలోని 200 ఏళ్ల క్రితం నాటి జైల్లో కింగ్డమ్ సినిమా షూటింగ్ జరిగిందని, పూర్తిగా వర్షంలో తీసిన 13 నిమిషాల కీలకమైన సీక్వెన్స్ ఉంటుందని డైరెక్టర్ గౌతమ్ చెప్పారు. సెకండాఫ్‌లో వైలెన్స్ చాలా ఎక్కువగా ఉంటుందని చెప్పిన విజయ్.. ఇటీవలే కింగ్డమ్ గంట సినిమా చూశానని, ఆర్ఆర్ లేకుండా చూసినా అద్భుతంగా అనిపించిందని సందీప్ రెడ్డి చెప్పారు. ప్రమోషనల్ కంటెంట్ చాలా బాగుందని, తప్పకుండా సక్సెస్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెళ్లి చూపులు రిలీజైన రోజే విజయ్ దేవరకొండకి ఓ కథ చెప్పానని, రెండు సమోసాలు తిని స్టోరీ తనకు ఎక్కలేదని చెప్పి వెళ్లిపోయాడని గౌతమ్ చెప్పారు. కింగ్డమ్ అనేది గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ మూవీ అని, అన్నదమ్ముల సెంటిమెంట్ ప్రధానంగా ఉంటుందని దేవరకొండ విజయ్ వెల్లడించారు. తానే స్వయంగా గౌతమ్‌కి ఫోన్ చేసి సినిమా చేద్దామని



అడిగినట్లుగా చెప్పారు.

అర్జున్ రెడ్డి మూవీ టైంలోనే సందీప్ రెడ్డి వంగా తనలో సూపర్ స్టార్‌ని చూశాడని విజయ్ దేవరకొండ చెప్పారు. అప్పట్లోనే తనని యాక్టర్‌గా కాకుండా, సూపర్ స్టార్‌లా ట్రీట్ చేసేవాడని తెలిపారు. యానిమల సినిమా ఫైనల్ కట్ 3 గంటల 30 నిమిషాలు వచ్చిందని, చివరకు మరో 7 నిమిషాలు ట్రిమ్ చేసానని సందీప్ వెల్లడించారు. అయితే చాలా మంచి సీన్స్ లేపేసానని, ఆ విషయంలో చాలా రిగ్రెట్ అవుతున్నానని పేర్కొన్నారు. విజయ్, సందీప్, గౌతమ్‌లు కింగ్డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## మహారాజుల విడిదిలో నిద్రలేని రాత్రులు



హారర్ సినిమాలు ఆద్యంతం ఎంతో ఎంగేజింగ్‌గా సాగుతాయి.. భయపెట్టే స్టోరీలు, సస్పెన్స్‌కు గురిచేసే సీన్స్ ఆడియెన్స్‌కు మంచి థ్రిల్‌ను అందిస్తాయి. ఇప్పుడు మనం చర్చించుకోబోయే సినిమా ఇదే జానర్ లో నెక్స్ట్ లెవెల్ అని చెప్పుకోవచ్చు. ఈ మూవీ హారర్ జానర్‌లో ఒక సరికొత్త ట్రెండ్ ను క్రియేట్ చేసింది. ఈ సినిమా కేవలం ఆడియెన్స్‌ను మాత్రమే కాదు.. ఇందులో నటించిన యాక్టర్స్‌ను కూడా భయ పెట్టింది. వారు చాలా రోజులు నిద్రలేని రాత్రులు గడిపారు. ఈ సినిమా షూటింగ్ ఊటీలోని ఫెర్న్‌హిల్ హోటల్, పైన్ ఫారెస్ట్, లారెన్స్ స్కూల్‌లో జరిగింది. ఈ ప్రాంతాల్లో నిజంగానే దెయ్యాలు ఉన్నాయనే ప్రచారం ఉంది. ఇందులో ఫేర్న్ హిల్ హోటల్ ఒకప్పుడు మైసూర్ మహారాజుల విడిది. ఈ హోటల్‌లో దెయ్యాలు, ఆత్మలు సంచరిస్తున్నాయని ప్రచారంలో ఉంది. అందుకే షూటింగ్ టైమ్ లో సెట్‌లో జరిగిన కొన్ని సంఘటనలు నటీనటులను చాలా భయపెట్టాయట. ఒకసారి హోటల్‌లో పైఅంతస్తు లేనప్పటికీ ఫర్నీచర్ జరుపుతున్న సౌండ్స్ వినిపించాయని ఇందులో నటించిన హీరోయిన్ ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది. రాత్రి పూట డ్యాన్సర్లకు కూడా అలాంటి వింతైన, భయానక శబ్దాలు వినిపించాయట. అలాగే డాక్టర్ అంబేద్కర్ ఫొటో జారిపడిందని.. అది కెమెరాలో రికార్డ్ అయ్యిందని కూడా సదరు హీరోయిన్ చెప్పింది. ఒక రాత్రి షూటింగ్ జరుగుతుండగా.. ఒక అమ్మాయి పాట పాడుతున్న గొంతు తనతో పాటు అందరికీ వినిపించిందని హీరోయిన్ చెప్పుకొచ్చింది.

ఇలా షూటింగ్ జరుగుతుండగానే యాక్టర్లను భయ పెట్టిన ఆ హారర్ సినిమాపేరు రాజ్. 2002లో రిలీజైన ఈ సినిమాలో బిపాషా బసు, డీనో మోరియా, మాలిని శర్మ, అశుతోష్ రాణా, విశ్వజీత్ ప్రధాన్ లీడ్ రోల్స్ చేశారు. విక్రమ్ భట్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సంజన (బిపాషా బసు), ఆదిత్య (డీనో మోరియా) దంపతులు ఊటీలోని ఒక బంగ్లాకు వెళతారు. అక్కడ వారికి కొన్ని భయంకరమైన అనుభవాలు ఎదురవుతాయి. ఒక శక్తి వారిని వెంటాడటం మొదలుపెడుతుంది? మరి అది వారి జీవితాలను ఎలా ప్రభావితం చేసింది. సంజన, ఆదిత్యలు బయటపడ్డారా? అన్నదే రాజ్ సినిమా కథ. ప్రస్తుతం ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది.

## వార్ వన్ సైడ్ ఎవరికి ?

ఆర్ఆర్ఆర్ తరువాత అంతే హైప్‌తో వస్తున్న మరో మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ గ్రీకు వీరుడు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మల్టీస్టారర్‌గా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న వార్ 2 పైనే ప్రస్తుతం ఇండస్ట్రీ కళ్లన్నీ ఉన్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు సినిమాపై అంచనాలను పెంచేసాయి. ఇక ఇప్పుడు ట్రైలర్ చూశాకా.. అందరికీ ఒక క్లారిటీ వచ్చింది. జక్కన్న చేసిన తప్పు అయాన్ చేయలేదనిపిస్తుంది. ఇద్దరు హీరోలు ఉంటే.. వారిద్దరికీ సరిసమానమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాటు డైలాగ్స్‌ను కూడా పెట్టి కట్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది.



ఇక వార్ 2 ను అనౌన్స్ చేసిన దగ్గరనుంచి హృతిక్ వర్సెస్ ఎన్టీఆర్ ట్రోల్స్ నడుస్తూనే ఉన్నాయి. ట్రైలర్ రిలీజ్ తరువాత లెక్కలు తారుమారు అయ్యాయి అని చెప్పొచ్చు. మొదట హృతిక్.. ఎన్టీఆర్ ను డామినేట్ చేస్తాడు అని ట్రోల్ చేసినవారే ట్రైలర్ చూసాక ఎన్టీఆరే హృతిక్ ను డామినేట్ చేసేలా కనిపిస్తున్నాడే అని చెప్పుకొస్తున్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ యాక్టింగ్.. హృతిక్‌తో కనిపించిన ప్రతి సన్నివేశంలో ఎన్టీఆర్ తానేంటో నిరూపించుకోవడానికే ఎంతో కసితో చేసినట్లు కనిపించాడు. కొన్ని సీన్స్‌లో ఫ్యాన్స్ చెప్పినట్లే హృతిక్‌ను డామినేట్ చేసినట్లే కనిపించాడు. మొత్తానికి వార్ 2.. ఇద్దరు సైనికుల మధ్య యుద్ధం అని అనడం కన్నా ఇద్దరు స్టార్ హీరోల మధ్య యుద్ధం అని చెప్పొచ్చు. లుక్ పరంగా హృతిక్‌ను కొట్టేవారు లేరు. వార్ 2లో కూడా అలాగే కనిపించాడు. ఎన్టీఆర్ లుక్‌లో కొన్ని లోపాలున్నా.. నటనలో అతడిని కొట్టేవారు లేరు. ఇక ఇద్దరికీ సమ ప్రాధాన్యత ఇచ్చి.. అయాన్ తెలుగు అభిమానుల ఆగ్రహం నుంచి తప్పించుకున్నాడు. ట్రైలర్ వరకు ఇది ఓకే.. సినిమాలో ఏ చిన్న తేడా వచ్చినా.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఉగ్రరూపం దాలుస్తారు అని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. మరి వార్ 2.. ఎవరికి వార్ వన్ సైడ్ అయ్యేలా చేస్తుంది.

## వినాయక చవితి కానుకగా సుందరకాండ

ప్రముఖ నటుడు నారా రోహిత్ బర్త్ డే జూలై 25. ఈ సందర్భంగా అతని తాజా చిత్రం సుందరకాండ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఆగస్ట్ 27న ఈ సినిమా వినాయక చవితి కానుకగా విడుదల కాబోతోంది. ఈ విషయాన్ని ఓ స్పెషల్ వీడియో ద్వారా తెలియచేశారు. ఆగస్ట్ 27 అంటే బుధవారం. లాంగ్ వీకెండ్ ఈ మూవీకి కలిసివస్తుందని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు.



ఇప్పటికే వెంకటేశ్ హీరోగా కె. రాఘవేంద్రరావు సుందర కాండ మూవీని తెరకెక్కించారు. అలానే అల్లరి నరేశ్ హీరోగా బాపు ఓ సుందరకాండను రూపొందించారు. వెంకీ సుందరకాండ సూపర్ హిట్ అయితే నరేశ్ సుందర కాండ భారీ పరాజయాన్ని పొందింది. అయితే సుందరకాండ పేరుతోనే ఇప్పుడు నారా రోహిత్ హీరోగా ఓ సినిమా రూపుదిద్దుకుంది. ఇది నారా రోహిత్ కు 20వ చిత్రం కాగా, ఈ సినిమా ద్వారా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి దీనిని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీదేవి విజయ్ కుమార్‌తో పాటు వృతి వాఘని హీరోయిన్లుగా నటిస్తున్నారు. దీనికి లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చారు. సిద్ శ్రీరామ్ పాడిన ఫస్ట్ సింగిల్ బహుసా బహుసా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రానికి ప్రదీప్ ఎం వర్మ సినిమాటోగ్రఫీ అందించారు.

# గంగానది ప్రక్షాళన కోసం



వారణాసి... గంగా ఘాట్‌లన్నీ మంత్రాలతో నిండిపోయి ఉంటాయి. భక్తి పారవశ్యంతో నిండిపోవాలనీ, ఆ గంగా నదిలో స్నాన మాచరించాలనీ, అయినవాళ్లకి పుణ్యలోకాలు దక్కాలనీ... ఇలా ఎంతోమంది నిత్యం అక్కడికి చేరుకుంటారు. ఈ క్రమంలో వాళ్లు వదిలే చెత్త తక్కువేమీ కాదు. దీంతో గంగానదీ కలుషిత మవుతోంది. దీనికి కొంతైనా అడ్డుకట్ట వేయాలనుకున్నారు కొందరు మహిళలు.

ఆ నిర్ణయం వాళ్లకి ఉపాధిని అందిస్తోంది. గంగానది స్నానమాచరించాక ఆ వస్త్రాలను చాలామంది అక్కడే వదిలేస్తుంటారు. ఆ వస్త్రాలన్నీ గుట్టల్లా పేరుకొని పోతున్నాయి. వాటికోనరూపమిస్తే మాగుంటుందని తలచారు అక్కడి ఐఎఎస్ ఆఫీసర్ అక్షత్ వర్మ. స్థానిక హోప్ వెల్ఫేర్ ఫౌండేషన్‌తో కలిసి మహిళలకు వస్త్రాలతో బ్యాగుల తయారీలో శిక్షణ ఇప్పించారు. అలా శిక్షణ తీసుకున్న కొందరు మహిళలు 2023 డిసెంబరులో 'గ్రీన్ ఆర్మీ'గా ఏర్పడ్డారు. ఆ వస్త్రాలను సేకరించి, బ్యాగులుగా కడుతున్నారు. దీనికోసం వాటిని శుభ్రపరచడం, శానిటైజ్ చేయడం వంటివి చేస్తారట. ఆపైనే బ్యాగులుగా మలుస్తారట. వీళ్లంతా ఒకప్పుడు ఇల్లుదాటనివారే. కుటుంబానికి తోడు నిలవొచ్చు. పుణ్యక్షేత్రాన్ని పర్యావరణ హితంగా మలచొచ్చన్న ఆలోచనతో ఈ క్రతువులో భాగమయ్యారు. నిజానికి తొలిరోజుల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించొచ్చన్న ఆలోచనతో ఈ వస్త్రలను ఉచితంగా ఇచ్చారు ఆపై మున్సిపాలిటీ దుకాణాల వాళ్లు డబ్బులకు తీసుకోవడం మొదలుపెట్టారు. ఇక్కడి నీటి సమస్య ఎక్కువగా ఉండేది. అలాంటిది ఉన్న నీటిని కలుషితం చేయకుండా చూడమంటే పట్టించుకునేవారు కాదు. దీంతో మొదట బావులు, గుంటలు, నది చుట్టుపక్కల బాగు చేయడం మొదలుపెడ్డాం. అప్పుడే ప్లాస్టిక్ కవర్లు, దుస్తుల వృథాని చూసినప్పుడు బాధ వేసేది. దానికో పరిష్కారం చూపగలిగిం నందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ బ్యాగుల తయారీతోపాటు మార్పునకు కారణమవు తున్నామని గర్వంగా చెబుతారీ మహిళలు. □

# మహిళల హక్కుల కోసం పోరాటం చేసి..



మహిళా సమానత్వం, హక్కుల గురించి అందరూ మాట్లాడతారు.. కానీ వీటిపై పోరాటం చేసే వారు తక్కువమంది ఉంటారు. అలాంటి వారిలో వర్షా దేశ్‌పాండే గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆమె.. గత 35 ఏళ్లుగా లింగ సమానత్వం, భ్రూణహత్యల నిర్మూలన, మహిళల సంక్షేమం, హక్కులు, జనాభా నియంత్రణ, స్త్రీ ప్రత్యుత్పత్తి హక్కుల ఆరోగ్యం.. వీటిపై అలుపెరుగని పోరాటం చేస్తోంది.

ఓ సంస్థను నెలకొల్పిన ఆమె.. ఈ వేదికగా వివిధ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రస్తుత సమాజంలో మహిళల స్థితిగతులను కళ్లకు కడుతోంది. ఇలా ఆమె చేస్తోన్న ఈ కృషే తాజాగా ఆమెకు 'ఐక్యరాజ్య సమితి జనాభా పురస్కారం' దక్కేలా చేసింది. ఇందిరా గాంధీ, జేఆర్‌డీ టాటా తర్వాత ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న మూడో భారతీయురాలిగా ఘనత సాధించారు వర్ష. ఈ నేపథ్యంలో ఈ మహిళా లీడర్ గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు తెలుసుకుందాం..!

అలా ఎందుకు? అనిపించింది! వర్షది మహారాష్ట్రలోని సతారా జిల్లా. ఆమెది ముక్కుసూటి వ్యక్తిత్వం. తన మనసులోని భావాల్ని కుండబద్దలు కొట్టినట్లు ధైర్యంగా చెప్పడం ఆమెకు చిన్న వయసు నుంచే అలవాటు! అయితే 1980ల్లో తను కాలేజీలో చదువుకుంటున్నప్పుడు 'ముల్గి ఝాలి హో'అనే నాటకాన్ని చూసింది. మహిళ పైన వివక్షకు అద్దం పట్టేలా ఉన్న ఈ నాటకం ఆమె ఆలోచనలో పడేసింది. స్త్రీలకే ఇన్ని కష్టాలు? అసలు ఆడపిల్లల్ని ఈ సమాజం ఎందుకు వద్దనుకుంటోంది? అన్న ప్రశ్నలు నా మనసును మెలిపెట్టాయి. ఆపై ఇదే నాటకంలో నేనూ భాగమై.. ఊరూరా దీన్ని ప్రదర్శిస్తూ మహిళల వెతల్ని కళ్లకు కట్టడంలో కీలక పాత్ర పోషించా. అంతేకాదు.. స్త్రీలపై ఉన్న వివక్షను అంతమొందించి.. వారికీ పురుషులతో సమాన అవకాశాలు, హక్కులు కల్పించేలా. చేయడం మొదలుపెట్టా.. అంటోన్న వర్షం.. ఈ నాటకంతో తన కెరీర్ లక్ష్యమేంటో తనకు అవగతమైందని చెబుతోంది.

**లైబ్రరీతో మొదలు....** శక్తిని చాటుతూనే మహిళల సమానత్వం కోసం పోరాటం చేయాలని నిర్ణయించుకుంది "తొలుత 'ప్రతిశబ్ద' పేరుతో ఓ లైబ్రరీని ఏర్పాటుచేసింది. మహిళా రచయితలు రాసి వారి ఆత్మకథల్ని ఈ గ్రంథాలయంలో పొందారు. ఇవన్నీ చూశాక పెళ్లంటూ చేసుకుంటే నన్ను తనతో సమానంగా చూసే వ్యక్తి చేసుకోవాలనుకున్నా. ఓ రోజు పేపర్లో ఓ యాడ్ చూశా. కులమత భేదాలతో సంబంధం లేకుండా. కట్నంతో పనిలేకుండా వరుడికి వధువు కావాలని అందులో ఉంది. వెంటనే అతడిని సంప్రదించా. మొదట లేఖలతో మొదలైన మా పరిచయం నెమ్మదిగా ప్రేమలో పడే ఒకరినొకరం పూర్తిగా తెలుసుకున్నాక పెళ్లి చేసుకోవాలనుకున్నాం. అయితే మా ఇద్దరి కులాలు వేరు కావడంతో ఇంట్లో మా పెళ్లికి ఒప్పుకోలేదు. కానీ నెమ్మదిగా ఇంట్లో ఒప్పించి సంజీవ్ తో ఏడడుగులు నడిచా. ఆయన నా అభిరుచుల్ని అర్థం చేసుకొని ఆలోచనల్ని గౌరవిస్తారు. నాకు నచ్చిన అంశాల్లో నన్ను ప్రోత్సహిస్తారు. చాలా మంది పెళ్లయ్యాక తమ స్వేచ్ఛను కోల్పోతారు. కానీ నాకు మాత్రం వివాహం తర్వాతే పూర్తి స్వేచ్ఛలభించినట్ల నిపించింది..అంటూ తన లవ్ లైఫ్ గురించి చెబుతారు వర్ష .సమస్యలకు సమాధానంగా..! ఇక పెళ్లి తర్వాత ఓవైపు ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తూనే.. మరో వైపు న్యాయవిద్యను పూర్తి చేశారు. వర్ష చదువు పూర్తి న్యాయ పట్టా పుచ్చుకున్నాక మహిళా హక్కుల పోరాటంపై పూర్తి దృష్టి పెట్టారామె. ఈ విధంగానే 1990లో 'దళిత్ మహిళా వికాస్ మండల్' అనే సంస్థను స్థాపించారు. తొలి అడుగుగా వివాహబంధంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలేంటో తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా ఓ చిన్నపాటి సర్వే చేశారు. వాళ్ల సమస్యలను అంతమొందించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపాలనుకున్న ఆమె.. స్థానిక కలెక్టర్‌ని కలిసి ఆయా మహిళలకు సొంత రేషన్ కార్డులు ఇప్పించారు. అంతేకాదు..

వాళ్లకు జీవనోపాధి నైపుణ్యాలూ నేర్పించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 వేల మందికి పైగా మహిళలు తమ భర్త, అత్తింట్లో వేధింపులు, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్నారు. వీరికి ముఖ్యోద్దేశంతో ఇక్కడి కలెక్టర్ సహకారంతో మేం చేసిన తొలి ప్రయత్నం విజయవంతమైంది. పాకశాస్త్రంలో ప్రావీణ్యం ఉన్న ఆయా మహిళలకు చేయూతనందించాం.." అంటూ తాము ప్రారంభించిన పలు కార్యక్రమాల గురించి చెప్పారు. వర్ష. సమస్యలకు సమాధానంగా..! ఇక పెళ్లి తర్వాత ఓవైపు ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తూనే.. మరో వైపు న్యాయవిద్యను పూర్తి చేశారు. వర్ష చదువు పూర్తై న్యాయ పట్టా పుచ్చుకున్నాక మహిళా హక్కుల పోరాటంపై పూర్తి దృష్టి పెట్టారామె. ఈ విధంగానే 1990లో 'దళిత్ మహిళా వికాస్ మండల్' అనే సంస్థను స్థాపించారు. తొలి అడుగుగా వివాహబంధంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలేంటో తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా ఓ చిన్నపాటి సర్వే చేశారు. వాళ్ల సమస్యలను అంతమొందించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపాలనుకున్న ఆమె. □



# తేలిక పట్టు అందాలు



శుభాల శ్రామణంతో పండుగలు మొదలు అయ్యాయి. పండుగలు, పెళ్లిళ్లు ఒకటేమిటి ఎన్నెన్నో కార్యక్రమాలు. వేడుక ఏదైనా లక్ష్మీకళ ఉట్టిపడేలా కనిపించాలని మగువల ఆరాటం. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఫ్యూజన్ ట్రెండ్స్ ఎన్నో రకాలు వచ్చిపోతుంటాయి. కానీ దక్షిణ భారతంలో మాత్రం ప్రత్యేక సందర్భం అంటే పట్టు కట్టాల్సిందే. వీటిల్లోనూ ఎన్నో రకాలు. మరి ఏం ఎంచుకోవాలన్న ప్రశ్న రానే వస్తుంది. కంచి, బెనారస్, మంగళగిరి, ఉప్పాడ సిల్క్‌ల హవా నిన్నమొన్నటి దాకా సాగింది. ఇప్పుడు వెంకటగిరి, నారాయణపేట గద్వాల పట్టుదే ట్రెండ్ అంతా. ఒకప్పుడు అమ్మా, అమ్మమ్మలు ఎంచుకున్న ఈ తరం అమ్మాయిలూ ఎంతో ఇష్టంగా కట్టుకుంటున్నారు. ఆధునికంగా తయారవుతున్నారు. తేలిగ్గానూ ఉండటం వల్ల ఎంతో సౌకర్యంగానూ ఉంటున్నాయి. పూజ చేసినప్పుడూ, పేరంటానికి వెళ్లినప్పుడూ అనువుగా ఉంటాయి. జరీ అంచుల ధగధగలు శ్రావణ శోభ కళ్లకు కట్టేస్తాయి. అలాంటి డిజన్లలో ఇవి కొన్ని.









# బెల్లం వెన్న పొంగనాలు



కావాల్సినవి : దోశ పిండి, కొబ్బరి, బెల్లం, క్యారెట్ తురుము–కప్పు చొప్పున, నెయ్యి–నాలుగు చెంచాలు, వెన్న–కప్పు, కాజు, బాదం, పిస్తా ముక్కలు–పావు కప్పు.

**తయారీ:** పెద్ద గిన్నెలో దోశ పిండి, కొబ్బరి, క్యారెట్ తురుము, వెన్న, ఎండు ఫలాల ముక్కలు వేసి బాగా కలపాలి. పొయ్యి వెలిగించి గిన్నె పెట్టి బెల్లం వేసి, తగినన్ని నీళ్లు పోసి తీగ పాకం తయారు చేసుకోవాలి. ఈ పాకాన్ని దోశ పిండిలో పోసి చక్కగా కలపాలి. పొంగనాల పెనంలో కాస్తంత నెయ్యి రాసి ఈ పిండిని పొంగనాల్లా వేసుకోవాలి. కొద్ది కొద్దిగా నెయ్యి వేస్తూ రెండు వైపులా చక్కగా కాల్చుకోవాలి. అంతే రుచికరమైన తియ్యతియ్యని బెల్లం వెన్న పొంగనాలు రెడీ. □

# గోంగూర ప్రయోజనం- 2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

గోంగూరని ఏదో ఒక రూపంలో తీసుకుంటే సహజ ఔషధంలా పని చేస్తుంది. గోంగూర మన ఆరోగ్యానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. గోంగూర పచ్చడి కోడి మాంసంతో సమానమని చెప్తారు. వేడి చేసి బలం కల్గించే ఆకుకూరని పిల్లలు, వృద్ధులు అందరూ తీసుకోవచ్చు. గోంగూర సహజ మందు మరియు డైజెస్టివ్ బూస్టర్ అని చెప్పవచ్చు.

**రక్తశుద్ధికి:** గోంగూరలోని ఐరన్, విటమిన్ సి రక్తంలో హీమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనతని, అధిక రక్తస్రావాల్ని తగ్గిస్తుంది. ఇది లింఫాటిక్ రక్తప్రసరణకి మంచిది. ఫోలేట్స్, విటిమిన్ బి6 వల్ల హీమోస్థాసిస్ స్థాయుల్ని నిర్వహిస్తుంది. ఐరన్ లోపాన్ని తగ్గిస్తుంది. ఎర్రరక్తకణాల ఉత్పత్తికి, కణాలకి ఆక్సిజన్ సరఫరా చేసి ఎనర్జీ లెవల్స్‌ని పెంచి రక్తాన్ని శుద్ధిచేస్తుంది. స్లీఎస్ వ్యాధుల్ని నివారిస్తుంది. **రక్తపోటు:** కొలెస్ట్రాల్/గుండె గోంగూరలోని పొటాషియం, మెగ్నీషియం వల్ల అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. హైబిపి ఉన్నవారిలో రక్తప్రసరణని మెరుగుపరచి స్ట్రోక్, పక్షవాతం రాదు. గోంగూర నీళ్లు త్రాగిన చెడుకొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డిఎల్) పెరుగుతుంది. గోంగూరలోని లిపో ప్రోటీన్స్ వాసోడైలేటర్స్‌గా, రక్తనాళాలు కుచించుకుపోకుండా చేయడం వల్ల కార్డియోవాస్కులర్ వ్యాధులు, గుండె జబ్బులు రావు. గుండె ఆరోగ్యానికి గోంగూర చేసే మేలు అంతా ఇంతా కాదు.

**కేశ సంరక్షణకు:** జుట్టురాలడం, బట్టతల, తెల్లవెంట్రుకలు రావడం, జుట్టు చివర్లు చిట్లిపోవడం, కళావిహీనమైన జుట్టు, చుండ్రు వంటి సమస్యలకి గోంగూర పేస్ట్ మంచిది. గోంగూరని ఆహారంగా తీసుకుంటే వెంట్రుకలు నల్లగా, ఒత్తుగా, ఆరోగ్యంగా తయారవుతాయి.

**చర్మసౌందర్యానికి:** గోంగూరలోని అమినోఆసిడ్స్, అధిక విటమిన్స్ మినరల్స్ వల్ల చర్మం హైడ్రేట్‌గా, కాంతివంతంగా ఉంటుంది. మొటిమలు, వడగుల్లలు, కురుపులు, బొధకాలు, వాపులు, తెలికపాటి రక్తస్రావాల్ని, దీర్ఘ కాలిక చర్మవ్యాధుల్ని తగ్గిస్తుంది. **డయాబెటిస్:** గోంగూర డయాబెటిస్ రాకుండా చేస్తుంది. ఇది శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి చక్కెర, యూరిక్ ఆసిడ్ స్థాయిల్ని తగ్గిస్తుంది. ఇది ప్రీడయాబెటిక్స్‌కి, డయాబెటిక్ రోగులకి చాలా మంచిది. గోంగూరలోని ఫైబర్ చక్కెర శోషణని నెమ్మదింపచేసి, రక్తంలో చక్కెర స్థాయిల్ని పెరగకుండా నిరోధించడంలో సహాయపడతాయి. **ఎముకల బలం :** గోంగూరలోని కాల్షియం, మెగ్నీషియం వల్ల ఎముకలు దృఢంగా ఉండి కీళ్ళనొప్పులు, ఆస్టియోఫోరోసిస్ రాకుండా చేస్తాయి. గోంగూరలోని విటమిన్ బి,సి వల్ల విరిగినెముకల్ని తద్వారా నయం చేస్తుంది. చిగుళ్ళ సమస్యలు, దంతసమస్యలు, నోటి ఆల్సర్స్ తగ్గుతాయి. **పురుషులు :** గోంగూరలోని ఆంటిబాక్టీరియల్ ఎఫెక్ట్స్ వల్ల యూరిన్ ఇన్ఫెక్షన్స్ వరిబీజంని తగ్గించి మూత్రవిసర్జనని మెరుగుపరుస్తుంది. పురుషుల్లో వీర్యవృద్ధిని పెంపొందిస్తుంది. సుఖవ్యాధులు రాకుండా వాటి నివారణలో కూడా ఉపయోపడుతుంది.

**స్త్రీలు :** గోంగూర గర్భాశయానికి సరైన రక్త ప్రవాహాన్ని ప్రేరేపించి బహిష్టి సమస్యల్ని, అధిక రక్త స్రావాన్ని, పీరియడ్స్ క్రాంప్స్‌ని తగ్గిస్తుంది. థైరాయిడ్ సమస్యలకి కూడా గోంగూర చాలా మంచిది. గర్భిణీల్లో వచ్చే డయాబెటిస్, రక్తపోటు, జీర్ణకోశ సమస్యలకి, మొలలు, మల బద్ధకానికి గోంగూరలోని విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ వల్ల కంట్రోల్‌లో ఉంచుతాయి. ఆంటీ ఆక్సిడెంట్ల పవర్‌హౌస్ అయిన గోంగూర శిశువు అభివృద్ధికి చాలా మంచిది. పుట్టుకతో వచ్చే న్యూరల్ ట్యూబ్ లోపాలు వంటి అనేక వ్యాధులు రాకుండా డిఎన్ఎలో మార్పు తెస్తుంది. అయితే దీన్ని గర్భధారణలో మితంగా తీసుకుంటే ఒత్తిడి అదుపులో ఉంటుంది. గర్భిణీల్లో రోగనిరోధకశక్తి పెరిగి గర్భ స్రావాలు కావు. గోంగూర తింటే పాలు తగ్గిపోతాయి. శరీరంలో వాపులు, నీరు ఎక్కువ ఉంటే గోంగూరని పథ్యంగా తింటే నీరు తగ్గుతుంది.

**జాగ్రత్తలు :** గోంగూరని ఎక్కువగా తినకుండా మితంగా సంవత్సరం పొడవునా తీసుకోవచ్చు. వారానికి 1-2 సార్లు తినడమే మేలు. దగ్గు ఆయాసం, తుమ్ములు, ఎలర్జీ ఉన్నవారు ఏదో ఒక రూపంలో గోంగూరని తినడం వల్ల సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధకతని పెంపొదిస్తుంది (53%) కాబట్టి ఆకలి లేని వారికి మంచిది డయాబెటిస్, బి.పి.గుండెజబ్బులున్నవారు, గర్భిణీలు, బాలింతలు, మందులు ఎక్కువగా వాడేవారు మితంగా తీసుకోవాలి. గోంగూర ఎక్కువగా తింటే వేడి చేస్తుంది. ఆహారం సరిగా జీర్ణం కాదు. □

# ఈ దిండుతో గురకకి చెక్ !



మెనోపాజ్ వల్ల చాలామందికి చీమ చిటుక్కుమన్నా మెలకువ వచ్చేస్తుంది. దీనికి తోడు భాగస్వామి గానీ లేదా ఇంట్లో పెద్దవాళ్లుగానీ అదే పనిగా గురక పెడుతుంటే నిద్ర సంగతి దేవుడెరుగు.. ఆ శబ్దం చిర్రెత్తిస్తుంది. అందుకేనేమో ఈ మధ్య గురకని తగ్గించేందుకు మార్కెట్లోకి కొత్త ఉత్పత్తులు చాలానే వస్తున్నాయి. వాటిల్లో ఒకటి హూతీ యాక్టివ్ పిల్లో. ఇది గురక రావడాన్ని ముందే గుర్తించి, నిద్ర లోంచి లేవకుండానే తల పొజిషన్‌ను మార్చి శ్వాస సరిగ్గా అందేలా చేయడం ద్వారా గురకని నియంత్రిస్తుందట. అదెలా అని ఆశ్చర్యపోకండి. ఎందుకంటే ఇది ఏఐపిల్లో. 'దనెక్స్ట్ జనరేషన్ యాంటీ స్నోర్–పిల్లో' అనీ అంటున్నారు. చూడ్డానికి అచ్చం మెమరీ ఫోమ్ దిండులానే ఉంటుంది. ఈ దిండులోని సెన్సర్లు.. బోన్ కండక్షన్ టెక్నాలజీ సాయంతో గురక రాకని గుర్తించి.. బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌లోని ఆప్‌ను అలర్ట్ చేస్తాయి. అది కాస్తా గురక తీవ్రతనీ శ్వాస, గుండె వేగాల్నీ లెక్కించి.. ఆ వ్యక్తికి మెలకువ రాకుండానే దిండులో వైబ్రేషన్స్ వచ్చేలా చేసి తలను కదిలించేలా చేస్తుంది. తద్వారా గురకను అరికడుతుందట. మార్కెట్‌లో ఉన్న ఇది గురక బాధితులకి గొప్ప వరమే మరి! □

# ఆదిత్య హృదయం

ఆధ్యాత్మికం



రామ రావణ యుద్ధం భీకరంగా జరుగుతోంది. రాముడు రావణుడి శిరస్సులు ఖండిస్తుండగా ఓ తల కిందపడగానే ఆ స్థానంలో మరో తల మొలుస్తోంది. అప్పుడిక ఆదిత్య హృదయం జపించి విల్లెక్కుపెట్టి బాణాలు వదిలాడు. రావణుడు పడిపోయాడు. రామరావణ యుద్ధ సన్నివేశమిది. అరునాచలంలో శేషాద్రి స్వామి అవదూత దీన్ని గురించి ఓ నిగూఢ అర్థం తెలియజేశారు. కామక్రోధాలు రాక్షసుల వంటివి. రాక్షసులు నిశాచరులు. చీకటిలోనే కామ క్రోధాలు విజృంభిస్తాయి. వ్యక్తిలో అలాంటి గుణాలు ఉన్నంత వరకు ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలను లోబరచుకోవడం సాధ్యం కాదు. జ్ఞానజ్యోతి కాంతులను వెదజల్లినప్పుడే అజ్ఞానాంధకారం తొలగిపోతుంది. కామక్రోధాలూ, రాక్షసత్వం నశిస్తాయి. అటుపై ఇంద్రియాలు విషయతపన లేక అణగారిపోతాయి. రావణుడు కామక్రోధాలు మూర్తీభవించిన నిండు విగ్రహం. నిశాచరుల నియంత. అతడిపది తలలూ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలకు నిదర్శనం. శ్రీ రామచంద్రుడు తలలన్నింటినీ ఛేదించినా రావణుడు జీవించే ఉన్నాడంటే అతడిలో కామక్రోధాలు నశించ లేదని అర్థం. ఆదిత్యహృదయ పఠనంతో ఆ ప్రదేశమంతా వెలుగు నిండిపోయింది. అంధకారం అంతరించిపోయింది. కామక్రోధాలు అదృశ్యమయ్యాయి. అని విపులీకరించారు అవదూత స్వామి. ఆదిత్య హృదయానికి అసాధ్యమైంది ఏదీ లేదన్నారు మహర్షులు. □

# యాపిల్ తింటున్నారా..



రోజూ ఒక యాపిల్ తింటే డాక్టర్‌తో పని ఉండదని చిన్నప్పటి నుంచీ వింటున్నాం కదా! ఇంతకీ ఇందులో ఉన్న సుగుణాలేంటో, ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో చూద్దామా..

కెలోరీలు, పీచు, సి–విటమిన్, కాపర్, పొటాషియంలతో యాపిల్ మంచి పోషకాహారం. మలబద్ధక సమస్యను నివారిస్తుంది. ఇది రక్తపోటును క్రమబద్ధం చేస్తుంది. అగ్నాశయానికి (పాంక్రియాజ్) మంచిది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంట, తాపం, బాధల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మంచి పోషకాలతో దండిగా ఉంటుది కాబట్టి త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునేవారికి యాపిల్ మంచిది. అమెరికాలో 40 వేలమంది మీద జరిపిన పరిశోధనలో యాపిల్స్ తినేవారిలో గుండెజబ్బులు వచ్చే అవకాశం చాలా తక్కువని తేలింది. టైప్ 2 డయాబెటిస్, రక్తంలో చక్కెరలను నియంత్రిస్తుంది. సైనస్ ఉబ్బసం తదితర శ్వాస ఇబ్బందులను నివారిస్తుంది. క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది త్వరగా జీర్ణమవుతుంది కనుక వృద్ధులకు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కూడా మంచిది. మనలో చాలామంది యాపిల్ చెక్కు తీసి తినడానికి ఇష్టపడతాం. నిజానికి అందులో యాంటీ ఆక్సిడెంట్లు విస్తారంగాఉన్నాయి కాబట్టి తీయకుండానే తినాలని చెబుతున్నారు ఆహార నిపుణులు. యాపిల్ ఎలా తిన్నా రుచిగానే ఉంటుంది. □

# వచ్చే ఐపిఎల్ సీజన్‌కు..
# పాత జట్లకు ముగ్గురు గుడ్ బై

**• ఫ్రాంచైజీలు మారనున్న ప్లేయర్లు • ఆల్‌రౌండర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ వేట**


సంజూ శాంసన్


ఇషాన్ కిషన్


వెంకటేష్ అయ్యర్

**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని ఫ్రాంచైజీలు కొత్త సీజన్ కోసం సిద్ధమవుతున్నాయి. ఐపిఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ఇంకో ఎనిమిది నెలల సమయం ఉంది. అయితే గత సీజన్ ముగిసిన వెంటనే ట్రేడ్ విండో ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆటగాళ్లను ట్రేడ్ విండోద్వారా భర్తీ చేసుకునేందుకు ఫ్రాంచైజీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ముగ్గురు కీలక ప్లేయర్లు ఫ్రాంచైజీలు మారేందుకు సిద్ధమవుతున్నారు. సంజూశాంసన్‌తో పాటు మరో ఇద్దరు భారత ఆటగాళ్లు వచ్చే సీజన్‌లో ఫ్రాంఛైజీ మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఐపిఎల్‌లో గత కొన్నాళ్లుగా సంజూ శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఆ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ వికెట్ కీపర్ బ్యాటర్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అతడిని ట్రేడ్ ద్వారా కొనుగోలు చేయాలని భావిస్తోంది.ఎంఎస్ ధోని వచ్చే సీజన్‌లో ఆడడం అనుమానం అని, అందుకనే అనుభవజ్ఞుడైన,నమ్మకమైన వికెట్ కీపర్‌కోసం చెన్నై వెతుకుతున్నట్లు ఫ్రాంచైజీవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే సంజూపై దృష్టి సారించినట్లు సమాచారం. అలాగే ఐపిఎల్ 2025 సీజన్‌లో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 14 మ్యాచ్‌ల్లో 354 పరుగులు చేశాడు. ఇందులో ఓ శతకం కూడా ఉంది. అయితే నివేదికల ప్రకారం వచ్చే సీజన్‌లో అతడు కోల్‌కతా నైట్ రైడర్స్ తరుపున ఆడొచ్చు. నైట్ రైడర్స్ వారి బ్యాటింగ్ లైనప్ బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన వికెట్ కీపర్ కోసం వెతుకుతోంది. ఈ క్రమంలోనే కిషన్‌ను ట్రేడ్ విండో ద్వారా కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక ఐపిఎల్ 2025 మెగా వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.23.75 కోట్లు వెచ్చించి మరీ వెంకటేష్ అయ్యర్‌ను సొంతం చేసుకుంది. అయితే ఈ సీజన్‌లో వెంకటేష్ అయ్యర్ పెద్దగా రాణించలేదు. 21 సగటుతో 142 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో అతడిని వదులుకునేందుకు కోల్‌కతా సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బ్యాట్, బంతితో రాణించే భారత ఆల్‌రౌండర్ కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలో ట్రేడ్ విండో ద్వారా కెకెఆర్, హైదరాబాద్ జట్లు వెంకటేష్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను మార్చుకోనున్నట్లు సమాచారం. అయితే మరికొద్ది రోజుల్లోనే దీనిపై స్పష్టత రానుందని అంటున్నారు.



## వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో..
# వైష్ణవికి కాంస్యం
## పరుగులో అనిమేష్ విఫలం

**న్యూఢిల్లీ:** 2025 ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో భారతదేశానికి మిశ్రమ ఫలితాలు చోటు చేసుకున్నాయి. వైష్ణవి అడ్కర్ మహిళల సింగిల్స్ టెన్నిస్‌లో కాంస్య పతకాన్ని సాధించడం ద్వారా చరిత్ర సృష్టించగా, 200 మీటర్ల పురుషుల పరుగులో అనిమేష్ పతకానికి దూరమయ్యాడు. శుక్రవారం జరిగిన మహిళల టెన్నిస్‌లో వైష్టవి పతకాన్ని సాధించడం ద్వారా 46 సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికింది. స్లోవేకియాకు చెందిన ఎస్జెర్ మెరీతో జరిగిన వీరోచిత పోరాటం తర్వాత పుణేకు చెందిన 21 ఏళ్ల వైష్టవి సెమీఫైనల్లో 6-2, 4-6, 4-6 తేడాతో అధిగమించింది. అడ్కర్ మొదటి సెట్‌ను 6-2తో సాధించింది. కానీ మెరీ తిరిగి పుంజుకుని తరువాతి రెండు సెట్‌లను ఆధిక్యం కనపరచింది. సెమీఫైనల్ ఓటమి ఉన్నప్పటికీ, చివరి నాలుగు స్థానాలకు అడ్కర్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేసింది. ఆమె నాలుగు రౌండ్లలో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ప్రతి మ్యాచ్‌లోనూ ఆధిపత్యాన్ని సంపాదించింది. 64వ రౌండ్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన జోలియన్ మరియా జెనియా గీల్స్‌పై 2-0 తేడాతో ఆమె ప్రచారం ప్రారంభమైంది. తదుపరి రెండు రౌండ్లలో ఫిన్లాండ్‌కు చెందిన వెన్లా ఎలిసా అప్తి, కెన్యాకు చెందిన ఏంజెల్లా ఒకుటోయిపై వరుస సెట్ల విజయాలతో ముందుకు సాగింది. క్వార్టర్ ఫైనల్లో, అడ్కర్ జర్మనీకి చెందిన సినా హెర్మాన్‌ను ఎదుర్కొని మరోసారి 2-0 తేడాతో క్లీన్ విజయంతో ఫైనల్ ఫోర్‌లో స్థానం సంపాదించి, కనీసం కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కాగా 200 మీటర్ల పురుషుల ఫైనల్‌లో 20.85 సెకన్ల స్వల్ప సమయం నమోదుతో 4వ స్థానంలో నిలిచి భారత ఏస్ స్ప్రింటర్, జాతీయ రికార్డు హోల్డర్ అనిమేష్ కుజుర్ పతకాన్ని కోల్పోయాడు.

## మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ..
# భారత జట్టుకు టైటిల్

**న్యూఢిల్లీ:** యూనివర్సిటీ గేమ్స్‌లో టీమ్ ఈవెంట్లలో భారత మిక్స్‌డ్ కాంపౌండ్ జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది. టీమ్ ఈవెంట్లలో భారత కాంపౌండ్ ఆర్చర్లు ఒక స్వర్ణం, ఒక రజతం, మరియు ఒక కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. శుక్రవారం జర్మనీలోని ఎస్సెన్‌లో జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కుశాల్ దలాల్ మరియు పర్నీత్ కౌర్‌ద్వయం బంగారు పతకాన్ని సాధించడంతో భారత కాంపౌండ్ మిక్స్‌డ్ జట్టు తమ ప్రపంచ యూనివర్సిటీ గేమ్స్ టైటిల్‌ను నిలుపుకుంది. ఈ జంట 160 పాయింట్లకు గాను 157 పాయింట్లు సాధించి, ఫైనల్‌లో దక్షిణ కొరియా జంటను మూడు పాయింట్ల తేడాతో ఓడించింది. 2025 ఎఫ్ఐఎస్‌యు వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో భారతదేశానికి తొలి బంగారు పతకాన్నిసాధించింది. అంతకుముందు, భారత పురుషులు మరియు మహిళల కాంపౌండ్‌జట్లుకూడా రజత మరియు కాంస్యపతకాలను గెలుచుకున్నాయి. ఈ క్రీడలలో భారత్ ఖాతాలో మొత్తం పతకాల సంఖ్యను 5కు చేరాయి. 1 స్వర్ణం, 1 రజతం, 3 కాంస్య పతకాలు. పర్నీత్, అవనీత్ కౌర్ మరియు మధుర ధమన్‌గోంకర్‌లతో కూడిన మహిళల జట్టు గ్రేట్ బ్రిటన్‌ను ఓడించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మరోపక్క కుశాల్, సాహిల్ జాదవ్ మరియు హృతిక్ శర్మలతో కూడిన భారత్ పురుషుల జట్టు ఫైనల్‌లో తుర్కియే చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయింది. కుశాల్, పర్నీత్ రేపు వ్యక్తి గత కాంపౌండ్ ఈవెంట్ సెమీఫైనల్స్‌లో కూడా పోటీ పడనున్నారు. దేవ్ మీనా జాతీయ రికార్డు మరోవైపు, ఈ వర్ధమాన భారత పోల్ వాల్టర్ పురుషులపోల్‌వాల్ట్ ఈవెంట్‌అర్హతరౌండ్‌లో తనసొంతజాతీయ రికార్డును మెరుగుపరుచుకున్నాడు.

# మరోసారి ఇంగ్లాండ్‌కు టీమిండియా

**వన్డే, టి20 సిరీస్ షెడ్యూల్ విడుదల**
**వన్డేలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎంట్రీ**

**న్యూఢిల్లీ:** భారత జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. అక్కడ ఆతిథ్య జట్టుతో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. టెస్ట్ సిరీస్ ఉత్కంఠ మధ్య మరో వన్డే, టి20 షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ నియంత్రణ బోర్డు విడుదల చేసింది. దీంతో టీమిండియా మరోసారి ఇంగ్లాండ్‌లో పర్యటించనున్నది. ఇంగ్లాండ్ వేల్స్ క్రికెట్ బోర్డు, భారత క్రికెట్ బోర్డు వచ్చే ఏడాది భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు టి20, మూడు ఓడీఐ మ్యాచ్‌లు ఆడనున్నట్లు ప్రకటించాయి. ఓడీఐ, టి20 సిరీస్‌లు రెండూ జూలై 2026లో ఇంగ్లాండ్‌లో జరుగనున్నాయి. ఇక ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ జూలై 1న ప్రారంభంకానుండగా, వన్డే సిరీస్ అదే నెల 14న ప్రారంభమవుతుంది.ఆతర్వాత మిగిలినటి20 మ్యాచ్‌లు జూలై 4, 7, 9, 11 తేదీల్లో జరుగుతాయి. దీని తర్వాత మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఉంటుంది. వన్డే సిరీస్‌లో మొదటి మ్యాచ్ జూలై 14న జరుగుతుంది. మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు జూలై 16, 19 తేదీల్లో జరుగుతాయి. వచ్చే ఏడాది ఇంగ్లాడ్‌తో జరిగే వన్డే సిరీస్లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడనున్నారు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు తొలిసారి ఇంగ్లాండ్‌లో ఆడనున్నారు. కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న టి20 ప్రపంచ కప్ తర్వాత భారత్‌ఆడే తొలిటీ20 సిరీస్ ఇదే కావచ్చు. భారతజట్టు ఇంగ్లాండ్‌పర్యటన షెడ్యూల్ టి20 సిరీస్‌కు సంబంధించి జూలై 1న మొదటి టి20, దర్హమ్‌లో రాత్రి 11.00గంటలకు, 4న 2వ టి20, మాంచెస్టర్‌లో రాత్రి 7 గంటలకు, 7న 3వ టి20 నాటింగ్హామ్‌లో రాత్రి 11.00 గంటలకు, 9న నాలుగవ టి20 బ్రిస్టల్‌లో రాత్రి 11.00 గంటలకు, 11న 5వ టి20 సౌతాంప్టన్‌లో రాత్రి 11.00గంటలకు, వన్డే సిరీస్‌కు సంబంధించి 14 జూలైన మొదటివన్డే బర్మింగ్హామ్‌లో సాయంత్రం 5.30 గంటలకు 16న 2 వన్డే కార్డిఫ్‌లో సాయంత్రం 5.30గంటలకు, 19న 3వవన్డే లండన్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరగనున్నాయి.

## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో..
# సెమీఫైనల్స్‌కు అనహాత్



**న్యూఢిల్లీ:** అనాహత్ సెమీస్‌కు అర్హత సాధించింది. 2025 ప్రపంచ స్క్వాష్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశపు అగ్రశ్రేణి మహిళా స్క్వాష్ క్రీడాకారిణి అనహాత్ సింగ్ ఒక పురోగతిని నమోదు చేసింది. అనూహ్యంగా సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో తన తొలి పతకాన్ని నిర్ధారించు కుంది. ఢిల్లీకి చెందిన 17 ఏళ్ల, రెండవ సీడ్, క్వార్టర్ ఫైనల్స్‌లో ఈజిప్ట్‌కు చెందిన మలికా ఎల్కరాక్సీని 11-6, 13-11, 11-5 తేడాతో ఓడించి, ఆమె చివరి ఎనిమిది నిష్క్రమణల పరంపరను బద్దలు కొట్టింది. కైరోలోని బ్లాక్ బాల్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన పక్షపాత స్వదేశీ ప్రేక్షకుల ముందు జరిగిన ప్రారంభ గేమ్‌లో 5-6తో వెనుకబడిన తర్వాత, ఆమె వరుసగా ఆరు పాయింట్లు సాధించి మొదటి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండవ గేమ్‌లో ఎల్కరాక్సీ రెండు గేమ్ బంతులను పట్టుకుంది, కానీ అనాహత్ ధైర్యంగా 13-11 తేడాతో విజయం సాధించింది. ప్రత్యర్థి బలహీనతను అవకాశంగా తీసుకున్న అనాహత్ త్వరగా మూడవ గేమ్‌ను ముగించింది.2022, 2023, 2024లో వరుసగా మూడు సంవత్సరాలు జూనియర్ వరల్డ్స్‌లో అనాహత్ క్వార్టర్ ఫైనల్ దశలోనే నిలిపివేయబడింది. ఆమె ఇప్పుడు సెమీఫైనల్‌లో ఈజిప్ట్‌కు చెందిన నదియన్ ఎల్హమ్మమితో తలపడనుంది.

# వాణిజ్యం

# రూ.9లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

**ముంబై, జూలై 25:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్‌తోపాటు ఇతర ఫైనాన్షియల్ స్టాక్స్, అధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. ముఖ్యంగా ఎఫ్ఐఐల అమ్మకాలు, భారత్ అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌పై అనిశ్చితి, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు ఇందుకు కారణంగా నిలిచాయి. దీంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఈ రెండు సెషన్లలోనే సెన్సెక్స్ 1264 పాయింట్లు కోల్పోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9 లక్షల కోట్లు క్షీణించి రూ.451 లక్షల కోట్లకు చేరింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు కూడా అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 82,065.76 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,184.17) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,397.69 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 721.08 పాయింట్ల నష్టంతో 81,463.09 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.10 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.52గా ఉంది. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.33 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ అమెరికా మధ్య ట్రేడ్ డీల్ విషయంలో గత కొన్ని రోజులుగా అదిగో, ఇదిగో అనే మాటలు వినిపిస్తున్నాయే తప్ప చర్చలు మాత్రం ఓ కొలిక్కి రాలేదు. అగ్రికల్చరల్, డెయిరీ ప్రొడక్టుల విషయంలో ఇరు దేశాల మధ్య సయోధ్య కుదరడం లేదని తెలుస్తోంది. అదే సమయంలో జపాన్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, వియత్నాం వంటి దేశాలతో అమెరికా ఇప్పటికే ట్రేడ్ డీల్స్ కుదుర్చు కుంది. మరోవైపు ఆగస్టు 1 డెడ్‌లైన్ సమీపిస్తుండడంతో మదుపర్ల అప్రమత్తత కారణమని తెలుస్తోంది.విదేశీ సంస్థాగత మదుపర్లు కొన్నాళ్లుగా మన ఈక్విటీల్లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. జులైలో ఇప్పటి వరకు రూ.28,528 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా.. గడిచిన నాలుగు రోజుల్లో రూ.11,527 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు డేటా చెబుతోంది.



# కృత్రిమ మేధతో అంతా గందరగోళం: మైక్రోసాఫ్ట్ సిఇఒ

**వాషింగ్టన్, జూలై 25:** మైక్రోసాఫ్ట్‌లో భారీగా ఉద్యోగాల కోత విధించడం సీఈవో సత్యనాదెళ్లను కూడా భావోద్వేగపరంగా కదిలించింది. అదే సమయంలో కృత్రిమ మేధతో చోటుచేసుకొంటున్న మార్పులు గందరగోళంగా ఉన్నాయన్నారు. ఆయన ఉద్యోగులకు వీడ్కోలు పలుకుతూ ఎమోషనల్ మెసేజ్‌ను పంపారు. దీనిలో ఆయన చాలా సూటిగా రాసుకొచ్చారు. అన్ని విషయాల కంటే ముందు భావోద్వేగపరంగా నాపై ప్రభావం చూపుతున్న అంశాలపై మాట్లాడాలనుకుంటున్నాను. అదే సమయంలో మీరు దేనిగురించి ఆలోచిస్తున్నారో కూడా నేను అర్థం చేసుకోగలను. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టం. అవి మా తోటి ఉద్యోగులపైనా ప్రభావం చూపుతాయి. మన టీమ్‌మేట్స్, కొలీగ్స్, ఫ్రెండ్స్‌తో మనకు ఎన్నో అనుభవాలు, అనుబంధాలు, జ్ఞాపకాలు ఉంటాయి. ఇది ఓ పరిశ్రమ విజయరహస్యమే అయినా దానికి ఎలాంటి విలువ లేదు. అభివృద్ధి గీత గీసినట్లు సూటిగా ఉండదు.. ఎగుడుదిగుడులు ఉంటాయి. కొన్నిసార్లు వైవిధ్యంగా కూడా ఉంటుంది. కానీ, ఎప్పుడూ పురోగతిని కోరుకుంటుంది. కానీ, మార్పునకు ఇది మనకిచ్చే సరికొత్త అవకాశం. భవిష్యత్తులో మరింత ముందుకుసాగండి అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. అంతేకాదు.. మైక్రోసాఫ్ట్ భవిష్యత్తు దార్శనికతలో ఏఐ కీలక భాగమనే సందేశాన్ని ఆయన ఈ మెమోలో పేర్కొన్నారు.భూమిపై ప్రతి వ్యక్తి, సంస్థ మరింత అభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా కృత్రిమేధ సంస్కృతికి అలవాటుపడాల్సిందేనన్నారు. కొత్తతరం ఏఐ అంటే కేవలం కొన్నింటికి అవసరమైన టూల్స్‌ను అభివృద్ధి చేయడం కాదన్నారు. ప్రతి ఒక్కరూ సొంతంగా తమకు అవసరమైన టూల్స్‌ను తయారు చేసుకునేందుకు కావాల్సిన టూల్స్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఈ క్రమంలో భవిష్యత్తులో మరిన్ని లేఆఫ్‌లు ఉండవన్న హామీ మాత్రం ఆయన నుంచి రాలేదు. మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల సంఖ్యలో మాత్రం పెద్దగా మార్పులు లేవని ఆ నోట్‌లో పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు, వ్యాపారాల్లో కృత్రిమమేధతో మార్పులు చోటుచేసుకొంటున్న వేళ.. ఉద్యోగులు గ్రోత్ మైండ్‌సెట్‌తో ఉండాలని కోరారు. ప్రస్తుతం తాను గందరగోళానికి గురవుతున్నాను. కానీ, మార్పులు చోటుచేసు కొనే సమయంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితి తప్పదు. మా టీమ్‌లను పునర్ వ్యవస్థీకరిస్తున్నాం.. దీంతో పరిధులు పెరుగుతున్నాయి. సరికొత్త అవకాశాలు అన్ని చోట్లా ఉన్నాయన్నారు.



# ఎంజి నుంచి సైబర్‌స్టర్ 'ఇవి'

**ముంబై, జూలై 25:** జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా దేశీయ మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును లాంచ్ చేసింది. ఈ కారు ధరను రూ.74.99 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. ప్రీరిజర్వేషన్ చేసుకున్న వారికి రూ.72.49 లక్షలకే అందిస్తామని ప్రకటించింది. ఈ ఏడాది జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో దీన్ని తొలుత ప్రదర్శించారు. తాజాగా దేశీయంగా లాంచ్ చేశారు. ఎంజీ సెలక్ట్ ప్రీమియం డీలర్‌షిప్ కేంద్రాల్లో లభిస్తుంది. ఎంజీ సైబర్‌స్టర్ ఫోల్డింగ్ సాఫ్ట్ టాప్ రూఫ్, సిజర్ డోర్స్‌తో 2 సీటింగ్‌తో వస్తోంది. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్, యారో షేప్డ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్ ఉన్నాయి. 20 అంగుళాల లైట్ వెయిట్ అల్లాయ్ వీల్స్‌తో వస్తోంది. కారు లోపలి భాగంలో 10.25 అంగుళాల సెంట్రల్ టచ్‌స్క్రీన్, 7 అంగుళాల డిజిటల్ ప్యానెల్ ఇచ్చారు. వీటి సాయంతో రియల్‌టైమ్ వెహికల్ డేటా, ఎటర్‌టైన్‌మెంట్, సెట్టింగ్స్‌ను యాక్సెస్ చేయొచ్చు. పీఎం 2.5 ఫిల్టరేషన్‌తో డ్యూయల్ జోన్ క్లైమేట్ కంట్రోల్‌తో వస్తోంది.



# బ్రిటన్ ఒప్పందంతో భారత్‌కు ప్రయోజనం: ఆర్‌బిఐ గవర్నర్

**న్యూఢిల్లీ, జూలై 25:** భారత్, బ్రిటన్ మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడాన్ని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్వాగతించారు. ఇరుదేశాలు చేసుకున్న ఈ ఒప్పందం భారత ఆర్థికవ్యవస్థలోని బహుళ రంగాల అభివృద్ధికి సహాయపడుతుందని తెలిపారు. ఇతర దేశాలతోనూ భారత్ ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. అనేక దేశాలు కలిసి పనిచేసే విధానం తగ్గిపోతున్న నేపథ్యంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు మేలు చేకూరుస్తాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. బీఎఫ్ఎస్ఐ సమ్మిట్‌లో మాట్లాడుతూ ఆర్బీఐ గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ అమెరికాతో సహా పలు దేశాలతో వాణిజ్య చర్చలు కొనసాగిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. అగ్రరాజ్య ఆర్థికాభివృద్ధికి అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ తీసుకుంటున్న చర్యలను సంజయ్ సమర్థించారు. ఆయన తన పనిని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారన్నారు. కాగా పావెల్ నిర్ణయాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న సమయంలో ఫెడరల్ రిజర్వ్ స్వయంప్రతిపత్తితో పనిచేస్తుండడాన్ని సంజయ్ మల్హోత్రా ప్రశంసించడం గమనార్హం. విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ బ్రిటన్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ఇరుదేశాల మధ్య బంధాలను మరింత పెంచుకునే చర్యల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల సమక్షంలో ఇరుదేశాల వాణిజ్య మంత్రులు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో ఇరుదేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం కానుంది. బ్రిటన్‌కు భారత ఎగుమతుల్లో 99శాతం ఉత్పత్తులపై సుంకాల భారం తగ్గనుంది. దుస్తులు సహా చాలా వ్యవసాయ రంగ, ఆహారశుద్ధి ఉత్పత్తులకు టారిఫ్‌ను లండన్ పూర్తిగా మినహాయించనుంది. బ్రిటన్(యూకే) నుంచి దిగుమతయ్యే స్కాచ్ విస్కీ, జిన్‌లపై సుంకాన్ని మన దేశం సగానికి తగ్గించనుంది. తాజా ఎఫ్‌టీఏతో ఇరుదేశాల్లోనూ పలు రంగాల్లో వేలకొద్దీ ఉద్యోగావకాశాలు రానున్నాయి.



# ఎగుమతుల్లో 'మారుతి కాంపాక్ట్ ఎస్‌యువి' రికార్డు

**ముంబై, జూలై 25:** భారత ఆటోమొబైల్ తయారీలో మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ తన కాంపాక్ట్ ఎస్‌యువి ఫ్రాంక్స్ ఎగుమతుల్లో రికార్డు నెలకొల్పింది. భారతదేశం నుంచి వేగంగా ఒక లక్షల ఎగుమతులను అధిగమించిన ఎస్‌యువిగా నిలిచిందని కంపెనీ ప్రకటించింది. 2023 జూన్‌లో ప్రపంచ ఎగుమతి కార్యకలాపాలు ప్రారంభమైన కేవలం 25 నెలల్లోనే ఈ మైలురాయిని చేరుకుందని చెప్పింది. గుజరాత్‌లోని మారుతి సుజుకి ప్లాంట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్రాంక్స్ లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాతో సహా విదేశీ మార్కెట్లలో బలమైన పనితీరును కనబరుస్తోందని కంపెనీ తెలిపింది. జపాన్‌లో దీనికి పెరుగుతున్న ప్రజాదరణ ఎగుమతి వృద్ధికి దోహదం చేసిందని చెప్పింది. మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ హిసాషి టేకుచి మాట్లాడుతూ, ప్రపంచ మార్కెట్ల ప్రభావం స్థాయి వాహనాలను తయారు చేయగల సామర్థ్యం కంపెనీకి ఉంది. మేక్ ఇన్ ఇండియా చొరవకు కంపెనీ సాధించిన విజయమే నిదర్శనం. ప్యాసింజర్ వాహన ఎగుమతులు, అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టిసారిస్తున్నాం అని అన్నారు. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే మారుతి సుజుకి 96వేల వాహనాలను ఎగుమతి చేయడం విశేషం. భారతదేశ ప్యాసింజర్ వాహన ఎగుమతుల్లో రికార్డు స్థాయిలో 47శాతం వాటాను ఆక్రమించింది. వరుసగా నాలుగో యేడాది భారతదేశపు టాప్ ప్యాసింజర్ వాహన ఎగుమతిదారుగా కంపెనీ తన స్థానాన్ని నిలుపుకుంది.



# ఇంటెల్‌లో 25వేల మందికి ఉద్వాసన

**ముంబై, జూలై 25:** ప్రపంచ చిప్ దిగ్గజం ఇంటెల్ తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 25,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించనున్నట్టు నివేదించింది. ప్రస్తుతం 1,08,900 మంది ఉద్యోగులున్న ఈ సంస్థ.. 2025 చివరి నాటికి ఉద్యోగుల సంఖ్యను 75,000కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఉద్యోగ కోతలు లేఆఫ్‌లు, సహజ విరమణలు, ఇతర చర్యల ద్వారా జరుగుతాయని కంపెనీ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇంటెల్ ఇప్పటికే సుమారు 15 శాతం (సుమారు 15,000) ఉద్యోగాలను తగ్గించింది. గత ఏడాది కూడా 15,000 కంటే ఎక్కువ ఉద్యోగాలను తొలగించడం గమనార్హం. 2024 రెండవ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తూ ఇంటెల్ ఈ లేఆఫ్‌లను ధ్రువీకరించింది. కంపెనీ 2.9 బిలియన్ డాలర్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇందులో తాజా తగ్గింపులకు సంబంధించిన పునర్వ్యవస్థీకరణ ఖర్చులు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, త్రైమాసికఆదాయం 12.9బిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. ఇది మార్కెట్ అంచనాలను అధిగమించడం విశేషం. ప్రస్తుత త్రైమాసికంలో ఆదాయం 12.6 బిలియన్ డాలర్ల నుంచి 13.6 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని, సగటు న 13.1 బిలియన్ డాలర్లుగా ఉంటుందని ఇంటెల్ అంచనా వేస్తోంది. ఇది విశ్లేషకుల అంచనాల కంటే ఎక్కువ కావడం కొంత సానుకూల అంశం. ఒకప్పుడు ప్రపంచ చిప్ మార్కెట్ లో అగ్రగామిగా ఉన్న ఇంటెల్ ఇటీవలి సంవత్సరాలలో తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. 1990లలో పర్సనల్ కంప్యూటర్ బూమ్ సమయంలో మైక్రో ప్రాసెసర్ వ్యాపారంలో ఆధిపత్యం వహించినప్పటికీ ఆ తర్వాత వెనుకబడిపోయింది. ప్రస్తుతం ఎన్‌విడియా వంటి కంపెనీలు నాయకత్వం వహిస్తున్న, వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమమేధస్సు (ఏఐ)చిప్ విభాగంలో ఇంటెల్ వెనుకబడి ఉంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.